www.vishvambhara.com
తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

మంగళవారం
05-11-2024

సంపుటి : 01 | సంచిక : 183 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్






### సోలాపూర్ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గంలో

# వైదొలగిన ఇండిపెండెంట్ అభ్యర్థి శ్రీనివాస్ సంగ

- బీజేపీ అభ్యర్థికి పోటీగా బరిలోకి పద్మశాలీ నేత
- ఫలించిన బొల్ల శివ శంకర్, కందగట్ల స్వామి చాణక్యం



**సోలాపూర్ (మహారాష్ట్ర) :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సోలాపూర్ సెంట్రల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పద్మశాలి సమాజానికి చెందిన దేవేందర్ కొటేకు టికెట్ ఖరారైంది. ఇదే అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా పోటీ పడ్డ పద్మశాలి నేత శ్రీనివాస్ సంగ టికెట్ రాకపోవడంతో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీలో బరిలో నిలిచారు. దీంతో విషయం తెలుసుకున్న అఖిల భారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం జాతీయ అధ్యక్షులు బొల్ల శివ శంకర్, అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు కందగట్ల స్వామి రాజకీయ చాణక్యం నెరిపి పద్మశాలి సంఘం నేత శ్రీనివాస్ సంగను కలిసి పద్మశాలి సమాజం, పద్మశాలి సంఘ అభ్యర్థి గెలుపు కోసం బరి నుండి విత్ డ్రా చేసుకునే విధంగా సుదీర్ఘ మంతనాలు జరిపి ఆయనకు రాజకీయ భరోసా కల్పించి విజయవంతం అయ్యారు. దీంతో సోలాపూర్ యావత్ పద్మశాలి సమాజం హర్షం వ్యక్తం చేసింది. పద్మశాలి సమాజంలో ఇద్దరు వ్యక్తులు పోటీ పడితే సోలాపూర్ సెంట్రల్ నియోజకవర్గంలో పద్మశాలి సమాజంలో ఉన్న దాదాపు లక్ష ఓట్లు చీలిపోయి వేరే పార్టీ వ్యక్తులు గెలిచే ప్రమాదం ఉండడంతో అఖిల భారత జాతీయ నేతలు ఇద్దరి మధ్య రాజకీయ సయోధ్య కుదిర్చి రాజకీయంగా మొదటి విజయం సాధించారు.. దీంతో సోలాపూర్ సెంట్రల్ నియోజకవర్గంలోని పద్మశాలి ప్రజలంతా అఖిల భారత జాతీయ నేతలు. గొల్ల శివ శంకర్ కందగట్ల స్వామిల రాజనీతిపై ప్రశంసల వర్షం కురిపించారు.. జరగబోయే పద్మశాలి ఎన్నికల్లో అఖిల భారత నేతలు ముందుండి పద్మశాలి బిడ్డ అయిన దేవేందర్ కోటేను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని యావత్ సోలాపూర్ పద్మశాలి సమాజం అఖిల భారత పెద్దలకు విన్నవించింది. సోలాపూర్ ఎన్నికల్లో రాజకీయ చతురతతో చక్రం తిప్పిన అఖిల భారత పద్మశాలి సంఘం నేతలను తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం సమాజమంతా అభినందనలు తెలుపుతూ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా బొల్ల శివ శంకర్ కందగట్ల , స్వామి మాట్లాడుతూ మహారాష్ట్ర మరాఠా మహాసంగ్రామంలో ముగ్గురు పద్మశాలి నేతలకు ఎమ్మెల్యే టికెట్లు ఖరారు అయ్యాయని , సోలాపూర్ సెంటర్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థిగా దేవేందర్ కోటే, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎన్సీపీ అభ్యర్థి పోటీలో నిలిచారు. వారి గెలుపు కోసం తెలంగాణ రాష్ట్రం నుండి. పెద్ద ఎత్తున తరలివచ్చి విస్తృత ప్రచారం నిర్వహించనున్నామని, ముగ్గురు అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా అఖిల భారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం ఉమ్మడి ప్రణాళికతో ముందుకు వెళుతుందని సంఘ పెద్దలు బొల్ల శివ శంకర్, కందగట్ల స్వామి స్పష్టం చేశారు.. ముగ్గురు అభ్యర్థులను గెలిపించుకొని మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మన పద్మశాలీల సత్తా చాటుదామని యావత్ పద్మశాలి సమాజానికి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం యువజన విభాగం అధ్యక్షులు అవ్వారి భాస్కర్,తెలంగాణ ప్రాంత పద్మశాలి రాష్ట్ర మీడియా అధ్యక్షులు బొమ్మ అమరేందర్. అఖిల భారత పద్మశాలి సంఘం సెక్రటరీ తుకేష్ బైరి పాల్గొన్నారు.

# సీఎంకు బీసీ సంఘాల కృతజ్ఞతలు

### రిజర్వేషన్ల అమలుకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటుపై హర్షం



**విశ్వంభర, హైదరాబాద్:** న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు అమలయ్యేందుకు వీలుగా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసినందుకు గాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీ సంఘాలు కృతజ్ఞతలు తెలియజేశాయి. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య , ఎమ్మెల్యే దానం నాగేందర్ గారు, ఫిషర్ మెన్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్ , బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వి.కృష్ణమోహన్ రావు బీసీ సంఘాలకు చెందిన ఇతర నేతలు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ధన్యవాదాలు తెలిపారు. డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య , బీసీ సంఘం నేతలు సీఎంతో అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని, ఆ ప్రక్రియలోనే డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు.

### 24 గంటల ఉచిత కరెంట్..

# కేసీఆర్ ఘనత

**- మాజీ మంత్రి హరీశ్‌రావు**

**విశ్వంభర, హైదరాబాద్:** 24 గంటల పాటు కరెంట్ విషయంలో కాంగ్రెస్ పార్టీ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు' అన్నట్లుగా జాతీయ కాంగ్రెస్ పార్టీ తీరు ఉందని ఎద్దేవా చేశారు. దేశంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంట్‌ను అందించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలిపింది బీఆరెస్, కేసీఆరేనని తెలిపారు. కానీ ఆ ఘనత కూడా తమదేనంటూ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. గతంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటు దండగ అని, మూడు గంటల విద్యుత్ సరిపోతుందని రైతు వ్యతిరేక వైఖరిని ప్రకటించిన చరిత్ర కాంగ్రెస్‌తోపాటు సీఎం రేవంత్‌రెడ్డిదని మండిపడ్డారు. ఇప్పుడేమో ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఓట్ల కోసం కేసీఆర్ సాధించిన ఆ ఘనతను తమ ఖాతాలో వేసుకుంటూ దేశవ్యాప్తంగా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆక్షేపించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సాధించిన అభివృద్ధిని చూపించుకునే ముఖం లేక, తెలంగాణలో బీఆరెస్ సాధించిన అభివృద్ధిని చూపించి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇది కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి, మోసపూరిత విధానానికి మరో నిదర్శమని పేర్కొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా పోరుబాట పట్టిన మాజీ సర్పంచులు

*** చేపట్టిన పనులకు బిల్లులు రాలేదని ఆవేదన**
*** ఎక్కడికక్కడ అరెస్టులు**



**విశ్వంభర, హైదరాబాద్:** పెండింగ్ బిల్లులు విడుదల చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లు నిరసన చేపట్టారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లి వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయించుకోగా మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్టు చేసి వివిధ స్టేషన్లకు తరలించారు. అప్పులు తెచ్చి గ్రామాల్లో శ్మశానవాటికలు, క్రీడా ప్రాంగణాలు, డంపింగ్ యార్డులు వంటి అనేక అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. ఆయా పనులకు సంబంధించి 2019నుంచి 2024వరకు బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో బిల్లులు చెల్లించాలని సీఎం, గవర్నర్ సహా అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవట్లేదని ఆరోపిస్తున్నారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వస్తున్న మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేయడం సరికాదని చెబుతున్నారు.

**మాజీ సర్పంచుల పరిస్థితి దారుణం :** పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచులు ఏడాదిగా తిరుగుతున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. వారి కుటుంబాలను రోడ్డున పడేయడం దారుణమని తెలిపారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిని ఎందుకు అరెస్టు చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం :** మాజీ సర్పంచుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సీఎంను కలిసేందుకు వచ్చిన వారిని అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేసిన డబ్బు ఇవ్వాలని కోరితే అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. మాజీ సర్పంచులు అంతా అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యాపిల్లల బంగారం తాకట్టు పెట్టి పనులు చేపట్టారని తెలిపారు. ప్రజాపాలన అంటే గ్రామానికి సేవ చేసిన వారిని అరెస్టు చేయడమేనా?అని ప్రశ్నించారు.

**మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు :** మాజీ సర్పంచ్‌ల నిరసన కార్యక్రమం నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఆదివారం అర్ధరాత్రి సర్పంచ్‌లను అరెస్టు చేసి బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సీఎం అయి న తర్వాత గ్రామపంచాయతీలు అధ్వానంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాము గ్రామాలలో అభివృద్ధి చేయడం కోసం తమ ఆస్తులు తాకట్టు పెట్టి పంచాయతీల నిర్వహణ కొనసాగించామని తెలిపారు. కానీ ప్రభుత్వం పంచాయతీలకు ఒక్క పైసా కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ బిల్లులు అడిగేందుకు హైదరాబాదులో చేస్తున్న నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా తమను అర్ధరాత్రి పోలీసులు నిర్బంధించడం శోచనీయమని అన్నారు. ప్రభుత్వం బిల్లులను విడుదల చేయని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# డిసెంబర్ 19 నుంచి పుస్తక ప్రదర్శన

*** ఈసారి 300 స్టాళ్ల ఏర్పాటు**
*** విద్యార్థులకు ప్రవేశం ఉచితం**



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రతి ఏటా విలువైన జ్ఞానాన్ని అందించి, తనదైన లోకంలో అనుభూతులను పంచే పుస్తక ప్రదర్శనశాల త్వరలోనే నగరవాసులను మరోమారు పలకరించనుంది. ప్రతి ఏడాది హైదరాబాద్‌లో నేషనల్ బుక్ ఫెయిర్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఎన్నో ఏళ్లుగా ఆనవాయితీగా వస్తున్న ఈ బుక్ ఫెయిర్ 37వ ఎడిషన్‌తో ఈ ఏడాది కూడా మీ ముందుకొచ్చింది. డిసెంబర్ 19 నుంచి 29 వరకు పుస్తక ప్రదర్శనను నిర్వహించనున్నట్టు బుక్ ఫెయిర్ సొసైటీ ప్రకటించింది. ఈ మేరకు సోమాజీగూడలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరాం, బుక్ ఫెయిర్ సలహాదారు ఆచార్య రమా మెల్కొటే సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ మేరకు కార్యక్రమంలో బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్ మాట్లాడుతూ.. ఈసారి నిర్వహించే పుస్తక ప్రదర్శనకు ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం, సీనియర్ ఎడిటర్ రామచంద్రమూర్తి, ప్రొఫెసర్ రమా మెల్కొటే గౌరవ సలహాదారులుగా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా గౌరవ సలహాదారులతో పాటు కమిటీ సభ్యులు బుక్ ఫెయిర్‌కు సంబంధించిన లోగోని ఆవిష్క రించారు . మొత్తంగా 300 పుస్తక స్టాళ్లను ఏర్పాటు చేస్తామని.. ఇందుకోసం త్వరలోనే లాటరీ నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు వెల్లడించారు. పుస్తక సందర్శకులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

పుస్తక ప్రదర్శనకు సంబంధించిన లోగో ఆవిష్కరణ

**ఐడీ కార్డులతో ఉచిత ప్రవేశం :** ప్లాస్టిక్ నిషేధాన్ని పాటిస్తూ.. సందర్శకుల కోసం టికెట్లతో పాటు బుక్స్ కోసం 'సంచి'ని ఇస్తామని బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్ తెలిపారు. రచయితలు, పబ్లిషర్లు తమ స్టాళ్లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు తమ ఐడీ కార్డులతో ఫ్రీ ఎంట్రీ కల్పిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9490099081ను సంప్రదించవచ్చని సూచించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్సీ కోదండరాం.. పుస్తక ప్రదర్శన నగరవాసులకు మంచి అవకాశంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బుక్ ఫెయిర్ సెక్రటరీ వాసు, కోశాధికారి నారాయణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు కె.బాల్ రెడ్డి, శోభన్ బాబు, జాయింట్ సెక్రటరీలు కె.సురేశ్ , ఎం. సూరిబాబు, ఈసీ సభ్యులు జనార్ధన్ గుప్తా, విజయారావు , మధుకర్ , కోటేశ్వర రావు, శ్రీకాంత్ , శ్రీనివాసరావు, సాంబశివరావు, స్వరాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ గేటు పడి ఒకటో తరగతి విద్యార్థి మృతి

### హయత్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విషాదం

**విశ్వంభర, హైదరాబాద్:** మృత్యువు ఎలా వస్తుందో ఎవరికి తెలియదు. కొన్నిసార్లు మన నిర్లక్ష్యం, పొరపాటే మనపాలిట శాపంగా మారుతుంది. కానీ ఇక్కడ మాత్రం ఎవరో చేసిన పొరపాటు, నిర్లక్ష్యానికి ఆ చిన్నారికి అప్పుడే నూరేళ్లు నిండేలా చేసింది. రంగారెడ్డి జిల్లా హయత్ నగర్‌లోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో సోమవారం సాయంత్రం ఈ విషాదం చోటు చేసుకుంది. సాయంత్రం పాఠశాలలో తోటి పిల్లలతో అజయ్ ఆడుకుంటున్నాడు. కొంతమంది పిల్లలు గేటు ఎక్కి అటూ ఇటూ ఊగుతూ ఆడుకుంటున్నారు. గేటు వెల్డింగ్ జాయింట్లు బలహీనంగా ఉండడంతో విరిగి అక్కడే ఆడుకుంటున్న అజయ్ మీద పడింది. గేటు మీద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన పాఠశాల సిబ్బంది వెంటనే చిన్నారిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

**ఆ తల్లిదండ్రులకు ఒక్కగానొక్క సంతానం :** అక్కడ చికిత్స పొందుతూ అజయ్ చనిపోయాడు. సమాచారం అందుకున్న హయత్‌నగర్ పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి పోలీసులు తరలించారు. అజయ్ తండ్రి అలకంటి చెందు కుటుంబం గత కొన్ని సంవత్సరాలుగా హయత్ నగర్‌లో ఉంటూ చెత్త ఎత్తే బండి నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఆరేళ్ల అజయ్ ఒక్కడే సంతానం. తమకున్న ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. తన కుమారుడి చావుకు పాఠశాల యాజమాన్యం కారణమంటూ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# పత్తి సేకరణ ప్రక్రియ వేగవంతం

*** ఒక్కరోజే 3400 క్వింటాళ్ల కొనుగోళ్లు**
*** ప్రైవేట్ సంస్థలకు తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దు: మంత్రి తుమ్మల**



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో పత్తి సేకరణ ప్రక్రియ వేగవంతమవుతోంది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు సీసీఐ అధికారులు 105 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇవాళ ఒక్క రోజే 1474 మంది రైతుల నుంచి 3400 టన్నుల పత్తి కొనుగోళ్లు జరిపినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట చేతికొచ్చి మార్కెట్‌కు వస్తున్న నేపథ్యంలో 1472 మంది రైతుల నుంచి 2724 టన్నుల పత్తి కొనుగోళ్లు జరిగాయి. నిన్న మంత్రి తుమ్మల సీసీఐ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దీంతో పత్తి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. క్షేత్రస్థాయిలో రైతులందరూ తమ పత్తి పంటను ప్రైవేట్ సంస్థలకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని మంత్రి సూచించారు. మార్కెటింగ్ శాఖ తీసుకొచ్చిన వాట్సప్ యాప్ ద్వారా దగ్గరలో కొనుగోలు కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో తెలుసుకొని, అక్కడ గరిష్ఠ మద్దతు ధరకు పంటను విక్రయించుకోవాలని సూచించారు.

# బాచుపల్లిలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

**విశ్వంభర, హైదరాబాద్:** సంగారెడ్డి జిల్లాలోని ఐడీఏ బొల్లారంలో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు విద్యార్థిని మృతదేహాన్ని బాచుపల్లిలోని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.







V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

మంగళవారం
05-11-2024

సంపుటి : 01 । సంచిక : 183 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




# అమెరికా ఎన్నికలకు సర్వం సిద్ధం

## దేశవ్యాప్తంగా నేడే పోలింగ్

- అధికారం కోసం కమలా హారిస్, డొనాల్డ్ ట్రంప్ పోటీ
- ముమ్మరంగా జరిగిన ప్రచారం
- ఓటర్లలో ఉరకలెత్తుతున్న ఉత్సాహం



**వాషింగ్టన్:** అమెరికాలో అధ్యక్ష ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకునేందుకు మంగళవారం పోలింగ్ జరగనుంది. వరుసగా రెండోసారి అధికారాన్ని చేపట్టాలని డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్, మిగతా5లో...

# బాణాసంచా నిషేధాన్ని ఎందుకు అమలు చేయలేదు?



- దిల్లీ సర్కారును ప్రశ్నించిన 'సుప్రీం'
- బాణాసంచా నిషేధంపై కీలక చర్యలు తీసుకోవాలి

**దిల్లీ:** దిల్లీలో వాయు కాలుష్యం పెరగడంపై దిల్లీ సర్కారుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పత్రికల్లో వస్తున్న వార్తలను చూస్తే.. దిల్లీలో బాణాసంచా నిషేధం అమలు కాలేదని అనిపిస్తోందని పేర్కొంది. ఇందుకు సంబంధించి సమాధానం చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. బాణాసంచా నిషేధంపై ప్రభుత్వం కీలక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. దీపావళి నుంచి దిల్లీ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగింది. మిగతా5లో...

# ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం

**లోయలో పడిన బస్సు.. 36 మంది మృతి**

**ఆర్థిక సాయం ప్రకటించిన ప్రధాని**



**నైనితాల్:** ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పౌరీ జిల్లాలోని నైనిదండా నుంచి నైనితాల్‌లోని రాంనగర్‌కు వెళ్తున్న ఓ బస్సు అల్మోరా వద్ద అదుపుతప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో 36 మంది ప్రయాణికులు మృతి చెందగా, మిగిలినవారు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు వెల్లడించారు. ఓవర్‌లోడ్ కారణంగా బస్సు లోయలో పడి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్నామని పేర్కొన్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు మిగతా5లో...



# విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెస్తాం

## గత పదేళ్లలో విద్యా వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైంది

### రాజకీయ పార్టీల రెచ్చగొట్టే ప్రకటనలు నమ్మొద్దు

### విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్



**విశ్వంభర, హైదరాబాద్:** గత పదేళ్లలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలకు, కళాశాలలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామన్నారు. ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నామన్నారు. విద్యార్థులతో సీఎం సోమవారం మిగతా5లో...

## మూసీ పరీవాహక ప్రాంతాల్లో 8న సీఎం పాదయాత్ర!

పుట్టిన రోజు సందర్భంగా యాదాద్రిలో పూజలు 5

## సాఫీగా ధాన్యం కొనుగోళ్లకు చర్యలు

ఉమ్మడి జిల్లాలకు ఐఏఎస్ అధికారుల నియామకం 5

## మూసీ బాధితులను రోడ్డున పడేస్తే తీవ్ర ప్రతిఘటన

- ప్రక్షాళనకు, సుందరీకరణకు ఎవరూ వ్యతిరేకం కాదు
- ప్రాజెక్టు చేపట్టడానికి ముందు అఖిల పక్షం ఏర్పాటు చేయాలి
- మేధావులు, పర్యావరణవేత్తల సూచనలు తీసుకోవాలి
- డీపీఆర్, పునరావాస విధానాన్ని ప్రకటించాలి
- ఆప్ అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు


12

## సర్పంచ్‌లకు మార్చిలోగా బకాయిలు చెల్లిస్తాం

- ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- ప్రభుత్వం అండగా ఉంటుంది
- మంత్రి పొన్నం ప్రభాకర్


5

## హింసాత్మక చర్యలు భారత్ స్థైర్యాన్ని దెబ్బతీయలేవు

- కెనడా చట్టపరంగా వ్యవహరించాలి
- హిందూ ఆలయంపై దాడికి ప్రధాని తీవ్ర ఖండన


5



## డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ వెంకటేశ్వరరావు

ఉత్తర్వులు జారీ.. హైకోర్టు ఆదేశాల మేరకే కమిషన్ ఏర్పాటు

6వ తేదీ నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల ప్రాతిపదికన సర్వే ప్రారంభం 5



## తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

- రాష్ట్రంలో ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లయింది
- యూఎస్‌లోని 'ఒవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ ఎన్నారైలతో భేటీలో కేంద్రమంత్రి బండి సంజయ్

5

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 128 | రిటైల్ ₹ 150 |
| స్కిన్ ₹ 218 | స్కిన్ లెస్ ₹ 248 |

# బ్లాక్‌మెయిల్ సీఎంతో తెలంగాణ వందేళ్లు వెనక్కి

### కాంగ్రెస్ చేతగాని పాలనతో రాష్ట్రం ఆగం

### ఏడాది పాలనలో వందేళ్ల విధ్వంసం

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ



**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ చేతగాని పాలనతో రాష్ట్రం ఆగం అవుతోందని.. ఏడాది పాలనలో వందేళ్ల విధ్వంసం సృష్టించారని.. నాలుగేళ్ల పాలనతో తెలంగాణ ఏమవుతుందోనని ఆవేదన కలుగు తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌కు కేటీఆర్ సోమవారం బహిరంగ లేఖ రాశారు. 'రైతులు, చేనేత కార్మికులు, మిగతా5లో...



# ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వ ఆదాయం పెంచాలి

### వారంలో ప్రణాళికలు రూపొందించాలి

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే మార్గాలపై దృష్టిపెట్టాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. జాయింట్ వెంచర్లలో వివాదాలు పరిష్కరించి ఆదాయం పెంచాలన్నారు. దీని కోసం ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. డిప్యూటీ సీఎం అధ్యక్షతన ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మిగతా5లో...

# లబ్ధిదారుల ఎంపిక నేడో రేపో ప్రారంభం

- తొలి దశలో స్థలం ఉన్నవారికే ఛాన్స్
- మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకుల జోక్యం ఉండదు
- నాలుగు దశల్లో బిల్లు మంజూరు
- 16 శాఖలకు చెందిన ఇంజినీరింగ్ సిబ్బంది ఒకే గొడుగు కిందకు
- గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఈనెల 5 లేదా 6న ప్రారంభమవుతుందని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామసభల్లో ఇందిరమ్మ కమిటీల ద్వారా ఈనెల 20 వరకు మొదటి విడత అర్హుల ఎంపిక పూర్తవుతుందన్నారు. గ్రామసభలే లబ్ధిదారులను మిగతా5లో...

# మానవతకు నిలువుటద్దం రెడ్ క్రాస్

**మనిషి ప్రాణాలతో ఉండాలంటే రక్తం చాలా అవసరం. కొన్ని రకాల జబ్బులు వచ్చినవారికైనా, ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడినవారికైనా, యుద్ధాల్లో క్షతగాత్రులకైనా రక్తం ఎక్కించడం అత్యవసరం. వెంటనే ఆ పని చేయకపోతే ప్రాణాలు పోతాయి. కొందరు పిల్లలకు తలసేమియా అనే అరుదైన, మందులకు నయం కాని వ్యాధి ఉంటుంది. వారికి నెత్తురే ఔషధం. వారికి రక్తం ఎక్కించకపోతే ప్రాణాలు కోల్పోతారు. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న పని. పేదవారికి సాధ్యం కాదు. ప్రమాదాల్లో, యుద్ధాల్లో తీవ్రంగా గాయపడినవారికి, తలసేమియా వ్యాధిగ్రస్తులకు, ఇతరులకు విలువైన సేవలందిస్తోంది రెడ్‌క్రాస్ సంస్థ. వారి సేవలన్నీ ఉచితమే. కేవలం బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహించడమే కాకుండా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను కూడా చేస్తోంది రెడ్‌క్రాస్ సంస్థ. రక్తదాతలు ఎవరైనా రెడ్‌క్రాస్ ద్వారా రక్తాన్ని దానం చేసి, మరొకరి ప్రాణాలను కాపాడవచ్చు. 18 సంవత్సరాలు నుండి 55ఏళ్ల లోపు ఉన్నవారు రక్తదానానికి అర్హులు. కనీసం రక్తదాతల శరీర బరువు 50 కిలోలు ఉండాలి.**

## నేడు భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ స్థాపన దినం



రక్తదాన అవగాహన కార్యక్రమానికి నాటి గవర్నర్ తమిళ సైతో డా.కాచం సత్యనారాయణ



నాయిని నర్సింహ్మా రెడ్డి చేతుల మీదుగా బెస్ట్ బ్లడ్ దోనర్‌గా అవార్డు అందుకున్న డా. కాచం సత్యనారాయణ

అంతర్జాతీయ రెడ్‌క్రాస్, రెడ్‌క్రెసెంట్ ఉద్యమం ఒక అంతర్జాతీయ మానవతావాద ఉద్యమం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సేవాసంస్థ లన్నింటిలో రెడ్ క్రాస్ సొసైటీ అతి పెద్దది. ఈ సంస్థలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 9.7 కోట్ల మంది సభ్యులు (కార్యకర్తలు) ఉన్నారు. మానవతా వాదాన్ని, మానవుల జీవితాలను, ఆరోగ్యాన్ని కాపాడడానికి అనునిత్యం శ్రమిస్తూ వుంటారు. జాతి, మత, కుల, వర్గ, వర్ణ, వయో భేదాలు లేకుండా సత్సంకల్పంతో పనిచేస్తూ వుంటారు. అత్యవసర పరిస్థితుల నుండి వారి ప్రాణాలను రక్షించడానికి రెడ్ క్రాస్ సంస్థలు ఎంతో కృషి చేస్తున్నయి. మానవతా దృష్టితో ప్రారంభమైన ఈ రెడ్‌క్రాస్ ఉద్యమంలో నేడు ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొంటున్నాయి. భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ 1920 నవంబర్లో 5న స్థాపితమైంది. ఢిల్లీ ప్రధాన కేంద్రంగా విశేష సేవలు అందిస్తూ, ప్రజాదరణ పొందుతున్నది. ఐఆర్‌సిఎస్ 1920 లో స్వచ్ఛంద మానవతా సంస్థగా స్థాపితమైంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,100 కి పైగా శాఖల నెట్‌వర్క్‌తో, ఇది విపత్తులు , అత్యవసర సమయాల్లో సహాయం అందిస్తోంది. పేదలు, బలహీనుల సంరక్షణను ప్రోత్సహిస్తుంది. ఇది ప్రపంచంలోని అతిపెద్ద స్వతంత్ర మానవతా సంస్థ, అంతర్జాతీయ రెడ్‌క్రాస్ , రెడ్ క్రెసెంట్ ఉద్యమంలో ప్రముఖ సభ్యసంస్థ. భారత రెడ్‌క్రాస్ మిషన్ అన్ని రకాల మానవతా కార్యకలాపాలను చేపడుతోంది. ప్రోత్సహిస్తోంది. స్విస్ పౌరుడు జీన్ హెన్రీ డునాంట్ 1859 లో ఒక వ్యాపార పర్యటనలో, ఆధునిక ఇటలీలో సోల్ఫెరినో యుద్ధం పరిస్థితులకు డునాంట్ సాక్షిగా నిలిచాడు. ఆ యుద్ధంలో 40వేల మంది మరణించారు, అధిక సంఖ్యాకులు గాయపడ్డారు. వారికి సాయం అందకుండా, రక్షణ లేకుండా పోయిన హృదయ విదారక దృశ్యాలు కళ్ళారా చూశాడు. తన జ్ఞాపకాలు, అనుభవాలను ఎ మెమరీ ఆఫ్ సోల్ఫెరినో పుస్తకంలో రికార్డ్ చేశాడు. ఆ సంఘటన 1863లో ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ కమిటీ (ఐసిఆర్సి) ఏర్పాటుకు ప్రేరణనిచ్చింది. యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకుని వారికి ఆసరాగా నిలవడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థే "రెడ్‌క్రాస్ సొసైటీ". ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సేవా సంస్థలన్నింటిలో అతి పెద్దది. అది మానవతా ఉద్యమంగా రూపు




దిద్దుకుంది. అలా ప్రపంచ వ్యాప్తంగా అనేక రకాల సమస్యలతో బాధపడుతున్న పేదలను ఆదుకోవాలనే ఉద్దేశం ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవానికి ప్రేరణగా నిలుస్తున్నది.

అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ వ్యవస్థాపకుడు హెన్రీ డునాంట్ మే 8, 1863లో జన్మించారు. ఆయన గౌరవార్థం ఆయన జయంతి రోజున ఈ ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. హెన్రీ డునాంట్ నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కూడా. హెన్రీ డునాంట్,1859 జూన్ 24న వ్యాపారం పని మీద లావర్డి నగరానికి వెళ్ళాడు. ఆ సమయంలో ఫ్రాన్స్, ఆస్ట్రియాల మధ్యన జరుగుతున్న యుద్ధం వల్ల గాయపడిన వేలాది స్త్రీ పురుషులు ప్రథమ చికిత్స లేక మరణించడం చూశాక, హృదయవిదారకమైన దృశ్యం అయన మనస్సులో చెరగని ముద్ర వేసింది. తన సొంత పని మరచిపోయి ఆపదలోనున్న వారందరికీ సహాయం చేశాడు.

యుద్ధం ముగిసాక ఆయన ప్రజలందరికీ ... "యుద్ధాలలో గాయపడిన వారందరికి, తక్కిన వారందరూ సహాయం చేయాలి. ఇది మానవ ధర్మం." అని విజ్ఞప్తి చేశాడు. ఆయన విజ్ఞప్తి ప్రజలందరినీ ఆకట్టుకుంది. 1864లో జెనీవాలో అంతర్జాతీయ సమావేశం జరిగింది. రెడ్ క్రాస్ సంస్థాపనకు 14 దేశాలు తమ అంగీకారాన్ని తెలిపాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత 14 వ అంతర్జాతీయ సదస్సులో అంతర్జాతీయ కమిషన్ శాంతికి ప్రధాన సహకారిగా రెడ్‌క్రాస్‌ను ప్రవేశ పెట్టింది. టోక్యోలో 1934లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ట్రూస్ సూత్రాలను ఆమోదించారు. అనంతరం రెడ్ క్రాస్ ను వివిధ ప్రాంతాలలో కూడా వర్తింప జేశారు. యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకొని వారికి ఆసరాగా నిలవడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థే రెడ్‌క్రాస్ సొసైటీ. తొలి రోజుల్లో యుద్ధాల్లో గాయపడిన సైనికులకు సేవ చేయడానికి మాత్రమే ఇది పరిమితమై ఉండేది. ఇంచుమించు ప్రపంచంలోని అన్ని దేశాలలోను రెడ్ క్రాస్ శాఖలు, యుద్ధ సమయాలలో నిర్విరామంగా పనిచేస్తునే ఉంటాయి. జాతి, కుల, మత విచక్షణా భేదం లేకుండా నిస్సహాయులకు ఇది సేవ చేస్తుంది. శాంతి కాలంలో రెడ్ క్రాస్ కార్య కలాపాలు... ప్రథమ చికిత్స, ప్రమాదాలు జరగకుండా చూడడం, తాగే నీటిని పరిశుభ్రంగా ఉంచటం, నర్సులకు శిక్షణనివ్వడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నడపటానికి మంత్రసానులకు శిక్షణ, వైద్య శాలలను స్థాపించడం, రక్త నిధులు సేకరించడం, మొదలైన పనులు చేస్తుంటుంది. 1965 వియన్నాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో, మానవత, నిష్పాక్షికత, సమ తౌల్యత, స్వతంత్రం, వాలంటరీ సేవ, ఐక్యత, విశ్వజనీయత...ఏడు ప్రాథమిక సూత్రాలు ఆమోదింపబడినవి. ఈ సూత్రాలను ఉద్యమం మొత్తంలో అమలుపరచాలని తీర్మానించ బడింది.1986 లో జరిగిన సదస్సులోనూ మార్పులు చేర్పులు జరిగాయి.


1876 నుండి 1878 వరకూ జరిగిన రష్యా - టర్కీ యుద్ధ సమయంలో ఉస్మానియా సామ్రాజ్యం రెడ్ క్రాస్ కు బదులుగా రెడ్ క్రెసెంట్ ఉపయోగించింది. క్రాస్ గుర్తు క్రైస్తవ మతానికి చెందినదని, దీని ఉపయోగం వలన తమ సైనికుల నైతిక బలం దెబ్బతింటుందని టర్కీ ప్రతిపాదించింది. రష్యా ఈ విషయంలో సంపూర్ణ అంగీకారాన్ని ప్రకటించింది. 1929 జెనీవాలో జరిగిన సదస్సులో 19వ అధికరణ ప్రకారం ఆమోదం పొంది, స్విడ్జర్లాండ్ దేశపు జాతీయ జెండాలోని ఎర్రని బ్యాక్‌గ్రౌండ్‌లో తెల్లని క్రాస్ ను తారుమారు చేసి తెల్లని బ్యాగ్‌డ్రాప్‌లో ఎర్రని క్రాస్‌ను లోగోగా ఏర్పరిచారు. అనేక దేశాలలో రానురాను దీని ఉపయోగం సాధారణమయినది. హెన్రీ డ్యూనాండ్‌కు 1901లో తొలి నోబెల్ శాంతి బహుమతి లభించింది. రెడ్‌క్రాస్ సంస్థ 1917, 44, 63 సంవత్సరాలలో మూడు సార్లు నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకుంది.



**- డాక్టర్ కాచం సత్యనారాయణ**
వీ3 న్యూస్, విశ్వంభర తెలుగు దిన పత్రిక
చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్,
రెడ్ క్రాస్ హైదరాబాద్ ప్రెసిడెంట్

# సాహితీ మహారథి దాశరథి

**"నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని నినదించి నిజాం పాలనపై కలం ఎత్తిన దాశరథి కృష్ణమాచార్య సాహితీ ప్రస్థానంలో అభ్యుదయ కవి. నిజాంకు వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లి..." ఓ నిజాము పిశాచమా? కానరాదు / నిన్నుబోలిన రాజు మాకెన్నడేని? అంటూ పళ్ళు తోముకోవడానికిచ్చే బొగ్గుతో నిజామాబాద్ జైల్లో(ఖిల్లా ) ఉన్నపుడు, జైలు గోడల మీద పద్యాలు రాసి దెబ్బలు తిని, అక్కడ నుంచే తన కవిత్వం ద్వారా పోరాటాన్ని కొనసాగించిన ధీశాలి దాశరథి కృష్ణమాచార్యులు. 'నా గీతావళి ఎంత దూరము ప్రయాణంబౌనో అందాక ఈ భూగోళంబునకగ్గి పెట్టెద' అని ఆయన నినదించారు. 'ననుగని పెంచినట్టి కరుణామయి నా తెలంగాణ' అని అంటూ దాశరథి పుట్టిన ప్రాంతంపై మమకారాన్ని చాటుకోవటంతో పాటు రుద్రవీణ కావ్యాన్ని తెలంగాణకు అంకితమిచ్చారు. 'అనాదిగా సాగుతోంది - అనంత సంగ్రామం అనాథునికీ ఆగర్భ శ్రీమంతునికీ మధ్య' అంటూ తనలోని సామ్యవాద ఆలోచనలను దాశరథి వ్యక్తీకరించారు.**



## నేడు దాశరథి వర్ధంతి

తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలిచి నిజాం పాలన మీదికి ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య. దాశరథిగా ఆయన సుప్రసిద్ధుడు. పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకొని తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించిన దాశరథి ప్రాతఃస్మరణీయుడు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని గర్వంగా ప్రకటించి తెలంగాణ ఉద్యమానికీ ప్రేరణనందించిన కవి దాశరథి. దాశరథి కృష్ణమాచార్య 1925 జూలై 22 న వరంగల్ జిల్లా (ప్రస్తుతం మహబూబాబాద్) చిన్న గూడూరు గ్రామంలో జన్మించాడు. బాల్యం ఖమ్మం జిల్లా మధిరలో గడిచింది. ఉర్దూలో మెట్రిక్యులేషను, భోపాల్ విశ్వవిద్యాలయం నుండి ఇంటర్మీడియెట్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషు సాహిత్యంలో బియ్యే చదివాడు. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు. చిన్నతనంలోనే పద్యం అల్లటంలో ప్రావీణ్యం సంపాదించాడు. ప్రారంభంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉండి రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఆ పార్టీ వైఖరి నచ్చక ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి, హైదరాబాదు సంస్థానంలో నిజాం అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పాలుపంచుకున్నాడు. నిజాం పాలనలో రకరకాల హింసలనుభవిస్తున్న తెలంగాణాను చూసి చలించిపోయాడు. పీడిత ప్రజల గొంతుగా మారి నినదించాడు.

"మా నిజాం రాజు జన్మజన్మల బూజు".రైతుదే తెలంగాణము రైతుదే. ముసలి నక్కకు రాచరికంబు దక్కునే అని గర్జించాడు. దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు, దిగిపొమ్మని జగత్తంత నగారాలు కొడుతున్నది, దిగిపోవోయ్, తెగిపోవోయ్'

అని నిజామును సూటిగా గద్దిస్తూ రచనలు చేసాడు. ఆంధ్రమహా సభలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వం చేత జైలు శిక్ష అనుభవించాడు. నిజామాబాదులోని ఇందూరు కోటలో ఆయన్ని మరో 150 మందితో ఖైదు చేసి ఉంచింది నిజాము ప్రభుత్వం. ఆయనతో పాటు ఖైదులో వట్టికోట ఆళ్వారుస్వామి కూడా ఉన్నాడు. . మంచి ఉపన్యాసకుడు. భావప్రేరిత ప్రసంగాలతో ఊరూరా సాంస్కృతిక చైతన్యం రగిలించాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాతల్లో ఒకడు. 1953లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి అధ్యక్షుడుగా జిల్లాల్లో సాహితీ చైతన్యాన్ని నిర్మించాడు. ఉపాధ్యాయుడిగా, పంచాయితీ ఇన్స్పెక్టరుగా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసాడు. ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవిగా 1977 ఆగష్టు 15 నుండి 1983 వరకు పనిచేసాడు. రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు గెల్చుకున్నాడు. సాహిత్యంలో దాశరథి అనేక ప్రక్రియల్లో కృషి చేసాడు. కథలు, నాటికలు, సినిమా పాటలు, కవితలు రాసాడు. అనేక సినిమాలకు గీతాలు రచించి అభిమానుల్ని సంపాదించుకున్నాడు. మీర్జాగాలిబ్ ఉర్దూ గజళ్ళను తెలుగులోకి గాలిబ్ గీతాలు పేర అనువదించాడు. తల్లి మీద, తల్లి తెలంగాణ మీద ఆయన రచించిన పద్యాలు ఇప్పటికీ ఎందరికో ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయి.

"అగ్ని ధారను తన జైలు సహవాసి.. వట్టికోట అళ్వారు స్వామికి అంకితమిచ్చాడు. మరో కవితా సంపుటి రుద్రవీణను.. తెలంగాణా ప్రజలకు అంకితమిచ్చాడు. ఈయన రాసిన 'తిమిరంతో సమరం' కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందింది. 'కవితా పుష్పకం' అనే కావ్యానికి ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. దాశరథి 'బాల సరస్వతి తెలుగు-ఇంగ్లీషు నిఘంటువును' రాశారు. గీతగోవింద వ్యాఖ్యానం చేశాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం దాశరథిని కళాప్రపూర్ణ అనే బిరుదుతో సత్కరించింది. 1953లో తెలంగాణా రచయితల సంఘాన్ని స్థాపించాడు.

రుద్రవీణ, మహాంధ్రోదయం, మార్పు నా తీర్పు, ధ్వజమెత్తిన ప్రజ, మహాబోధి, పునర్నవం, అమృతాభిషేకం, నవమంజరి, గాలిబ్ గీతాలు, ఆలోచనా లోచనాలు, అమృతవల్లి, ధ్వజమెత్తిన ప్రజ (కవిత్వం ). మస్తిష్కంలో లేబరేటరీ ( విజ్ఞాన శాస్త్ర కవిత) తదితర 30 పుస్తకాలు వెలువరించాడు. రుబాయి, గజల్ ప్రక్రియలను మొదటిగా తెలుగులోకి అనుదించినది – దాశరథి. హీరాలాల్ మోరియా కవితలను తెలుగులోకి అనువదించాడు. ఆచార్య ఆత్రేయ తన దర్శకత్వంలో వచ్చిన 'వాగ్దానం' చిత్రంలో మొట్టమొదటి పాటను దాశరథితోనే రాయించారు. 'నా కంటిపాపలో నిలిచిపోరా/ నీ వెంట లోకాలు గెలువనీరా' అనే పాటలో దాశరథి చిన్న చిన్న పదాలతో చేసిన భావ ప్రకటన వింటే తనువు, మనసు పులకించకుండా ఉండవు. దాశరథి రాసింది మొదట ఈ పాటే అయినా, ఆయన పాటలు రచించిన 'ఇద్దరు మిత్రులు' సినిమా ముందుగా విడుదల అయింది. అందుకే 'ఖుషీ ఖుషీగా నవ్వుతూ' అనే పాటను దాశరథి మొదటి పాటగా చెపుతుంటారు. సినిమా పాటల కోసం ఖవ్వాలి అనే ఉర్దూ పాటల్ని అనుసరించారు. సినిమాల్లో వీణ పాటలు ఎక్కువ రాసిన ఘనత దాశరథికే దక్కుతుంది. పాటల రచయితగా దాశరథి చేసిన ప్రయోగాలు తెలుగు సినిమా ఉన్నంతకాలం నిలిచిపోతాయి. పొట్టివాడైనా గట్టివాడని చాలా మంది సంబోధించారు. ఈయన రాసిన నాటికల సంపుటి 'నవమి'. ఈయన మహాశిల్పి జక్కన అనే చారిత్రక నవల రాశారు. తెలుగు పతాకం ఎరుగని దిశయే లేదు.. తెలుగు వెలుగు దూరలేని కోశం లేదు.. అని అన్నారు."జండా ఒక్కటి మూడు వన్నెలది దేశం ఒక్కటే.." అన్నారాయన. అడుగడుగునా.. ఎడదనెత్తురు గడగడమని తాగినావు... అంటూ నిజాం నిరంకుశ పాలనను ఎత్తిచూపాడు. హింసాయుద్ధం ఔట్ డేటెడ్ అని నేనంటాను / శాంతి ఒక్కటే మానవ జాతికి సిరియగు సాల్వేషన్"... అంటూ చైతన్యదీప్తిని నింపారు. 1987 నవంబరు 5 న దాశరథి మరణించారు.


# తెలంగాణ విముక్తి కోసం పోరాడిన కొదమసింహం

## నేడు నల్లా నరసింహులు వర్ధంతి

1945 దశకంలో పెను ఉప్పెనై పోటెత్తిన తెలంగాణ సాయుధ విముక్తి పోరాట కెరటాల్లో ఒక ఉత్తుంగ తరంగమై విప్లవించాడు నల్లా నరసింహులు. 1945 నుండి 1951 వరకు నిజాం ప్రభుత్వ దన్నుతో రజాకార్లు దేశముఖ్ లు, సర్దేశ్ ముఖ్ లు, దేశాయిలు, సర్ దేశాయిలు, జమీందారులు తెలంగాణ ప్రజలపై దశాబ్దాలుగా కొనసాగించిన రాక్షస, పైశాచిక అణచివేత, హత్యాకాండ, దోపిడికి వ్యతిరేకంగా, జరిపిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో జనగామ ప్రాంత దళ నాయకత్వం వహించిన పోరాట యోధుడు ఆయన. నాడు నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ రాష్ట్రంలోని 7430 గ్రామాల్లో ప్రైవేట్ వ్యక్తుల అజమాయిషీలో నిజాం తరపున పన్నులు వసూలు చేసే అప్రత్యక్ష అధికారాన్ని చేజిక్కించుకున్నారు కొందరు భూస్వాములు. లక్షల, వేల కొద్ది ఎకరాల భూమిని తమ స్వాధీనంలో పెట్టుకాగా, ఆ భూములను సాగుచేసి పండించే రైతులు మాత్రం కొలుదార్లే, కూలీలై, పెట్టి బానిసలై బతుకులనీడుస్తున్న దయనీయ కాలంలో చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం రూపు దిద్దుకుంది. దానికి నాయకత్వం వహించిన 'ఆంధ్ర మహాసభ' లో అత్యంత కీలక పాత్ర వహించి వేలాది మంది యోధులతో నిజాం ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తూ వీరోచిత విముక్తి పోరాటంలో ఎన్నో త్యాగాలు చేసి చేసి, ఎన్నోసార్లు పోలీసులకు పట్టుబడి, చిత్ర హింసలకు గురై, కేసుల పాలై, మూడుసార్లు ఉరిశిక్షలు విధించబడి, ధైర్యంగా తన వాదనలను వినిపించి తెలంగాణ టైగర్' అని కీర్తి పొందిన అసామాన్య వీరకిశోరం నల్ల నరసింహులు. భారత స్వాతంత్ర్యం, హైదరాబాద్ విలీనం సందర్భాల మధ్య కాలంలో జరిగిన వేలాది మంది మరణాలకు, ఊచ కోతలకు, మాన భంగాలకు, హత్యలకు పైశాచిక హింసకు సాక్షమై నిలిచిన సంధి సమయాన్ని చారిత్రాత్మక 10 లక్షల ఎకరాల భూ విముక్తి తర్వాత దాన్ని పేదలకు పంచిన ప్రజా విజయ ఘటనకు ప్రతీకగా నిలిచినవాడు నల్ల నరసింహులు. నరసింహులు గ్రామం కడవెండి. అతి మామూలు పేద పద్మశాలి కుటుంబం. చేనేత పని చేసి ఉర్దూ మీడియంలో ఏడవ తరగతి వరకు మాత్రమే చదువుకున్నవాడు. దోపిడికి వ్యతిరేకంగా ఉద్యమిస్తూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా.. ఏండ్లకు ఏండ్లు అజ్ఞాతంలో ఉంటూ విప్లవించిన సాయుధ యోధుడు ఆయన. తెలంగాణ ప్రాంతం భూస్వాముల, నిజాం తాబేదార్ల ఉక్కు పాదాల కింద నలిగిపో-



తున్న సందర్భంలో ఆంధ్ర మహాసభ రూపంలో కమ్యూనిస్టుల కార్యక్రమ వేదిక ఒక కొత్త పరిస్థితి తెచ్చింది. పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల రామచంద్రా రెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నరసింహారెడ్డి నైతిక విలువలతో, మానవత్వంతో తమకున్న ఆస్తులను ప్రజల పరం చేశారు. గ్రామీణ తెలంగాణను సంఘటితపరుస్తూ భువనగిరిలో జరిగిన 11వ ఆంధ్ర మహాసభ ద్వారా గ్రామ దళ నిర్మాణం చేపట్టారు. అలా జనగామ తాలూకాలోని ఎన్నో గ్రామాల్లో దళాలను నిర్మించి, స్వయంగా నాయకత్వం వహించి పార్టీ అగ్ర నాయకుల సమన్వయం తో విప్లవించిన కొదమసింహం నరసింహులు. అటు భూస్వాములకు, ఇటు రజాకార్లకూ సింహస్వప్నమై నిద్రలేకుండా చేశాడు. మొట్టమొదటి తిరుగుబాటు తన సొంత ఊరు నుండే మొదలుపెట్టి 1947 సెప్టెంబర్ 11న నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా, దోపిడిదారులైన భూస్వాములను తరిమికొట్టేందుకు 'సాయుధ పోరాటానికి పిలుపు ఇచ్చాడు. ఆ పిలుపు యుద్ధ భేరీగా మారి, తెలంగాణ నాలుగు చెరగులా ప్రత్యేకించి భూస్వామ్య వ్యవస్థ బలంగా పాతుకుపోయిన నల్గొండ, ఖమ్మం, వరంగల్, కరీంనగర్ లాంటి జిల్లాలలో ఎర్ర జెండాల నీడలో లక్షలాది మంది నిరక్షరాస్య సుశిక్షిత ప్రజాసైన్యం ఎక్కడిక్కడ గడీలపై, ఖాసీం రజ్వీ నాయకత్వంలో పని చేసే రజాకార నిజాం పోలీస్ క్యాంపులపై మెరుపు దాడులు చేస్తూ ముందుకు సాగింది. వేలకొద్ది ఎకరాల భూములను విముక్తం చేస్తూ, బహిరంగంగానే దున్నే వాడికే భూమిని పంచిపెడ్తూ, వందలు వేలమంది కర్కశ నిజాం సైన్యాలకు, రజాకార్లకూ బలై ప్రాణాలను కోల్పోతూ 1951 వరకు కొనసాగింది. పోరాట దళాలను, ఆత్మార్పణ గెరిల్లా సమూహాలను నిర్మించి, నాయకత్వం వహించి, కదన రంగంలో ముందుండి నడిపించి అనేకసార్లు పట్టుబడి చిత్ర హింసలను సహించి, అనేక కేసుల్లో ఇరికించబడి, మూడుసార్లు ఉరిశిక్షలు విధించబడి అజేయంగా నిలిచిన ధీరుడు నల్లా నరసింహులు. పోలీస్ చర్య అనంతరం యూనియన్ సైన్యాలు నిషిద్ధ కమ్యూనిస్ట్ సభ్యులను అడవుల్లోకి తరుముతున్న సందర్భంగా, పట్టు బడి, ఉరి శిక్షకు గురయ్యాడు. అంతర్జాతీయ కమ్యూనిస్ట్ సంస్థల, భారత ట్రేడ్ యూనియన్ల ఆందోళన ఫలితంగా ఉరితీతకు 12 గంటల ముందు ఉరిశిక్ష నిలిపివేయడం విశేషం. ఇంతకూ నల్లా నరసింహులు ఎవరు ? అని నాటి యూనియన్ సైనిక జనరల్ జె.ఎస్. చౌదరి నల్లగొండ జైలుకు చూడ్డానికి వచ్చినప్పుడు ఆ జిల్లా ఎస్.పి. ధన్ రాజ్ నాయుడు సంకెళ్ళతో ఉన్న నరసింహులు "టైగర్ ఆఫ్ తెలంగాణ" అని పరిచయం చేయడం గమనార్హం. నెహ్రూ ప్రభుత్వాన్ని కూల దోయడానికి ప్రయత్నిస్తున్నారని స్టేట్ కాంగ్రెస్ ఇచ్చిన తప్పుడు నివేదికల వల్ల నిషేధానికి గురై, అజ్ఞాత నాయకులను లొంగిపోవాల్సిందిగా హెచ్చరించిన నేపథ్యంలో నరసింహులు వంటి అనేక మంది యోధులు జనావా సాలను వీడి, నల్లమల్ల,రాచకొండ అరణ్యాల్లోకి నిష్క్రమించగా, చివరికి విచిత్రమైన పరిస్థితుల్లో 1951 అక్టోబర్ లో 'సాయుధ పోరాటాన్ని' విరమిస్తున్నట్టుగా కమ్యూనిస్ట్ పార్టీ ప్రకటన వెలువడడం ద్వారా ఉద్యమం అనూహ్యంగా చల్లారి పోయింది. భారత దేశంలో ప్రజాస్వామ్య పాలన ప్రారంభమైన తరువాత కూడా అనేక కేసులతో కోర్టుల చుట్టూ తిరిగి తిరిగి చివరికి అప్పటి శాసనసభ ప్రతిపక్ష నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య చొరవతో చివరి ఉరిశిక్ష నుండి బయటపడి, అంతిమంగా 1959 జనవరి 26న స్వేచ్ఛా ప్రపంచంలోకి వచ్చాడు నరసింహులు. పోరాట స్మృతులతో తన ధర్మపత్ని వజ్రమ్మతో కలసి చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన వేలాది వీరులను, పీడిత ప్రజలకు 10 లక్షల ఎకరాల భూమి పంపక విజయాలనూ స్మరించుకుంటూ... తృప్తితో జీవితాన్ని నమ్మిన సిద్ధాంతం కోసమే ధారబోసి, త్యాగధనునిగా నరసింహులు 1993 నవంబర్ 5న ఈ లోకం వదిలి వెళ్లాడు.



**- బొల్ల శివ శంకర్**
అఖిల భారత పద్మశాలి సంఘం
రాజకీయ విభాగం అధ్యక్షులు, మాజీ
జెడ్పిటిసి - చైర్మన్ ఆసరా ఫౌండేషన్
సెల్: 90304 14449

# సర్పంచ్‌లకు మార్చిలోగా బకాయిలు చెల్లిస్తాం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో సర్పంచ్‌లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సర్పంచ్‌ల బకాయిలకు ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుందని, రాజకీయ పార్టీల ట్రాప్‌లో పడవద్దన్నారు. గాంధీభవన్‌లో సోమవారం మంత్రి పొన్నం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ఇష్టాగోష్ఠిలో మాట్లాడారు. సర్పంచులకు మార్చిలోపు బకాయిలు చెల్లిస్తామన్నారు. వంద ఎలుకలు తిన్న పిల్లి మాదిరిగా బీఆరెస్ నేతలు సర్పంచ్‌ల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో సర్పంచ్‌ల ఆత్మహత్యలకు కారణమైన వారే.. ఇప్పుడు ధర్నాలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు ఏం చేశారు? అని మంత్రి ప్రశ్నించారు. రాష్ట్రంలో వరదలు సంభవించినప్పుడు రూ.10 వేల కోట్ల నష్టం వాటిల్లితే.. కేంద్రం కేవలం రూ.400 కోట్లే ఇచ్చిందని మండిపడ్డారు.

# తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లయిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. యూఎస్‌కు చెందిన 'ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ ' ఎన్‌ఆర్‌ఐ నేతలతో ఆయన దృశ్యమాధ్యమం ద్వారా సమావేశమయ్యారు. అతి తక్కువ కాలంలో కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత నెలకొందని, రాష్ట్రంలో సీఎం హామీలకు విలువ లేకుండా పోయిందన్నారు. దక్షిణాదికి అన్యాయం పేరుతో ఆ పార్టీ దుష్ప్రచారం చేస్తోందని, మీడియా ప్రచారం తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. బీఆరెస్ పనైపోయిందని, ఆ పార్టీలో క్యాడర్ లేరన్నారు. ఆ పార్టీలో కొంతమంది నేతలు అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఆదాయం కోసం కాకుండా ఆలయాల్లో ప్రజలకు సేవలందిస్తామని, హిందూ ధర్మం, ప్రజల ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కనీసం ఐదుగురు విదేశీయులను భారత్‌లో పర్యటించేలా కృషి చేయాలని ఎన్నారైలకు ఆయన సూచించారు. దేశాభివృద్ధి కోసం తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని కోరారు.

**మాజీ సర్పంచ్‌ల అరెస్టు దుర్మార్గం**

రాష్ట్రంలో మాజీ సర్పంచ్‌ల అరెస్టు దుర్మార్గమని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు అప్పుల పాలవడానికి కారకులు బీఆరెస్, కాంగ్రెస్ పార్టీలేనన్నారు. అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులన్నీ చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్.. మాట తప్పిందని విమర్శించారు. ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఇవ్వాలని విన్నవించినా చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. సమస్యను పరిష్కరించకుండా పోలీసులతో అణగదొక్కాలని చూస్తారా? అని మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆరెస్ పార్టీలకు మాజీ సర్పంచ్ కుంటుంబాల ఉసురు తగులుతుందన్నారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# బాణాసంచా నిషేధాన్ని ఎందుకు అమలు చేయలేదు..?

(మొదటి పేజీ తరువాయి)

దాంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శ్వాసకోశ సమస్యలు, కళ్లు ఎర్రబారడం, చికాకు తదితర సమస్యలతో బాధపడుతున్నారు. ప్రస్తుతం నగరంలోని చాలా ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచి 400 మార్క్‌ని దాటింది. పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని డిసెంబర్ 2, 2016న ఎంసీ మెహతా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పును ఇచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దిల్లీలో గ్రాప్ పాలసీని అమలులోకి తీసుకువచ్చారు. చలికాలంలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇందులో పలు నిబంధనలు ఉన్నాయి. ఇందులో బాణాసంచాపై నిషేధం సైతం ఉన్నది. వాయు కాలుష్యంపై దిల్లీ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. బాణాసంచా నిషేధాన్ని ఎందుకు అమలు చేయడం లేదని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నిషేధం ఉంటే పటాకులు ఎలా పేల్చారు? వీలైనంత త్వరగా సమాధానం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం పెరిగిపోవడంతో మార్నింగ్ వాక్ చేయడం మానేస్తున్నట్లు సీజేఐ చంద్రచూడ్ గురువారం వ్యాఖ్యానించారు. శ్వాసకోశ వ్యాధులను నివారించడానికి ఇంట్లోనే ఉండటమే మంచిదని, ఉదయాన్నే బయటకు వెళ్లకుండా ఉండాలని డాక్టర్ సలహా ఇచ్చారన్న ఆయన.. వాయుకాలుష్యం పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

# హింసాత్మక చర్యలు భారత్ స్థైర్యాన్ని దెబ్బతీయలేవు

**ఢిల్లీ:** కెనడాలోని హిందూ ఆలయం లక్ష్యంగా జరిగిన దాడి ఘటనను ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి హింసాత్మక చర్యలు భారత్ స్థైర్యాన్ని ఏమాత్రం దెబ్బతీయలేవన్నారు. కెనడా ప్రభుత్వం చట్టపరంగా వ్యవహరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు మోదీ పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా చేసిన ఈ విధ్వంసక ఘటనను తీవ్రంగా ఖండిస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. కెనడాలో భారత దౌత్యవేత్తలను బెదిరింపులకు గురిచేసే పిరికిపంద యత్నాలు మరింత భయంకరమైనవిగా పేర్కొన్నారు. కెనడాలో మరోసారి రెచ్చిపోయిన ఖలిస్థానీలు అక్కడి బ్రాంప్టన్‌లోని హిందూ ఆలయాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులకు తెగబడటం తీవ్ర ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో అక్కడి భారతీయుల భద్రతపై కేంద్ర విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. 'ఉగ్రవాదులు, వేర్పాటువాదుల హింసాత్మక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ తరహా దాడుల నుంచి అన్ని ప్రార్థనాస్థలాలను సంరక్షించాలని మేం కెనడా ప్రభుత్వాన్ని కోరుతున్నాం. హింసకు కారకులైన వారిని శిక్షిస్తారని మేం ఆశిస్తున్నాం. కెనడాలో మా దేశీయుల భద్రత గురించి భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన చెందుతోంది. భారతీయులకు కాన్సులర్ సేవలు అందించే దౌత్యవేత్తలు ఈ తరహా బెదిరింపులకు తలొగ్గరు'' అని జైస్వాల్ అన్నారు. బ్రాంప్టన్‌లోని ఆలయ కాంప్లెక్స్‌లో కొందరు ఖలిస్థానీలు భక్తులపై దాడులు చేస్తున్న వీడియో వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఆలయం వద్ద భారీగా భద్రతా దళాలను మోహరించారు. దీనిని ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో సైతం తీవ్రంగా పరిగణించారు. అక్కడి ప్రజలు అన్ని మతాలను పాటించే హక్కును కాపాడతామని ఆయన పేర్కొన్నారు.

# ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వ ఆదాయం పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం సమావేశమైంది. మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆర్థిక, పురపాలక, రెవెన్యూ, పరిశ్రమలు, గృహనిర్మాణ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షతన పురపాలక, గృహనిర్మాణ, న్యాయశాఖల కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేయాలని భట్టి సూచించారు. సమస్యకు పరిష్కారం చూపేలా వారం రోజుల్లోగా ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. తమకు ప్రోత్సాహకాలు అందిస్తే నగరం విడిచి ఔటర్ రింగ్ రోడ్డు బయటకు వెళ్తామని కాలుష్యకారక పరిశ్రమల నిర్వాహకులు మంత్రివర్గ ఉపసంఘానికి విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో.. ఈ విజ్ఞప్తులు పరిశీలించి వారు ఓఆర్ఆర్ బయట పరిశ్రమలు స్థాపించుకునేలా సహకరించి, ప్రోత్సహించాలని ఉపముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ నగరంలో జీరో కాలుష్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# అమెరికా ఎన్నికలకు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

మరోసారి అధికారం కోసం రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ముమ్మరంగా ప్రచారాలు చేస్తున్నారు. పోలింగ్‌లో పాల్గొనేందుకు అమెరికా ఓటర్లు కూడా ఉత్సాహన్ని కనబరుస్తున్నారు. ఇప్పటికే ముందుగా ఓటేసే అవకాశాన్ని 6.8 కోట్ల మంది అమెరికన్లు వినియోగించుకున్నారు.




**గతంలో కంటే పెరిగిన పోలింగ్ కేంద్రాలు**

ముందస్తు ఓటింగ్‌కు ఓటర్లు వెల్లువెత్తుతుండటం వల్ల గతంలో కంటే ఈసారి పోలింగ్ కేంద్రాలను పెంచాల్సి వచ్చింది. న్యూయార్క్‌లోని 42 బ్రాడ్‌వేలో ఉన్న బోర్డు ఆఫ్ ఎలక్షన్స్ కార్యాలయం ఈ ఏర్పాట్లలో బిజీగా ఉంది. ముందస్తు ఓటింగ్‌లో ఇప్పటికే న్యూయార్క్ రికార్డు సృష్టించిందని, అది ఇంకా కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఒక్క న్యూయార్కే కాదు, అమెరికా అంతటా ఇదే ట్రెండ్ కొనసాగుతోంది. ఇప్పటికే 6.8 కోట్ల మంది మెయిల్లద్వారా, పోలింగ్ కేంద్రాల ద్వారా ఓటేశారు. గత ఎన్నికల్లో న్యూయార్క్‌లో 100 ముందస్తు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఈసారి 50శాతం అధికంగా ఏర్పాటు చేయాల్సి వచ్చింది. అయితే అసాధారణ వాతావరణ పరిస్థితులు, పోలింగ్ రోజున భారీ క్యూలతో ఇబ్బందులు, ఎన్నికల రోజున ఘర్షణలు ముందస్తు ఓటింగ్‌కు కారణాలుగా భావిస్తున్నారు.

**చివరి నిమిషంలో విశ్వ ప్రయత్నాలు**

ఇక అధ్యక్ష అభ్యర్థుల ప్రచారం ముగింపు దశలో ఉంది. రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ తనకు అనుకూలమైన నార్త్ కరోలినాలో ప్రచారం చేస్తున్నారు. మంగళవారం వరకూ నార్త్ కరోలినాలో ఉండి ర్యాలీలు నిర్వహించాలని ట్రంప్ నిర్ణయించుకున్నారు. 2016, 2020లలో తనకు మద్దతుగా నిలిచిన ఈ రాష్ట్రంపై ఆయన ఎక్కువగా దృష్టి సారించారు. న్యూమెక్సికో, వర్జీనియాలనూ ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. నార్త్ కరోలినాలోని గ్యాస్తోనియా, ఛార్లెట్, గ్రీన్స్‌బరోల్లో శనివారం ప్రచారం చేశారు. మధ్యలో వర్జీనియాలోని సేలంలో ఆగారు. ఆదివారం కింగ్‌స్టన్‌లో ప్రచారం చేశారు. దీంతో నార్త్ కరోలినాలోనే అక్టోబరు 1 నుంచి ఆయన 9 ర్యాలీలు నిర్వహించినట్లవుతుంది. ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ 6సార్లు ఈ రాష్ట్రాన్ని చుట్టారు.

మరోవైపు డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ నార్త్ కరోలినాలో ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. శనివారం నార్త్ కరోలినాలోని ఛార్లెట్‌లో ప్రచారం చేశారు. సోమవారం తన భర్త డగ్ ఎంహాఫ్‌ను గ్రీన్‌విల్లేకు పంపుతున్నారు. తుపాను కారణంగా నార్త్ కరోలినా పశ్చిమ ప్రాంతంలో తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో ఈ ప్రాంత ఓటర్లు ఎటు మొగ్గుతారనే విషయంలో సందిగ్ధత నెలకొంది. శుక్రవారానికల్లా నార్త్ కరోలినాలోని 78లక్షలమంది ఓటేశారు. ఇది మొత్తం ఓటర్లలో దాదాపు సగం. పత్రికలకు వ్యాసాలు రాయడం, టెలివిజన్ షోలలో హారిస్ పాల్గొంటున్నారు.

**న్యూయార్క్‌లో బెంగాలీలోనూ బ్యాలెట్**

అమెరికా అధ్యక్ష ఎన్నికలను ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. ఇప్పటికే ముందస్తు ఓటింగ్ మొదలుకాగా.. నవంబర్ 5న పోలింగ్ జరగనుంది. ఓటర్లకు సౌలభ్యంగా ఉండేందుకు ఆయా రాష్ట్రాలు వివిధ భాషల్లో బ్యాలెట్‌లను అందుబాటులో ఉంచుతున్నాయి. ఈ క్రమంలో న్యూయార్క్ రాష్ట్రం ఇంగ్లిష్‌కు అదనంగా మరో ఐదు భాషల్లో వీటిని ముద్రించగా.. అందులో భారతీయ భాష 'బెంగాలీ' ఉండటం విశేషం. ''ఎన్నికల ప్రక్రియలో ఇంగ్లిష్ కాకుండా మరో నాలుగు భాషలకు చోటు కల్పించాం. చైనీస్, స్పానిష్, కొరియన్, బెంగాలీ భాషల్లో బ్యాలెట్ అందుబాటులో ఉంది' అని న్యూయార్క్ రాష్ట్ర ఎన్నికల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ జే రియాన్ పేర్కొన్నారు. ఇక్కడ స్థిరపడిన వారికి ఇంగ్లిష్ తెలిసినప్పటికీ మాతృ భాషలో అందుబాటులో ఉండటం ఆయా ప్రాంతాల వారికి సంతోషకర అంశమన్నారు. అయితే, భారత్‌లో అనేక భాషలున్నప్పటికీ గతంలో కోర్టులో వేసిన ఓ దావా వల్ల ఎన్నికల ప్రక్రియలో బెంగాలీకి చోటు లభించింది. ఎన్నికల నిర్వహణలో అనేక దేశాలు ఏకీకృత వ్యవస్థను అనుసరిస్తున్నప్పటికీ అమెరికా మాత్రం ఇందుకు భిన్నం. ప్రచార చట్టాలను ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ పర్యవేక్షిస్తుండగా.. ఎన్నికల ప్రక్రియను మాత్రం ఆయా రాష్ట్రాలు చూసుకుంటాయి. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోలింగ్ సమయం, కౌంటింగ్ ప్రక్రియకు ఆయా రాష్ట్రాలు ప్రత్యేక నిబంధనలను పాటిస్తాయి.

**ఆ ఏడు రాష్ట్రాల్లో ఆధిక్యం వస్తేనే..**

అధ్యక్ష అభ్యర్థుల తలరాతను ముఖ్యంగా అమెరికాలోని ఏడు రాష్ట్రాలు నిర్ణయిస్తాయి. జార్జియా, మిషిగన్ సహా ఏడు రాష్ట్రాల్లో ఆధిక్యం పొందిన వారే అధ్యక్షుడవుతారని విశ్లేషకులు భావిస్తున్నారు. పెన్సిల్వేనియాలోని 19 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు అధ్యక్ష ఎన్నికల్లో కీలకంగా నిలిచాయని గత అధ్యక్ష ఎన్నికలు రుజువుచేసినట్టు టెలిగ్రాఫ్ తన కథనంలో పేర్కొంది. 2024 ఎన్నికల్లోనూ ఈ రాష్ట్రం ఓట్లు కీలకంగా ఉన్నాయని తెలిపింది. కాగా, 2020 ఎన్నికల్లో జో బైడెన్‌కు స్వల్ప ఆధిక్యం ఇచ్చి ట్రంప్‌కు త్రుటిలో అధికారాన్ని చేజార్చిన ఆరిజోనా, జార్జియా, విస్కాన్సిన్, నెవాడా ఫలితాలపై అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ ప్రాంతంలో ఒపీనియన్ పోల్స్ గురించి పరిశీలిస్తే కమలా హారిస్‌కు నెవాడా, నార్త్ కరోలినాల్లో స్వల్ప ఆధిక్యం ఉండగా, ఆరిజోనాలో ట్రంప్ ముందంజలో ఉన్నారు. మిషిగన్, జార్జియా, పెన్సిల్వేనియాలో ఇద్దరి మధ్య పోటాపోటీ నడుస్తున్నది. ఈ ఏడు రాష్ట్రాల్లో ఎవరికి ఆధిక్యం వచ్చినా 3.5 శాతం తేడాయే ఉంటుందని అంచనా.

# బ్లాక్‌మెయిల్ సీఎంతో తెలంగాణ వందేళ్లు వెనక్కి

(మొదటి పేజీ తరువాయి)

ఆటో డ్రైవర్లు మీ పాలన మొదలు కాగానే ఆత్మహత్యలు చేసుకోవడం మొదలుపెట్టారు. ప్రతి వర్గాన్ని రోడ్డెక్కించారు. కంపెనీలు తరలిపోతున్నాయి. రాష్ట్ర ఆదాయం తగ్గిపోతోంది. పాలన అనుభవం లేని బ్లాక్ మెయిలింగ్ ముఖ్యమంత్రితో తెలంగాణ వందేళ్లు వెనక్కి వెళ్లే పరిస్థితి వచ్చింది. హైదరాబాద్‌లో నిరసనలు చేసేందుకు వీలు లేకుండా ఆంక్షలు పెట్టే దుస్థితి మీ ప్రభుత్వానిది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఏమాత్రం అంచనా వేయకుండా నేల విడిచి మీరు చేసిన సాము కారణంగా తెలంగాణ భవిష్యత్ తలకిందులుగా మారింది. తీరా చేయాల్సిన అన్యాయమంతా చేసి కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జు ఖర్గే సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మించి హామీలు ఇస్తే ఆ రాష్ట్రం దివాలా తీస్తుందని స్వయంగా మీ పార్టీ అధ్యక్షుల వారే నొక్కి వక్కాణిస్తున్నారు' అని మండిపడ్డారు.

**తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెబుతారా..?**

'అధికారమే పరమావధిగా బొచ్చెడు హామీలు ఇచ్చిన పాపంలో మీరే ప్రధాన భాగస్వాములు. ఇప్పుడు అందుకు క్షమాపణలు చెబుతారా రాహుల్ గాంధీ! దొరికిందే అవకాశమని ముఖ్యమంత్రి, మంత్రులు తెలంగాణను అడ్డగోలుగా దోచుకునే కార్యక్రమం పెట్టుకున్నారు. ఎవరి ట్యాక్స్ వాళ్లకు కట్టే పరిస్థితి తెచ్చారు. మీ ముఖ్యమంత్రి బహిరంగంగానే ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. కుంభకోణాలకు రాష్ట్రాన్ని కేరాఫ్ అడ్రస్‌గా మార్చేశారు. ఇది చాలదన్నట్లుగా కొడితే ఏనుగు కుంభస్థలం అన్నట్లు మూసీ ప్రాజెక్ట్ తెరపైకి తెచ్చారు. రూ.1.50 లక్షల కోట్లతో చేపడుతామంటున్న ఈ ప్రాజెక్ట్ ఎవరి ప్రయోజనాల కోసమో? ఈ మొత్తం సొమ్ములో దిల్లీ వాటా ఎంత? పేదల కడుపు కొట్టి వేల కోట్ల రూపాయలు జేబులో వేసుకొని ఈ ప్రాజెక్ట్‌కు మీ ఆమోదం లేకుండానే జరుగుతోందా? మీ మోసం, నయవంచన ఒక్క ప్రజలతోనే ఆగిపోలేదు. మిమ్మల్ని మీరు కూడా మోసం చేసుకుంటున్న తీరు చూస్తుంటే మీపై సానుభూతి కలుగుతోంది. పార్టీ ఫిరాయింపులు చేస్తే తక్షణమే వేటు పడేలా చట్టం అంటూ తెలంగాణలో ఫోజులు కొట్టారు' కేటీఆర్ విమర్శించారు.

**తేలుకుట్టిన దొంగల్లా సైలెంట్ అయ్యారు..**

'అధికారంలోకి వచ్చిన తర్వాత మీ సీఎం అడ్డగోలుగా పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతుంటే.. తేలుకుట్టిన దొంగలా సైలెంట్ అయ్యారు. రాజ్యాంగాన్ని కాపాడుతానంటూ రాజ్యాంగ ప్రతి పట్టుకొని తెలంగాణలో రాజ్యాంగ ఉల్లంఘనలు జరుగుతుంటే మౌన ముని అయిపోయారు. అదానీ విషయంలో మీ హిపోక్రసీ చూసిన తర్వాత నవ్వాలో.. ఏడవాలో తెలియని దుస్థితి. ఓ వైపు మోదీ, అదానీని కలిపి మోదానీ అంటారు. మరోవైపు తెలంగాణలో దోస్తానా చేస్తారు. సిగ్గు కూడా మిమ్మల్ని చూసి సిగ్గుపడే పరిస్థితి. మొత్తంగా ఏడాది కూడా తిరగకముందే కాంగ్రెస్ నాయకులు రోడ్లపై తిరగలేని దుస్థితి తీసుకొచ్చారు. మా తెలంగాణ ఆగమయ్యేందుకు ప్రధాన కారణం మీరే. కనుక సూటిగా మిమ్మల్నే ప్రశ్నిస్తున్నా సమాధానం చెప్పండి. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా సబ్బండ వర్గాలను మోసం చేసిన మీరు, అభివృద్ధి పథంలో ఉన్న తెలంగాణను అవినీతి తెలంగాణాగా మార్చినందుకు యావత్తు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పండి' అంటూ డిమాండ్ చేశారు.

# లబ్ధిదారుల ఎంపిక నేడో రేపో ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

ఎంపిక చేస్తాయని మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకుల జోక్యం ఉండదని పొంగులేటి తెలిపారు. పార్టీలకు అతీతంగా పేదల్లో నిరుపేదలను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. మొదటి విడతలో ఇంటి స్థలం ఉన్న వారిని ఎంపిక చేసి దశల వారీగా 5 లక్షల రూపాయలు మంజూరు చేయనున్నట్లు మంత్రి చెప్పారు.

**నాలుగు దశల్లో బిల్లు మంజూరు:** మహిళల పేరిటే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. లబ్ధిదారులు ఇళ్లను తమకు నచ్చిన డిజైన్‌లో కట్టుకోవచ్చునని, కచ్చితంగా కనీసం 400 చదరపు అడుగుల్లో వంటగది, బాత్రూం, పడక గదితో నిర్మించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నాలుగు విడతల్లో లబ్ధిదారులకు ఐదు లక్షల రూపాయలు, గ్రీన్ చానెల్ ద్వారా చెల్లిస్తామన్నారు. పునాది పూర్తికాగానే రూ.లక్ష, గోడలు నిర్మాణమయ్యాక రూ.1.25 లక్షలు, స్లాబ్ టైంలో రూ.1.75 లక్షలు, నిర్మాణం పూర్తయిన తరువాత మరో లక్ష రూపాయలు అందజేస్తామని మంత్రి తెలిపారు. బ్యాంక్ అకౌంట్ ద్వారానే లబ్ధిదారులకు నిధులు జమ చేయనున్నట్లు మంత్రి వివరించారు. ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు ఇస్తుందని, అవసరమైతే లబ్ధిదారులు మరిన్ని డబ్బులతో నిర్మాణాలు చేపట్టుకోవచ్చునన్నారు. కేంద్ర గృహ నిర్మాణ పథకం మార్గదర్శకాల మేరకు ప్రత్యేక యాప్ : మొదటి విడతలో ప్రతీ నియోజకవర్గానికి 3,500 మంజూరు చేస్తామని, నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు నిర్మించనున్నట్లు వెల్లడించారు. మొదటి విడతలో సుమారు రూ.28వేల కోట్లు ఖర్చవుతుందని.. వివిధ మార్గాల ద్వారా నిధులు సేకరించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కేంద్రం ఇచ్చే నిధులు పోగా, మిగిలిన మొత్తాన్ని రాష్ట్రం భరిస్తుందన్నారు. కేంద్రం నుంచి వీలైనంత వరకు నిధులు తీసుకుంటామని, మిగిలినవి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం మార్గదర్శకాలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ప్రత్యేక యాప్ తయారు చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. లబ్ధిదారుల ఎంపికతో పాటు, ఇళ్ల నిర్మాణ దశలను ఎప్పటికప్పుడు తెలియజేయనున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పర్యవేక్షణ కోసం విద్య, పోలీస్ హౌజింగ్ వంటి 16 శాఖలకు చెందిన ఇంజినీరింగ్ సిబ్బందిని ఒకే గొడుగు కిందకు తెచ్చి, మండలానికి ఒకరిద్దరిని కేటాయిస్తామన్నారు. స్థలాలు లేని వారికి రెండో దశలో సుమారు 80 గజాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. హైదరాబాద్‌లో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్లను త్వరలో అప్పగించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లే మరోసారి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెస్తాయని కార్యకర్తలు విశ్వసిస్తున్నారన్నారు.

# ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

అంచనా వేస్తున్నారు. ఈ ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ... మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున ప్రధానమంత్రి సహాయనిధి నుంచి ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించారు. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన ప్రయాణికులను ఎయిర్‌లిఫ్ట్ చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.4 లక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం ప్రకటించారు. ఈ ఘటనపై మెజిస్టీరియల్ విచారణ జరిపించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆ ప్రాంతంలోని సహాయ ప్రాంతీయ రవాణా అధికారి (ఎన్‌ఫోర్స్‌మెంట్)ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ వెంకటేశ్వరరావు

**విశ్వంభర, హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్‌కు విశ్రాంత ఐఏఎస్ వెంకటేశ్వరరావు ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల రోజుల్లోగా దీనిపై నివేదిక అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. హైకోర్టు ఆదేశాల మేరకే కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఈ నెల 6వ తేదీ నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల ప్రాతిపదికన సర్వే ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా.. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు కోర్టు తీర్పులను తప్పకుండా అనుసరించాలని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ మేరకు కులగణన, స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో ఇటీవల హైకోర్టు లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం సమీక్షించింది. ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవని, స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలోనూ పారదర్శకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలోనే డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ''త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నాం. యువజన సంఘాలు బడి బయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించేలా చొరవ చూపాలి. స్కూల్స్, కాలేజీల్లో డ్రాప్ అవుట్స్ సంఖ్య తగ్గాలి. ఇది యువతపై ఉన్న అతి పెద్ద బాధ్యత. యువతరం విద్యను నిర్లక్ష్యం చేయొద్దు. గంజాయి, డ్రగ్స్ లాంటివి పెను ప్రమాదకరం. అలాంటి వ్యసనాల బారిన పడొద్దు. విద్యార్థులు, నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలి. కొన్ని రాజకీయ పార్టీలు రెచ్చగొట్టే విధంగా చేసే ప్రకటనలు నమ్మొద్దు. విద్యార్థులకు చదువు, సామాజిక స్పృహ రెండూ ముఖ్యమే. చదువుకున్న వారు ప్రయోజకులు అవుతారు. సామాజిక స్పృహతో సమాజానికి సేవచేసే వారు సమాజంలో హీరోలు అవుతారు. పాఠశాలల్లో విద్యతో పాటు సామాజిక అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులు గ్రూప్ డిస్కషన్స్ ఏర్పాటు చేయాలి. ఉన్నత చదువులు చదవాలి.. తెలంగాణ పునర్నిర్మాణంలో మీరంతా భాగస్వాములు కావాలి'' అని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

# మూసీ పరీవాహక ప్రాంతాల్లో 8న సీఎం పాదయాత్ర!

**విశ్వంభర, హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 8న తన పుట్టినరోజు సందర్భంగా యాదాద్రి క్షేత్రంలో పూజలు చేయనున్నారు. అదే రోజు మూసీ పరీవాహక ప్రాంతాల్లో పాదయాత్ర చేసే అవకాశం ఉంది. భువనగిరి నుంచి వలిగొండ వైపు పాదయాత్ర చేయనున్నారని సమాచారం. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల పైపులైన్లకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. మరోవైపు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. మంత్రి కోమటిరెడ్డితో ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నాయకులు చర్చించారు.

**భట్టి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం**

నిధుల సమీకరణపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన దీన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఖజానాకు అదనపు నిధుల సమీకరణపై సమావేశంలో చర్చించారు. సంబంధిత శాఖల అధికారులతో ఉపసంఘం చర్చలు సాగాయి.

# సాఫీగా ధాన్యం కొనుగోళ్లకు చర్యలు

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉమ్మడి జిల్లాకో ఐఏఎస్‌ను ప్రత్యేక అధికారి గా నియమించింది. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని జిల్లాల్లో కొనుగోళ్లు చేపట్టాలని, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించి, ఏమైనా సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు.

**ప్రత్యేకాధికారులు**

- ఆదిలాబాద్, నిర్మల్, కుమురం భీం అసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు కృష్ణ ఆదిత్య,
- కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా జిల్లాలకు ఆర్‌వీ కర్ణన్,
- నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేటకు అనితా రామచంద్రన్
- నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు డా. ఏ.శరత్
- రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు డి.దివ్య,
- మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నాగర్‌కర్నూల్ జిల్లాలకు రవి,
- వరంగల్, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు టి.వినయ కృష్ణ రెడ్డి
- మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు హరిచందన దాసరి
- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కె.సురేంద్ర మోహన్

## సదర్ పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం ప్యారారం గ్రామంలో యాదవ కుల సోదరులు నిర్వహించిన సదర్ పండుగ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా ప్యారారం గ్రామ యువకులు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి ఘనస్వాగతం పలికారు. అనంతరం సదర్ పండుగ శుభాకాంక్షలు తెలిపి దున్నపోతుతో సయ్యాటలాడారు. సదర్ పండుగ యాదవుల గొప్పతనాన్ని వివరించారు.

## హన్మకొండ జిల్లా టిపిసిసి మీడియా, కమ్యూనికేషన్ కన్వీనర్ గా కేతిడి దీపక్ రెడ్డి



**విశ్వంభర, హన్మకొండ :** 59 వ డివిజన్ కు చెందిన కేతిడి దీపక్ రెడ్డి ని టిపిసిసి మీడియా, కమ్యూనికేషన్ డిపార్ట్మెంట్ హన్మకొండ జిల్లా కన్వీనర్ గా నియమిస్తూ టిపిసిసి మీడియా కమ్యూనికేషన్ డిపార్ట్మెంట్ చైర్మన్ సామా రాం మోహన్ రెడ్డి ఉత్తరువులు జారీ చేసారు. ఈ నియామకపు పత్రాన్ని వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కాంగ్రెస్ పార్టీలో చురుకుగా ఉంటూ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తున్న నన్ను నా సేవలు గుర్తించి నన్ను టిపిసిసి మీడియా , కమ్యూనికేషన్ డిపార్ట్మెంట్ హన్మకొండ జిల్లా కన్వీనర్ గ నియమించడం జరిగిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ల నాయకత్వములో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయడం నా వంతు పాత్ర పోషిస్తానని అన్నారు. టిపిసిసి మీడియా, కమ్యూనికేషన్ డిపార్ట్మెంట్ చైర్మన్ సామా రాం మోహన్ రెడ్డి కి టిపిసిసి మీడియా, కమ్యూనికేషన్ సెక్రెటరీ గీత అయినాల కి, వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

## చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ




**విశ్వంభర, మహబూబాబాద్ :** జనవిజ్ఞాన వేదిక కేసముద్రం మండల శాఖ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబురాలు-2024 లో భాగంగా టాలెంట్ టెస్ట్ యొక్క పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని స్థానిక జెడ్పిపిఎస్ కేసముద్రం స్టేషన్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీ చిర్రా యాకాంతం గౌడ్ ,శ్రీ బండారు నరేందర్ గారి ఆధ్వర్యంలో స్థానిక హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.రాజు హాజరై పోస్టర్ ఆవిష్కరించారు. అధ్యక్షులు చిర్రా యాకాంతం గౌడ్ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన పాఠశాల స్థాయిలో నిర్వహించే చెకుముకి టెస్ట్ కు 8, 9, 10 వ తరగతి వారికి పరీక్ష నిర్వహించి, వారిని ఈ నెల 21 న మండల స్థాయి లో నిర్వహించే టెస్ట్ సిద్ధం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ కోశాధికారి మోహన కృష్ణ, చెకుముకి కన్వీనర్ నర్సింహ రాజు, ఉపాధ్యక్షులు చందర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సదయ్య, నర్సింహ రెడ్డి, శ్రీనివాస్, మదన్మోహన్ సత్యనారాయణ, కుమారస్వామిలు పాల్గొన్నారు.

## ప్రజావాణి లో 5 దరఖాస్తులు స్వీకరణ



**విశ్వంభర, ఎల్బీనగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం హయత్ నగర్ సర్కిల్ కార్యాలయములో డాక్టర్ తిప్పర్తి యాదయ్య ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రజావాణి కార్యక్రమములో మొత్తం 5 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. టౌన్ ప్లానింగ్ 1, ఇంజనీరింగ్ 2, ప్రాపర్టీ టాక్స్ 1, శానిటేషన్ 1 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని అధికారులు తెలిపారు. త్వరితగతిన సమస్యల పరిష్కరానికి కృషి చేస్తామని అన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో 21 ఫిర్యాదులు



**విశ్వంభర, భూపాలపల్లి :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని భూపాలపల్లి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. భూపాలపల్లి జిల్లా కలెక్టర్ సెలవులో ఉండడంతో ప్రజావాణి కార్యక్రమాన్ని అగరము కలెక్టర్ నిర్వహించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 21 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను ఆర్డిఓ మంగిలాల్ తో కలిసి స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజల గొంతు తడిపేందుకే అమృత్ 2.0

### కేంద్ర మంత్రి బండి సంజయ్



**విశ్వంభర, కరీంనగర్:** దేశంలో ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చి ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్ లోని ఉజ్వల పార్కు సమీపంలో ఫిల్టర్ బెడ్ వద్ద కేంద్రమంత్రి 1500%ఎల్%క్లియర్ వాటర్ సంపు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నగర మేయర్ సునీల్ రావు మాట్లాడారు. రాబోయే 30 సంవత్సరాల వరకు నగరపాలిక పరిధి జనాభా ఐదు లక్షలు అయినా తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రూ 18 కోట్లతో చేపట్టే పనులతో డిసెంబర్ చివరికల్లా హౌసింగ్ బోర్డ్ కాలనీ పరిధిలో 24 గంటలు తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చామని.. పార్టీలకతీతంగా ప్రజల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కౌన్సిలర్ స్థాయి నుంచి వచ్చిన నాకు ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన మానేరు రివర్ ఫ్రంట్ పనులు పూర్తి చేసేలా చొరవ తీసుకోవాలని కేంద్రమంత్రికి విన్నవించారు. ఇది పూర్తయితే దక్షిణ భారతదేశంలోనే మొదటిది అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పురస్కార గ్రహీత చొల్లేటి సోమ నర్సింహ్మా చారికి సన్మానం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ప్రజా సమస్యల పరిష్కారం కోసం పత్రికా విలేకరులు వారధిగా పనిచేయాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనరసింహారెడ్డి అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా డైరెక్టర్ , ఈనాడు సీనియర్ జర్నలిస్ట్ చొల్లేటి సోమ నర్సింహ్మా చారి ఉత్తమ విలేకరిగా జాతీయ పురస్కారం అందుకున్న సందర్భంగా సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ, మోత్కూరు మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. డాక్టర్ గుర్రం లక్ష్మీనరసింహారెడ్డి మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో విలేకరుల పాత్ర కీలకమైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చొల్లేటి సోమ నర్సింహ్మా చారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా డైరెక్టర్లు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి ,పన్నాల శ్రీనివాసరెడ్డి, మోత్కూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఓ సత్యనాధ్, మెట్టుమంగేష్, ఉపాధ్యక్షుడు ముప్పా వెంకటరెడ్డి ,కోశాధికారి బుస్స రవి, యూత్ వింగ్ జిల్లా అధ్యక్షుడు బీసుమచ్చగిరి, సింగిల్ విండో మాజీ చైర్మన్ చింతల విజయభాస్కర్ రెడ్డి, రెడ్ క్రాస్ ప్రతినిధులు డాక్టర్ మధు, డాక్టర్ చంద్రమౌళి, మాజీ సర్పంచ్ చేతరాశి అంజయ్య, తమ్మినేని శ్రీనివాసరావు, లేంకల వేణు, బద్దం నాగార్జున రెడ్డి, వెంకట్ రెడ్డి, ఉయ్యాల అంజయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జి రామచంద్రయ్య గౌడ్, అనిల్ పాల్గొన్నారు.

# రైతన్న నడ్డి విరిచిన మోసకారి కాంగ్రెస్

### నాడు గింజగింజకు కేసీఆర్ హామీ - నేడు గడియగడియ గండమే

### -మాజీ జెడ్పిటిసి అనూరాధ పత్య నాయక్



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలో మాజీ జెడ్పిటిసి అనురాధ పత్య నాయక్, స్థానిక బిఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి మార్కెట్ యార్డు ఆవరణలో వరి పంటకు, పత్తికి మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకోవాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొంటే 500 బోనస్ లేదని, రుణమాఫీ లేదు, రైతు బంధు లేదు, రైతు భీమా లేదు, చివరకు పంట కొనుగోళ్లు లేవని ఈ అసమర్థపు పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు మర్చిపోయి తెలంగాణ ప్రజలను మభ్యపెడుతుందని అనురాధపత్య నాయక్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు లాలయ్య గౌడ్, సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్ నాయక్, యూత్ వింగ్ అధ్యక్షుడు దేరంగుల వెంకటేష్, మున్సిపాలిటీ కార్యదర్శి వడ్డేమోని శివకుమార్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ లండం యాదయ్య, కొమ్ము ప్రసాద్, గణేష్, మద్దూరి ఆనంద్, మహేష్ నేత, గణేష్ నాయక్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం



**విశ్వంభర, మహబూబాబాద్ :** సోమవారం ఐ.డి.ఓ.సి లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ఆప్తాలమిక్ ఆఫీసర్స్, సూపర్వైజర్ స్టాఫ్ కి జాతీయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి మురళీధర్ మాట్లాడుతూ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన, మెటర్నల్ చైల్డ్ హెల్త్, కీటక జనిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధిలు, విస్తృత వ్యాధి నిరోధక టీకాలు, కుష్టి వ్యాధి, క్షయ వ్యాధి, హెచ్ ఐ వి ఎయిడ్స్, మరియు కుటుంబ నియంత్రణ కార్యక్రమాలలో భాగంగా గర్భిణీ స్త్రీల నమోదు 12 వారాలలో నమోదు చేయాలని, మొదటి రెండు చెకప్ లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారితో, మూడు నాలుగు చెకప్ లు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో స్త్రీ వైద్య నిపుణులచే పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైతే స్కానింగ్ కూడా తీయబడునని, గర్భిణీ స్త్రీలను తీసుకువెళ్లడానికి 102 వాహనాన్ని ఉపయోగించుకోవాలని, సాధారణ ప్రసవాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చేయాలని, సిజేరియన్ ఆపరేషన్లు తగ్గించాలని, మొదటి కాన్పుకు, రెండవ కాన్పుకు మధ్యన ఎడమ ఉండడానికి తాత్కాలిక పద్ధతుల గూర్చి అవగాహన కల్పించాలని, ఇద్దరు పిల్లలైనా ఆడైనా, మగైనా కుటుంబ నియంత్రణ పద్ధతులైన, మగవారికి కోత కుట్టు లేని ఆపరేషన్ అయినా ( నొస్కాల్ పెల్ ) వ్యాసెక్టమీ ఆపరేషన్ గూర్చి, మరియు స్త్రీలకు ట్యూబక్టమ్ ఆపరేషన్ గూర్చి ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమములో డాక్టర్ సుధీర్ రెడ్డి , డాక్టర్ సారంగం, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ శ్రవణ్ కుమార్,డిప్యూటీ డెమో కే.ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి.రాజు, పురుషోత్తం,సబ్ యూనిట్ ఆఫీసర్స్ రామకృష్ణ, వడ్డెబోయిన శ్రీనివాస్,ఐ సి డి పి హెచ్ ఎన్ ఓ మంగమ్మ, డిపిఓ రుక్కుద్దీన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి పని చేయాలి

### జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**విశ్వంభర, మహబూబాబాద్ :** సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, సంబంధిత అధికారులతో కలిసి జిల్లాలోని రైస్ మిల్లర్లతో ధాన్యం కొనుగొల్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలో రైస్ మిల్లర్లు, మిల్లులను నిర్వహించాలని, నిర్దేశించిన ప్రకారం బ్యాంకులకు ఒప్పందాలు సమర్పించాలని, సీఎంఆర్ డెలివరీ అయిన తర్వాత లారీలను వెంటనే పంపాలని ధాన్యం కొనుగోలు అనంతరం దిగుమతి నివేదికలను వెంటనే సమర్పించాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన లక్ష్యాలను సకాలంలో మిల్లర్లు పూర్తి చేయాలన్నారు. ఏ,బి, రిజిస్టర్లు మెయింటైన్ చేయాలని, ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా మిల్లర్లు సహకరించాలని కలెక్టర్ కోరారు. అనంతరం మండల స్థాయిలో తహసిల్దార్లు, ఎంపీడీవోలు, కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలతో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ ఆర్డిఓ కృష్ణవేణి, డీఎస్ఓ ప్రేమ్ కుమార్, డీఎం సివిల్ సప్లై కృష్ణవేణి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అంబరీష్, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, డిఏఓ విజయనిర్మల, మండలాల నుండి తాసిల్దారులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## స్వీయ సంరక్షణకు కరాటే ఎంతో అవసరం: చిలుక ఉపేందర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** స్వీయ సంరక్షణకు కరాటే ఎంతో అవసరం అని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీ లో డి జ్ స్పోర్ట్స్ హబ్ లో కరాటే క్లాస్ లను చిలుక ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కరాటే వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారు అవుతారు అని అన్నారు. అనంతరం జరిగిన కరాటే పోటీలను తిలకించి పోటిలల్లో ప్రథమ బహుమతి పొందిన పల్లవి ని అభినందించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు పెద్దపూర సైదులు, నిర్వాహకులు శ్రీకాంత్, అరవింద్, కరాటే శిక్షకులు మహేష్, రాము, శివ, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు



**విశ్వంభర, కొత్తూరు :** పెండింగ్ లో ఉన్న గ్రామపంచాయతీ బిల్లులను విడుదల చేయాలని న్యాయంగా నిరసన చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో అక్రమంగా అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. కోడిచర్ల తండా మాజీ తాజా సర్పంచ్, కొత్తూరు మండల సర్పంచ్ల సంఘము అధ్యక్షులు సంతోష్ నాయక్. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని ఏడాది కాలంగా అడిగినా ఇవ్వకపోవడం పై మాజి ప్రజాప్రతినిధులు నిరసన,ధర్నాలకు దిగారు. ఇందులో భాగంగా కోడిచర్ల సర్పంచ్ మాజి సర్పంచ్ ను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్బంగా కొత్తూరు మండల సర్పంచ్ల సంఘము అధ్యక్షులు మాట్లాడుతూ ఏడాది కాలంగా పెండింగ్ లో ఉన్న బిల్లులను అడిగినా ఇవ్వకపోవడం అన్యాయమని మండిపడ్డారు. శాంతియుత నిరసనకు పిలుపునిచ్చిన సర్పంచులను అరెస్ట్ చేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పల్లె ప్రగతి పేరుతో తాము చేపట్టిన కార్యక్రమానికి తూట్లు పొడిచి, నిధులు విడుదల చేయకుండా ఆపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్ట్ చేసిన సర్పంచ్ లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణలో గాడి తప్పిన విద్యా వ్యవస్థ

### - మండల బిఆర్ఎస్ కార్యదర్శి కూరెళ్ల మణికుమార్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి విద్యా వ్యవస్థ గాడి తప్పి గందరగోళంలో పడిందని ఆత్మకూరు(ఎం)మండల బిఆర్ఎస్ కార్యదర్శి కూరెళ్ళ మణికుమార్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇప్పటికే ఈ విద్యా సంవత్సరంలో ఆలస్యంగా జరిగిన విద్యార్థుల అడ్మిషన్ ప్రక్రియ ఇలా ఉండగా, ఈ ఏడాది విద్యార్థులకు అందనున్న పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు ఇంకా విద్యార్థులకు అందించని కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇది ఇలా ఉండగా టీచర్ల బదిలీలు, పదోన్నతులు, ఇవి ముగియగానే దసరా,దీపావళి సెలవులు ఇప్పుడైనా పాఠశాలలు సాగుతాయి అనుకుంటే కులగణన సర్వే అనే అంశంతో దాదాపుగా ఈ మూర?పు ప్రభుత్వం మూడు వారాల పాటు ఒక్క పూట బడులు నిర్వహిస్తాం అనేది చాలా బాధాకరం,కుల గణనను స్వాగతిస్తున్నాం కానీ విద్యార్థులను చదువుకు దూరం చేయడం మంచి నిర్ణయం కాదని అన్నారు . అయ్యా రేవంత్ రెడ్డి పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు అంటే ఎందుకు మికంత చులకనా, మీరు తీసుకున్న నిర్ణయం పేద విద్యార్థులను చదువుకు దూరం చేయడం కాదా ? అంటూ ప్రశ్నించారు.

## ఇంద్రపాల నగరంలో మన ఊరు - మన బడి....



**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, ఇంద్రపాలనగరం గ్రామంలో పెద్దబడి పునరావాసం కోసం పూర్వ విద్యార్థుల నుండి సహాయ సహకారాలకై, గ్రామానికి చెందిన నాయకులు పూస బాలకిషన్ ఆహ్వానిస్తూ, పూర్వ విద్యార్థులందరం కలిసికట్టుగా ఉండి మనం చదువుకున్న బడిని మన బడిలో ఇప్పుడు చదువుతున్న పిల్లలకు సౌకర్యాలు లేక ఇబ్బది పడుతున్నారు. చదువుతోపాటు అన్ని సౌకర్యాలు ఉండే విధంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు త్రాగునీటి వసతి కానీ, భోజనశాల కానీ, భూగర్భ బోర్లు గాని, ఆఫీస్ ఫర్నిచర్ కానీ, ఇతర పాఠశాల తరగతి గదులకు పెయింటింగ్, ఇతర మహనీయుల చిత్రాలు కానీ లేవు. వీటన్నింటికి సానుకూలంగా స్పందించి, గ్రామంలో అన్ని కుల సంఘాలు, పూర్వ విద్యార్థులు, పార్టీలకతీతంగా పాఠశాలలో వసతి సౌకర్యాలకు, మనం చదువుకున్న పాఠశాల అభివృద్ధికై మన వంతుగా మన బడికి తోచినంత దానం రూపంలో సహాయం చేసి, మన బడి అభివృద్ధిలో భాగ్యస్వాములం అవుదాం, మన పిల్లల భవిష్యత్ లో వెలుగులు నింపుదాం, అని కోరుతూ గ్రామస్తుల నుండి సహకారాన్ని కోరుతున్నారు.

## సిమెంటు పరిశ్రమ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, రామన్నపేట నుండి కొమ్మాయిగూడెం వరకు విస్తరించి ఉన్న సబ్బం గుట్టలను అక్రమంగా ఆక్రమించి రెండు కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మాణం చేసిన అంబుజా సిమెంట్ పరిశ్రమ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెపురం రాజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం జిఎంపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సబ్బం గుట్టలలో రోడ్డు నిర్మాణం చేసిన ప్రాంతాన్ని గొర్రెల పెంపకందారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల కిందట ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 559 ప్రకారం జీవాల మేత కోసం ఈ గుట్టలను కొమ్మాయిగూడెం, రామన్నపేట గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలకు కేటాయించిందని గుర్తు చేశారు. సిమెంటు పరిశ్రమ ఏర్పాటు కోసం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన మండల,డివిజన్,జిల్లా రెవిన్యూ అధికారులు ప్రభుత్వ యంత్రాంగం గుట్టను అనుకొని నిర్మించిన రోడ్డును చూసి చూడనట్లు వ్యవహరించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిఎంపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కల్లూరి నాగేష్, మండల పర్యావరణ పరిరక్షణ కమిటీ కన్వీనర్ జల్లెల పెంటయ్య, కో-కన్వీనర్ రెహాన్, తిరుగుడు మల్లికార్జున్, జిఎంపిఎస్ నాయకులు నీల అయిలయ్య, గొర్రెల పెంపకందారుల సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కనగంటి ఐలయ్య, తీర్పాల మల్లయ్య, తీర్పాల ఐలయ్య, మోటె శీను, ఇస్తారి, బంటు సత్తయ్య, రేపాక లింగస్వామి, బాతుక వెంకన్న, బాతుక మహేష్, బెల్లి లింగస్వామి, నర్సింహ్మా, బుర్ర శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## 28 గొర్రెల అపహరించిన గుర్తుతెలియని వ్యక్తులు

**విశ్వంభర, మాడుగుల :** గుర్తుతెలియని వ్యక్తులు 28 గొర్రెలను అపహరించిన సంఘటన అప్పరెడ్డి పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే మాడుగుల గ్రామానికి చెందిన మంచన కరుణాకర్ అనే వ్యక్తి అప్పారెడ్డి గ్రామ శివారులో కేవైబి కుమార్ పొలంలో గొర్ల ఫామ్ గత మూడు సంవత్సరాల నుంచి నడుపుతున్నాడు. ప్రతిరోజు లాగానే అతని వద్ద గొర్లను కాస్తున్న ఉడుతల కృష్ణయ్య అను వ్యక్తి నవంబర్ 3 న సాయంత్రం గోర్లను దొడ్డిలో తోలి ఇంటికి వెళ్లి పోయాడు. తర్వాత రోజు ఉదయం అతని వద్ద పని చేయుచున్న భాస్కర్ అనే వ్యక్తి తనకు ఫోన్ చేసి గొర్ల దొడ్డిలో ఉన్న కొన్ని గోర్లు లేవు అని తెలుపగా వెంటనే యజమాని కరుణాకర్ ఏడు గంటలకు గొర్ల దొడ్డి వద్దకు వెళ్లి గొర్రెలను లెక్క చూడగా 28 గోర్లు లేవని వాపోయాడు . గొర్ల దొడ్డికి సిసి కెమెరాలు పెట్టిన వాటికి ఉన్న కరెంటు కట్ చేసి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తన గోర్లు దొంగతనం చేశారని ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాడుగుల సిఐ జగదీశ్వర్ తెలిపారు

## మెదక్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం లో పాల్గొన్న నీలం మధు



**విశ్వంభర, మెదక్ :** జిల్లా గ్రంధాలయ చైర్మన్ గా నియమితులైన చిలుమల సుహాసిని రెడ్డి ప్రమాణస్వీకారోత్సవం లో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. సోమవారం మెదక్ పట్టణంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ గ్రంథాలయ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన సుహాసిని రెడ్డి కి మెదక్ జిల్లా పరిధిలోని గ్రామాలలో నూతన గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. పుస్తకాలే విజ్ఞాన భాండాగారాలని గ్రంథాలయాల ఏర్పాటుతో విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు అందుబాటులోకి వచ్చి విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజీ రెడ్డి,మెదక్ డీసీసీ ప్రెసిడెంట్ ఆంజనేయులు గౌడ్,మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ భూం రెడ్డి, శేష సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం

### - పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి



**విశ్వంభర, పరిగి :** రైతుల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి అన్నారు. పరిగి నియోజకవర్గ పరిధిలోని రుఖాన్పేన్ పెట్, సోమన్ గుర్తి లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరంగా కృషి చేస్తుందన్నారు. మధ్యవర్తులను ఆశ్రయించి రైతులు నష్టపోకుండా కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పత్తి కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. అలాగే ఎన్నికల సమయంలో చెప్పిన మాట ప్రకారం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు. రైతులను రాజు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి హనుమంతు, ఉపాధ్యక్షులు లాలు కృష్ణ, పరిగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరశురాంరెడ్డి, డిసిసి కార్యదర్శి పెంటయ్య, పూడూరు మండల పిఎసిఎస్ చైర్మన్ సతీష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అక్బర్, సత్యనారాయణ, రామకృష్ణ ,ఆనంద్, తౌరియా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లిలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ



**విశ్వంభర, భూపాలపల్లి:** సోమవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుండి సుభాష్ కాలనీకి వెళ్లే మెయిన్ రోడ్డును పంచాయతీ రాజ్ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేనికారణంగా మురుగు నీరు రోడ్డు వెంట పారడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇట్టి సమస్యలను విన్న ఎమ్మెల్యే త్వరితగతిన పెండింగ్ లో ఉన్న రోడ్డు విస్తరణ, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను పూర్తి చేయాలని పీఆర్ అధికారులకు సూచించారు.

## ఘనంగా గోదావరి హారతి, సామూహిక సహస్ర దీపోత్సవం



**విశ్వంభర, భూపాలపల్లి:** రాష్ట్రంలోని ప్రముఖ త్రిలింగ క్షేత్రం కాళేశ్వరం లో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశముల ప్రకారం కార్తీక మాసం సోమవారం సందర్భంగా గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన రాజ గోపురం నుండి మంగళ వాయిద్యాలతో గోదావరి నది వద్దకు బయలుదేరి ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు గోదావరి నది హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఏ మారుతి , సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, దేవస్థానం మాజీ చైర్మన్ గుడాల శ్రీనివాస్, మంథని మునిసిపల్ చైర్మన్ పెండ్రి రమ , కాలేశ్వరం గ్రామస్తులు, భక్తులు ,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం దేవస్థానం ధ్వజస్తంభం వద్ద సామూహిక సహస్ర దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు మట్టి ప్రమిదలు, వత్తులు, నూనె దేవస్థానం నుండి ఉచితంగా ఇవ్వడం జరిగినది. పాల్గొన్న మహిళ భక్తులందరికీ దేవస్థానం నుండి పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులు ప్రసాదంగా దేవస్థానం కార్యనిర్వాహణాధికారి మారుతి మరియు అర్చక స్వాములు అందచేసారు.

## రాజకీయ కక్షతోనే మంత్రిపై పుట్ట మధు విమర్శలు



**విశ్వంభర, భూపాలపల్లి :** తాను ఎమ్మెల్యేగా గెలవలేదని అక్కసుతో, రాజకీయ కక్షతో మంత్రి శ్రీధర్ బాబు పై పుట్ట మధు అసత్య ఆరోపణలు చేస్తున్నారని భూపాలపల్లి జిల్లా కాటారం మండల కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశంలో విమర్శించారు. కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు అనునిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ ఇప్పటివరకు 76 డెలివరీలు చేశారని, రెండుసార్లు ఉత్తమ వైద్యురాలిగా అవార్డు అందుకున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన గర్భిణీకి సాధారణ ప్రసవం చేయాలని శతవిధాల ప్రయత్నించి కుదరకపోవడంతో భూపాలపల్లి ఆసుపత్రికి పంపించారని వారు తెలిపారు. ఆ సంఘటనలో శిశు మృతి చెందడం చాలా బాధాకరమని ఆ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరపున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని వారు అన్నారు. ఈ ఘటనలో మంత్రి శ్రీధర్ బాబు పై ఆరోపణలు చేస్తూ పుట్ట మధు తన స్థాయిని దిగజార్చుకుంటున్నారని ప్రతి విషయాన్ని రాజకీయ దురుద్దేశంతో చూస్తున్నారని వారు అన్నారు. పుట్ట మధు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నడిరోడ్డుపై లాయర్ల హత్యలు జరిగాయని, పోలీస్ స్టేషన్లో లాకప్ డెత్ లు జరిగాయని , ఇసుక లారీల వల్ల చాలామంది చనిపోయారని అప్పుడు ఏ ఒక్కరిని పుట్ట మధు పరామర్శించలేదని ఎద్దేవా చేశారు. ఇప్పుడు అధికారం పోవడంతో మంథని నియోజకవర్గ ప్రజలు తమను మర్చిపోతారని చెప్పి ఎక్కడ ఏ విషయం జరిగిన దానిని భూతద్దంలో చూపెట్టి మంత్రి శ్రీధర్ బాబు పై, ఆయన తమ్ముడు శీను బాబు పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని వారు అన్నారు. ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సమస్యలు- పరిష్కార మార్గాలపై పోస్టర్ ఆవిష్కరణ



**విశ్వంభర, హైద్రాబాద్ :** ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ గ్రేటర్ హైదరాబాద్ సిటీ ఈడో మహాసభల సందర్భంగా న్యాయవాదుల సమస్యలు పరిష్కార మార్గాలని అంశంపై ఈనెల 16వ తేదీన శనివారం ఉదయం 10:30 గంటలకు హిమాయత్ నగర్ లోని అమృత ఎస్టేట్లో "న్యాయవాదుల సమస్యలు- పరిష్కార మార్గాలు", అనే అంశంపై జరిగే సెమినార్ జయప్రదం చేయాలని రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొండల్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ జీ కృష్ణ. ఐఏ ఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె ,వి ,ఎల్, గ్రేటర్ హైదరాబాద్ సిటి జనరల్ సెక్రెటరీ జయ శ్రీనివాస్ ఐఏ ఎల్ సెమినార్ పోస్టర్ను ఆవిష్కరించి పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ లో ఐ ఏ ఎల్ మహాసభ ల సెమినార్ పోస్టర్ ఆవిష్కరించిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై. కొండల్ రెడ్డి , జనరల్ సెక్రెటరీ గులుగారి కృష్ణ, ఉపాధ్యక్షులు రాజేందర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, విప్లవ రెడ్డి, ఆర్. కుమార్ గౌడ్ ,రావుల వెంకటరెడ్డి, ఉదయ్ శంకర్,కె. వీరబాబు ,నాగేశ్వరరావు, బి లక్ష్మయ్య, సుభాష్ చంద్రబోస్, నర్సింగరావు , పులి గారి గోవర్ధన్, ఎం. అనిత, కెరీత్ కుమారి, జక్కుల వెంకటేష్, జ్యోతి మాధవి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్ రెడ్డి, ఎం రవీందర్ రావు, ఆర్ బి రామారావు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు అందజేయండి



**విశ్వంభర, కల్వకుర్తి :** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో లాటరీ ద్వారా ఎన్నుకున్న 240 మంది డబల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులు కల్వకుర్తి పట్టణంలోని యుటిఎఫ్ భవన్ నుంచి డబల్ బెడ్ రూమ్ ల వరకు ర్యాలీగా వెళ్లి డబల్ బెడ్ రూమ్ ల పైకి ఎక్కి నిరసన తెలిపారు. లబ్ధిదారులు మాట్లాడుతూ ఇంటి అద్దె చెల్లించే స్థితిలో లేము. నిరుపేదలు విద్యుత్ సరఫరా లేకున్నా గాని దీపాలు పెట్టుకుని జీవనం సాగిస్తామని అధికారులను రాజకీయ నాయకులను దయచేసి ఇప్పటికైనా డబల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు కేటాయించి వారి బాధలు తీర్చాలని కోరారు.

## విలాసవంతమైన జీవితం కోసం గంజాయి దందా

### 22 సంవత్సరాల యువకుడు అరెస్ట్



**విశ్వంభర, మేడిపల్లి :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇస్లాంపూర్ చెందిన సయ్యద్ యూసఫ్ ( 22) తన తండ్రి మీర్ జైహిద్ అలీ హైదరాబాదులో చేస్తున్న వ్యాపారం చూసుకుంటానని వెళ్లి గంజాయి వ్యసనానికి అలవాటు పడ్డాడు. విలాసాలకు డబ్బులు సరిపోవడంలేదని తనతో ఫజల్ అనే వ్యక్తి గంజాయి అమ్ముతాడని తెలిసి అతని వద్ద తక్కువ ధరకు గంజాయిని కొని జగిత్యాల , మేడిపల్లి మండల చుట్టుపక్క ప్రాంతాల యువతకు అధిక ధరకు గంజాయి అమ్మేవాడు. ఈ క్రమంలో గంజాయి తాగే వారికి అమ్ముదామని తీసుకొస్తున్న తరుణంలో పక్కా సమాచారం మేరకు మేడిపల్లి పిఎన్ఆర్ గార్డెన్స్ వద్ద శ్యామ్ రాజ్ తన సిబ్బంది అనిల్ కుమార్ చంద్రశేఖర్ భగవాన్ లతో కలిసి సయ్యద్ యూసఫ్ స్కూటీలో గల 165 గ్రాముల గంజాయిని స్కూటీ మరియు సెల్ఫోన్ లను స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మెట్ పల్లి డి.ఎస్.పి ఉమామహేశ్వరరావు, కోరుట్ల సీఐ సుధీర్ బాబు, మేడిపల్లి మండల భీమారం మండలం యువతను ఉద్దేశించి మాట్లాడుతూ మత్తు పదార్థాలు, మద్యం లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. మేడిపల్లి ఎస్సై శ్యామ్ రాజ్, సిబ్బందిని అభినందించారు

## ఉద్యోగులకు అండగా రేవంత్ సర్కార్

### -వైస్ చైర్మన్ ఎండి ఫహీముద్దీన్



**విశ్వంభర, హైదరాబాద్ :** ఉద్యోగులకు అండగా రేవంత్ సర్కార్ ఎల్లపుడూ ఉంటుంది అని టీజీ మైనార్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ వైస్ చైర్మన్ ఎండి ఫహీముద్దీన్ అన్నారు. సోమవారం తెలంగాణ ఎన్జీవోల రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏస్.ఎమ్.హుస్సేని, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, నాల్గో తరగతి రాష్ట్ర అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, చందు లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎండి ఫహీముద్దీన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసి ఇప్పుడు తెలంగాణ అభివృద్ధిలో భాగంగా పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎల్లవేళల ఉద్యోగులకు అనుకూలంగా పని చేస్తుందని అని అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చూపుతున్న చొరవకు టీఎన్జీవో సంఘం కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ని కూడా కలిసి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని తెలిపారు.

## మియాపూర్ నుండి పటాన్‌చెరు వరకు మెట్రో రైల్ మంజూరు

### రఘునందన్ రావు కు అభినందనలు తెలిపిన సెంట్రల్ టెలికాం బోర్డ్ మెంబర్ బిజెపి జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్



**విశ్వంభర, సంగారెడ్డి :** గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా మియాపూర్ నుండి పటాన్ చేరు కి మెట్రో రైల్ తీసుకువచ్చిన ఎంపీ రఘునందన్ రావు కి సెంట్రల్ టెలికం బోర్డు మెంబర్ బీజేపీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సమయంలో ప్రజలు ఉద్యోగస్తులు రవాణా సమస్యలు రోడ్లపై జరిగే ఎన్నో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్న క్రమంలో రోడ్లపై జరిగే యాక్సిడెంట్ ల వల్ల ఎంతోమంది కుటుంబాలు ఇబ్బందిపడుతున్న ఇబ్బందులకు పరిష్కారం చూపిస్తానని గత ఎన్నికల్లో హామీ ఇవ్వడం జరిగింది. అందులో భాగంగానే మెదక్ పార్లమెంట్ ఎన్నికలు జరిగి గెలిచిన అనంతరం ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొట్టమొదటి కార్యక్రమం ప్రజలు పడుతున్న ఇబ్బందులను తీర్చాలని మెట్రో రైల్ ఎండి ని కలిసి వారికి మెట్రో రైల్ ను సంగారెడ్డి వరకు పొడిగించాలని వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇవ్వడమే కాకుండా ఎప్పటికప్పుడు అధికారులతో సమక్షించి కచ్చితంగా డిసెంబర్ లోపల మెట్రో రైలు సాధించాలని చెప్పిన విధంగానే శాయశక్తుల ప్రయత్నాలు జరిపి మంజూరు అయ్యేవరకు పోరాటం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంగడి బాలరాజు, దిశా కమిటీ మెంబర్ బిజెపి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మాజీ కే సుజాత, ప్రముఖ న్యాయవాది సీనియర్ బిజెపినాయకులు యం.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు

## కంప చెట్లను తొలగించిన మాజీ సర్పంచ్



**విశ్వంభర, వెల్దండ :** వెల్దండ మండల పరిధిలోని కుప్పగండ్ల పెద్దాపూర్ బీటీ రహదారిపై ఉన్న కంపచెట్లను మాజీ సర్పంచ్ మోక్తాల శేఖర్ సొంత ఖర్చులతో సోమవారం జెసిబి తో తొలగించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెర గడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ప డుతున్నారని, ప్రతిరోజు రోడ్డు ప్రమాదాలతో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికుల రాకపోక లకు ఇబ్బందులు కలగకుండా కంప చెట్లను తొలగించామని అన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామస్తు లు దశరథం, శ్రీనివాస్ యాదవ్, లక్ష్మయ్య, పెద్ద మల్లేష్, చంద్ర య్య, ఆంజనేయులు, గోరేటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కుంకుమేశ్వర దేవాలయంలో మహా అన్నప్రసాద కార్యక్రమం

### హాజరైన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**విశ్వంభర, హనుమకొండ జిల్లా:** పరకాల పట్టణంలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం మొదటి సోమవారంను పురస్కరించుకొని పరకాల వ్యవసాయ మార్కెట్ మాజి చైర్మన్, బిఆర్ఎస్ నాయకులు బండి సారంగపాణి ఏర్పాటు చేసిన మహా అన్న ప్రసాద కార్యక్రమమాన్ని పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. మొదటగా ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆ పరమేశ్వరుడి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతున్ని కోరినట్లు వారు తెలిపారు. అనంతరం మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ, పరకాల, నడికూడ మండలాల ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదుకు మంచి స్పందన



**విశ్వంభర, కూకట్‌పల్లి :** బీజేపీ సభ్యత్వ నమోదు కు మంచి స్పందన ఉందని జిల్లా స్వచ్ భారత్ కన్వీనర్ గురు చరణ్ గుప్త అన్నారు. కె పి హెచ్ బి కూకట్పల్లి లో గురు చరణ్ గుప్త ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం లోని బీజేపీ చేస్తున్న అభివృద్ధి నీ చూసి ప్రజలు ఎంతో ఆకర్షితులు ఔతున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో హరిబాబు, మహిళా మోర్చ నాయకులు రత్న కుమారి, మధు గౌడ్, గణేష్,రమణ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంను కమ్మేసిన పొగమంచు



**విశ్వంభర, భూపాలపల్లి :** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలోని గోదావరి నదిపై పొగ మంచు కప్పి వేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నది తీరంలో పొగ మంచుతో భక్తులు ఒకరికొకరు కనబడక నదిలో స్నానం చేయడానికి ఇబ్బంది పడ్డారు.

## కాటారం టియుడబ్ల్యూజే ఇన్చార్జిగా గుజ్జేటి శ్రీనివాస్

**విశ్వంభర, భూపాలపల్లి :** జిల్లాలోని కాటారం సబ్ డివిజన్ ఐ జె యు ( టి యు డబ్ల్యూ జె ) ఇంచార్జ్ గా మనం పత్రిక జిల్లా రిపోర్టర్ గుజ్జేటి శ్రీనివాసును నియమించినట్లు భూపాలపల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సతీష్ ,శ్యామ్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో కాటారం సబ్ డివిజన్ పరిధిలోని మహాదేవపూర్, పలిమేల,మహాముత్తారం కాళేశ్వరం ప్రెస్ క్లబ్ మహాదేవపూర్ కాటారం పలిమెల, మహా ముత్తారం తో పాటు జిల్లా కోశాధికారి కుమార్ ఆధ్వర్యంలో గుజ్జేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల ఐ జె యు కమిటీ కార్యాలయాలు త్వరలో రాష్ట్ర జిల్లా నాయకత్వం ఆదేశాల మేరకు ప్రారంభం కానున్నాయి అని వారు తెలిపారు. జిల్లాలో జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు , అక్రిడేషన్ సమస్యల కోసం ఐ జె యు జిల్లా నాయకత్వం పోరాటం చేస్తుంది అని అన్నారు. కావున జర్నలిస్టులందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కమిటీ సూచన మేరకు జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లోని జర్నలిస్టు మిత్రులకు యూనియన్లకు అతీతంగా జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాల కోసం ప్రొఫార్మా అప్లికేషన్ ఫామ్ ను వాట్సాప్, వ్యక్తిగతంగా ఇవ్వడం జరిగింది అని, కావున అందరూ జర్నలిస్టు మిత్రులు పూర్తిచేసి భూపాలపల్లి కాకతీయ ప్రెస్ క్లబ్ ఇవ్వగలరు అని విజ్ఞప్తి చేశారు.

## నదీ తీరాన్ని శుభ్రం చేసిన పంచాయతీ సిబ్బంది



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం నది తీరం వద్ద భక్తులు వదిలిన బట్టలు, ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలను గ్రామపంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించి శుభ్రం చేశారు. నది తీరప్రాంతమంతా బ్లీచింగ్ పౌడర్ చల్లి వ్యర్థాలను వేయడానికి డ్రమ్ములను ఏర్పాటు చేశారు.

## ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చొరవతో హైమాస్ట్ లైట్లు



**విశ్వంభర, దోమ :** మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆశన్న గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అడిగిన వెంటనే మన గ్రామానికి హైమాస్ట్ లైట్లను అందజేశారని తెలిపారు. గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిపారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్న ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ఆలయం లో భక్తుల రద్దీ



**విశ్వంభర, భూపాలపల్లి:** రాష్ట్రంలోని ప్రముఖ త్రివేణి సంగమ క్షేత్రం కాళేశ్వరం లోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాస సోమవారం సందర్భంగా కాళేశ్వరానికి విచ్చేసిన భక్తులు ఉదయాన్నే గోదావరిలో స్నానమాచరించి స్వామివారికి అభిషేకాలు జరిపారు. తర్వాత ఉసిరికాయ చెట్టు వద్ద దీపాలు వెలిగించి అర్చకులకు దీప దానాలు అందజేశారు. కార్తీక మాస సోమవారం సందర్భంగా ఆలయంలో 133 అభిషేకాలు జరిగినట్లు ఆలయానికి మూడు లక్షల ఇరవై వేల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రారంభంలో అందే బాబయ్య



**విశ్వంభర, కేశంపేట :** పాపిరెడ్డి గూడ గ్రామంలో రాజ రాజేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బిజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, కేశంపేట మండలం బిజేపి అధ్యక్షులు రొల్ల రఘురాం గౌడ్, సభ్యత్వ నమోదు కో కన్వీనర్ నరేందర్ రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మధు సూదన్ గౌడ్, శివ ఇంకా గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన స్పైసి టేబుల్ రెస్టారెంట్‌ను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ , శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రారంభించారు. వీరితో పాటు హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. (విశ్వంభర, కూకట్‌పల్లి)

## మిత్రుడికి ఆర్థిక సహాయం



**విశ్వంభర, రంగారెడ్డి :** కేశంపేట మండలం నిర్దవెల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణ చారి అనారోగ్యంతో భాదపడుతున్న విషయం తెలుసుకున్న 1993-94 బ్యాచ్ విద్యార్థులు, మిత్రులు సోమవారం సత్యనారాయణను కలిసి రూ.40/వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మిత్రుడు త్వరగా కోలుకోవాలని అన్నారు. మిత్రుడిని పరామర్శించి,ఆర్థిక సహాయం చేసిన వారిలో శ్రీరాములు, వెంకటేష్, రాజశేఖర్, సత్యం, దస్తగిరి, రహీమ్, వేణు, ఆనంద్ కుమార్ తదితరులు ఉన్నారు.

## జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చేవెళ్ల యువనేత డాక్టర్ వైభవ్ రెడ్డి



**విశ్వంభర, చేవెళ్ల :** రంగారెడ్డి జిల్లా అభివృద్ధి సమన్వయ , పర్యవేక్షణ కమిటీ మెంబర్ శ్రీరామ్ నగర్ మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి నీ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు చేవెళ్ల బిజెపి యువ నాయకుడు డాక్టర్ మాల్గారి వైభవ్ రెడ్డి. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, ఈ సందర్భంగా వైభవ్ రెడ్డి మాట్లాడుతూ మంచికి మారుపేరు ప్రభాకర్ రెడ్డి అని ఆయన అన్నారు. ఇలాంటి పుట్టినరోజులు ఇంకెన్నో చేసుకోవాలని తెలిపారు. బిజెపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**విశ్వంభర, వరంగల్ :** పర్వతగిరి మండల పరిధిలోని కల్లేడ గ్రామంలో జ్యోతి గ్రామీఖ్య ఐకేపీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించ మద్దతు ధరను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి మండల ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సెన్సర్లపై అవగాహన ఏర్పరచుకోవాలి

### గీతం ఆతిథ్య ఉపన్యాసంలో స్పష్టీకరించిన డాక్టర్ ఏజీ కృష్ణకాంత్



**విశ్వంభర, సంగారెడ్డి:** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో సెన్సర్లు పోషించే కీలక పాత్రపై విద్యార్థులు అవగాహన ఏర్పరచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఏఎంఎస్ సెమీకండక్టర్స్-లో అనలాగ్ మిక్స్-డ్-సిగ్నల్ పరిశోధన-అభివృద్ధి డైరెక్టర్ డాక్టర్ ఏ.జీ.కృష్ణకాంత్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'ఇంటిగ్రేటెడ్ సీఎంవోస్, సెన్సార్ ఇంటర్-ఫేస్ సర్క్యూట్లు' అనే అంశంపై సోమవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఖచ్చితమైన సెన్సార్ ఇంటర్-ఫేస్-ల కోసం డిజైన్ ట్రేడ్-ఆఫ్లు, సమర్థవంతమైన సెన్సార్ సర్క్యూట్-లను రూపొందించడానికి లోతైన పరిశోధనలు అవసరమని డాక్టర్ కృష్ణకాంత్ చెప్పారు. పారిశ్రామిక విప్లవం 4.0లో సెన్సార్లు కీలక భూమిక పోషిస్తున్నాయని, కృత్రిమ మేథ, మెషిన్ లెర్నింగ్ రంగం ఈ సెన్సార్ల ద్వారా రూపొందించిన డేటాపై ప్రాథమికంగా ఆధారపడుతుందని ఆయన నొక్కి చెప్పారు. అనలాగ్ సిగ్నల్స్ ద్వారా ఎదురయ్యే సవాళ్లను పరిష్కరిస్తూ, ఈ సిగ్నల్-లను, వాటి సమగ్రతను కాపాడుకోవడానికి వెంటనే డిజిటల్ ఫార్మాట్-లలోకి మార్చడం అత్యావశ్యకమని కృష్ణకాంత్ స్పష్టీకరించారు. ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ ఏదీ సంపూర్ణంగా ఉండదని, వాటి వైవిధ్యాలపై లోతైన అవగాహన కల్పించారు. వివిధ నెట్- వర్క్ ప్రక్రియలలో సర్క్యూట్ పటిష్టతను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈఈసీఈ అధ్యాపకుడు డాక్టర్ ఎం. ప్రశాంతరెడ్డి సమన్వయం చేశారు.

# రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

### - మాజీ మంత్రి సబితా ఇంద్ర రెడ్డి



**విశ్వంభర, కడ్తాల్:** జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మండలంలో పేద ప్రజలకు ఆపదవస్తే ఆదుకోవడానికి కర్తాల్ మాజీ జడ్పిటిసి దశరథ్ నాయక్ తన కుమారుడి పేరిట నెలకొల్పిన రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ నాలుగవ వార్షికోత్సవం సందర్భంగా ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం మండలంలోని మృతుల కుటుంబాలకు ట్రస్టు ద్వారా సబితా ఇంద్రారెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుండి ఇప్పటివరకు అనేక కార్యక్రమాలు చేపట్టిన మా ట్రస్టు సేవలను ఇకపై తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలను దత్తత తీసుకొని వాళ్ల చదువు చదివించే బాధ్యతను తీసుకుంటుందని అన్నారు. అలాగే తల్లిదండ్రులు లేని ఆడపిల్లల పెళ్లి చేసే బాధ్యతను ట్రస్టు తీసుకుంటున్నాను అన్నారు. దానికి తోడు ఆడపిల్ల వివాహానికి తులం బంగారం పెట్టే బాధ్యతను ట్రస్టు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోలి శ్రీనివాస్ రెడ్డి ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్, శ్రీమతి రజనీ సాయి చంద్ రాష్ట్ర గిడ్డంగుల మాజీ చైర్మన్, ఉప్పల్ వెంకటేష్ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి తలకొండపల్లి, ఎద్మ సత్యం కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్, శ్రీమతి విజితా రెడ్డి మాజీ జెడ్పిటిసి వెల్దండ, అనురాధ పత్య నాయక్ మాజీ జెడ్పిటిసి ఆమనగల్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

# అనుమతులు లేని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

### సిపిఎం ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు



**విశ్వంభర, సంగారెడ్డి :** పటాన్ చెరు మండలంలోని ఇంద్రేశం గ్రామపంచాయతీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని మండల అభివృద్ధి అధికారులను సిపిఎం పార్టీ పటాన్ చేరు ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. నేడు సిపిఎం పార్టీ పటాన్ చేరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఇంద్రేశం గ్రామపంచాయతీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కి మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇంద్రేశం గ్రామంలోని ఆర్.కే నగర్ -1 అర్ కే నగర్ -2, పిఎన్ఆర్ టౌన్షిప్, సాయి కాలనీలలో గ్రౌండ్ మరియు రెండవ అంతస్తులకు పర్మిషన్ తీసుకొని, ఐదు అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. హెచ్ఎండిఏ గ్రామపంచాయతీ పర్మిషన్లను పొందకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలను ఏ విధంగా నిర్మిస్తారని ప్రశ్నించడం జరిగింది. 30 నుంచి 40 బహులాంతస్తుల నిర్మాణాలు అక్రమంగా జరుగుతున్న ఎలాంటి పర్మిషన్లు లేకున్నా ఎందుకు చర్యలు చేపట్టడం లేదని సిపిఎం పార్టీ పటాన్ చేరు ఏరియా కార్యదర్శి నాగేశ్వరావు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాములు, కుమార్ పాల్గొన్నారు

# కలెక్టర్ తీరును నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలతో జర్నలిస్టుల నిరసన



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ గా విధులలో చేరిన నాటి నుండి అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయమని ఎప్పుడు అడిగిన ఇంకో 15 రోజులలో పరిశీలిస్తా,చూస్తా, చేస్తా అని తెలుపుతున్న జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. వివరాల్లోకి వెళ్తే మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వివిధ మీడియా సంస్థలలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ప్రభుత్వ గుర్తింపు కార్డు గా ప్రభుత్వం అందించే అక్రిడేషన్ కార్డు కోసం ప్రభుత్వం 2022 - 24 సంవత్సర కాలానికి నోటిఫికేషన్ జారీ చేసింది.కానీ అందుకు భిన్నంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు 239 జీవో ప్రకారం ప్రతి మూడు నెలలకు ఒకసారి లేదా అత్యవసరమైన సమావేశం కూడా నిర్వహించ వచ్చనని జీవోలు ఉంటుంది. కానీ జీవో ని అమలు చేయకుండా కేవలం రెండున్నర సంవత్సరాల కాలవ్యవధిలో రెండు మీటింగ్ లు నిర్వహించి అసలు మీడియాకు సంబంధం లేని వ్యక్తులకు అక్రిడేషన్ కార్డులు కేటాయించడంతో కొంతమంది జర్నలిస్టులు గత కలెక్టర్ కు ఫిర్యాదు చేసినారు. కానీ సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి తన ఆమ్యామ్యాలతో అనర్హులకు కేటాయించిన విషయం బయట పడుతుందని మీటింగ్ నిర్వహించకుండా దాటవేత ధోరణితో కొంతకాలం కాలం వెళ్ళదీయగా గతంలోనే సమాచార పౌర సంబంధాల కమిషనర్ కార్యాలయంలో కొంతమంది జర్నలిస్టులు ఫిర్యాదు చేయగా అతనిపై విచారణ చేసి కొంతమేర అవకతవకలు జరిగాయని అన్నారు. వెంటనే అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయమని తెలిపినప్పటికీ, అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో విసుగు చెందిన జర్నలిస్టులు మహబూబాబాద్ జిల్లా సమీకృత కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్ ఎదురుగా,నల్ల బ్యాడ్జీ లు ధరించి,ఫ్లకర్డతో శాంతియుతంగా నిరసన తెలిపారు.

## ఆర్థిక సర్వే నిర్వహణపై శిక్షణ కార్యక్రమం



**విశ్వంభర, భూపాలపల్లి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక సర్వే ప్రక్రియ ఈ నెల 6వ తేదీ నుండి ప్రారంభం అవుతుందని ఎన్యుమరేటర్లు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా గణన చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ముఖ్య ప్రణాళిక అధికారి (సిపిఓ) బాబూరావు తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహణకు నియమించిన భూపాలపల్లి, కాటారం డివిజన్ల ఎన్యూమరేటర్లుకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, సిపిఓ సర్వే పై పవర్ పాయింట్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 6వ తేదీ జిల్లాలో సర్వే ప్రారంభం అవుతుందని తెలిపారు. సర్వే విధులు కేటాయించిన ఎన్యుమరేటర్లు ఎలాంటి పొరపాటుకు తావు లేకుండా పకడ్బందీగా సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. సర్వే నిర్వహణలో ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి కుటుంబం యొక్క సమగ్ర సమాచారం సేకరణ చేయాలని పేర్కొన్నారు. సర్వేలో 10 మంది ఎన్యూమరేటర్లకు పర్యవేక్షణకు ఒక సూపర్ వైజర్ ను నియమించడం జరిగిందని అన్నారు. సర్వే నిర్వహణలో మండల నోడల్ అధికారి, కోర్ టీము, జిల్లా నోడల్ అధికారిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం ఏసీపీ కృష్ణయ్య



**విశ్వంభర, ఎల్బీనగర్ :** సైబర్ నేరాల పై అప్రమత్తత అవసరం అని ఎల్బీనగర్ ఎసిపి కృష్ణయ్య అన్నారు. సోమవారం సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోస్ట్ ఆఫీస్ చౌరస్తా లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి కృష్ణయ్య మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి అని అన్నారు. మొబైల్ ఫోన్ కు వచ్చే లింకులను ఓపెన్ చేయడం వల్ల సైబర్ నేరగాళ్లు బారిన పడే అవకాశం ఉంది అన్నారు. బ్యాంక్ కు సంబంధించిన పిన్, ఇతర వివరాలు ఎవరితో షేర్ చేసుకోవద్దు అని అన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ కు కు దూరంగా ఉండాలి అని అన్నారు. గంజాయి, డ్రగ్స్ సేవిస్తూ పోలీసులకు పట్టుబడితే జీవితాంతం ఇబ్బందులు తప్పవు అని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహన పత్రాలు తమతో ఉండేలా చూసుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ సైదీ రెడ్డి, ఎస్ ఐ లక్ష్మణ్ , సిబ్బంది, ఏ ఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నగేష్ కుమార్తె నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవ వేడుకల్లో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్ యాదవ్, శశి యాదవ్ తదితరులు పాల్గొన్నారు. (విశ్వంభర, ఎల్బీనగర్)

## తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక




**విశ్వంభర, బషీర్‌బాగ్ :** కొండా లక్ష్మణ్ బాపూజీ మార్గదర్శకత్వంలో త్యాగాల తెలంగాణ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఏర్పడిందని నూతన అధ్యక్షులు వల్లకాటి రాజ్ కుమార్ తెలిపారు. పద్మశాలీల, చేనేత, మరమగ్గాల సంరక్షణకు తమ సంఘం పోరాడుతుందని ప్రకటించారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన నూతన కమిటీని ప్రకటించారు. సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా బూర మల్లేశం, వేముల బాలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా మచ్చ సుధాకర్, వేముల వెంకన్న సలహాదారులుగా గోశిక యాదగిరి, గుంటి నగేష్, ప్రధాన కార్యదర్శులుగా అప్పం శ్రీనివాస్, పున్న సత్యనారాయణ, కోశాధికారిగా బింగి నవీన్ కుమార్, మహిళా చైర్మన్ కొండ పద్మ, యువజన విభాగం చైర్మన్ గంధ మల్ల రాజులతో కూడిన రాష్ట్ర కమిటీని ప్రకటించారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పద్మశాలీల ప్రాథమిక అవసరాలను గుర్తించి పరిష్కరిస్తామన్నారు రాష్ట్ర జనాభాలో తాము ఆరు శాతం ఉన్న అవకాశాలలో వెనకబడే ఉన్నామన్నారు చేనేత వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కమిటీని రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. రాష్ట్ర కమిటీ లో మొత్తం 75 మంది సభ్యులు ఉన్నట్లుగా తెలిపారు. వీరంతా ప్రత్యక్ష ఓటింగ్ పద్ధతిలో ఎన్నిక అయ్యారని ఆయన స్పష్టం చేశారు.

## ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బిజెపి సభ్యత్వ నమోదు




**విశ్వంభర, పరిగి :** పట్టణంలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెన్న ఈశ్వరప్ప, జిల్లా ఓబిసి ఇన్చార్జ్ భాను ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి బిజెపి సభ్యత్వాన్ని పొందుతున్నారని అన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం పొందిన పార్టీ బిజెపి పార్టీ అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి నాయకులు ఐకమత్యంగా బిజెపి అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రాము యాదవ్ ,ఓబిసి మోర్చ ప్రధాన కార్యదర్శి శ్రీశైలం,జిల్లా కార్యదర్శి పెంటయ్యగుప్తా, పరిగి టౌన్ ప్రెసిడెంట్ బాలకృష్ణారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ విజయ్ కుమార్, ఓబీసీ మోర్చా టౌన్ అధ్యక్షులు టీవి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు

## వీరాంజనేయ స్వామి దేవస్థానానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి విరాళం



**విశ్వంభర, షాద్ నగర్ :** మున్సిపాలిటీ పరిధిలోని జానంపేటలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానానికి ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి లక్ష రూపాయల విరాళం తో పాటు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమ మహోత్సవంలో జరుగు పూజాదికాల ఖర్చులు కూడా భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డ్ పిల్లి శేఖర్, గంధం ఆనంద్,బిక్ష పతి, చెరుకు శివ, లక్ష్మి నరసింహ, మెడిగ వీరేష్, కుడుముల శివ, ఎన్. మహేష్, సుశాంత్, శివరాజ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ పర్యటనను విజయవంతం చేద్దాం: కే ఎల్ ఆర్



**విశ్వంభర, మహేశ్వరం :** రాహుల్ గాంధీ గా పర్యటనను విజయవంతం చేద్దాం తెలంగాణలో జరగనున్న కులగణన సర్వేకు దిశానిర్దేశం చేసేందుకు కాంగ్రెస్ అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీ 5న రానున్నారు కావున రాహుల్ గాంధీ కి ఘన స్వాగతం పలికేందుకు బేగంపేట విమానాశ్రయానికి తరలివెళ్దాం అని పిలుపునిచ్చారు. మంగళవారం మధ్యాహ్నం 1గంటలకు పార్టీ శ్రేణులు తుక్కుగూడ కే ఎల్ ఆర్ కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకోవాలని , ఇక్కడ నుంచి బేగంపేట ఎయిర్ పోర్ట్ కు భారీ కాన్వాయ్ గా తరలి వెళ్లి మన ప్రియతమ నేతకు స్వాగతం పలుకుదాం అంటూ కార్యకర్తలకు తెలియజేసారు. బోయిన్ పల్లిలోని ఇందిరాగాంధీ ఆడిటోరియంలో సాయంత్రం 4 గంటలకు కులగణన సదస్సు జరగనుంది. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల అధిక సంఖ్యలో పాల్గొనాలని కే ఎల్ ఆర్ కోరారు.

## సర్పంచుల ముందస్తు అరెస్ట్



**విశ్వంభర, నాగారం :** హైదరాబాదులో సర్పంచుల రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగే ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ కొరకై ముందస్తు అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచులు యారాల నరసింహారెడ్డి, కుంటపల్లి సుధాకర్, వేల్పుల సాలయ్య, నాగుల్ మీరా తదితరులు ఉన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**విశ్వంభర, షాద్ నగర్ :** షాద్ నగర్ మున్సిపాలిటీ 9వ వార్డులో మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి 10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందుటి నరేందర్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్ ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణ పార్టీ అధ్యక్షులు కొంకళ్ళ చెన్నయ్య, మహమ్మద్ అలీ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలరాజు గౌడ్, చెంది తిరుపతి రెడ్డి, బస్వం అప్ప , ముబారల్ అలీ ఖాన్ , కొప్పునూరి ప్రవీణ్ , బచ్చలి నరేష్, చెన్నప్ప, సందీప్ , రాము , వార్డు ఇంఛార్జి మాదవులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సదర్ సమ్మేళనానికి విష్ణువర్ధన్ రెడ్డికి ఆహ్వానం



**విశ్వంభర, షాద్‌నగర్ :** ఈ నెల 10 వ తేదీన షాద్ నగర్ పట్టణంలో జరిగే యాదవ సదర్ సమ్మేళనానికి రావాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి కి ఆహ్వానం అందించారు. ఈ కార్యక్రమం లో యాదవ సోదరులు దంగు శ్రీనివాస్ యాదవ్, నడికుడ రగునాథ్ యాదవ్, శాబాద్ మల్లేష్, పసుల నర్సిములు యాదవ్, నక్క బాల్ రాజ్ యాదవ్, సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, లింగం యాదవ్, కేశమోని శ్రీనివాస్ యాదవ్, అనేమోని కృష్ణ యాదవ్, రామకృష్ణ యాదవ్ కేశమోని అంజయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచుల అరెస్టుపై ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ధ్వజం



**విశ్వంభర, షాద్ నగర్ :** దేవుళ్లపై ప్రమాణాలు చేసి గతి తప్పిన విధానాలతో, ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, వాటి నుండి తప్పించుకోవడానికి తమ బిల్లుల కోసం పోరాడుతున్న మాజీ సర్పంచుల అరెస్టును ఖండిస్తున్నానని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ధ్వజమెత్తారు. ఏడాదిగా పెండింగ్ బిల్లులు ఇవ్వకపోవడం సిగ్గుచేటు రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తూ అరెస్టుల పర్వమే కొనసాగుతోంది. పోలీసులతో సమస్యను అణగదొక్కాలని చూస్తున్నారు. సమస్యలు గాలికి వదిలి సీఎం, మంత్రులు ఊరేగుతున్నారు. సర్పంచుల కుటుంబాలు రోడ్డునపడే పరిస్థితి వచ్చింది. శాంతియుత నిరసనలకు పిలుపునిస్తే అరెస్టులు ఎందుకు చేస్తున్నారని మండి పడ్డారు. అరెస్ట్ చేసినవారిని వెంటనే విడుదల చేయాలని కోరారు.

## నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందించడమే మన కర్తవ్యం

- ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్



**విశ్వంభర, మహబూబాబాద్ :** 2009 పోలీస్ కానిస్టేబుల్స్ గా భర్తీ అయ్యి చిత్తశుద్ధి తో ప్రజలకు పోలీస్ సేవలు అందిస్తూ 15 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 15 సంవత్సరాలు ఎలాంటి మచ్చ లేకుండా నిజాయితీగా నిస్వార్ధంగా ప్రజలకు పోలీస్ సేవలు అందించారు. ఇలానే సేవలు అందిస్తూ పదోన్నతులు పొంది ఇంకా పై స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. 15 వసంతాలు పూర్తి చేసుకున్నందుకు శుభాకాంక్షలు తెలియజేసారు.

## అయ్యప్ప స్వాముల మాల ధారణ



**విశ్వంభర, షాద్ నగర్ :** పట్టణంలోని శ్రీ శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో మాల ధారణ కార్యక్రమాన్ని ఈనెల 06-11-24 రోజున ఉదయం 7గంటలకు స్వర్గీయ శ్రీ శ్రీ శ్రీ సతీష్ నాయర్ గురుస్వామి వారి తనయులైన శ్రీ గిరీషన్ నాయర్ గురుస్వామి చేతుల మీదుగా నిర్వహించడం జరుగుతుందని శివ మారుతి గీతా అయ్యప్ప మందిరం షాద్ నగర్ వారు తెలిపారు. కావున అయ్యప్పమాలను ధరించే భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

## ప్రభుత్వమే సదర్ ఉత్సవాలను నిర్వహించాలి

### -మాజీ ఎంఎల్ఎ జైపాల్ యాదవ్



**విశ్వంభర, మాడుగుల :** సదర్ పండుగ సంబురాలను 80 సంవత్సరాల క్రితమే ప్రారంభించారని, మన రాష్ట్ర రాజధాని హైదరాబాదులో ప్రతి సంవత్సరం సదర్ సంబరాలను నిర్వహిస్తున్నారని, రాష్ట్రంలో యాదవ సోదరుల కోసం సదర్ వేడుకలను అధికారికంగా నిర్వ హించడానికి ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని మాడుగుల మండలం కలకొండ గ్రామంలో యాదవ సోదరులు ఆదివారం రాత్రి సదర్ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, ఆమనగల్లు మాజీ జెడ్పిటిసి పత్య నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలను గ్రామ యాదవ సంఘం యాదవ్ ఆధ్వర్యంలో సాదరంగా ఆహ్వానించి యాదవ సంఘం పండుగను ప్రతిబింబించేలా స్వాగతం పలికి దున్నలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ పవన్ కుమార్, పోలెపల్లి మాజీ ఎంపిటిసి కుమార్, నాయకులు గుత్తి బాలస్వామి, రమేష్, సంఘం నాయకులు యాదగిరి, కొండల్, సభ్యులు, గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డున పడే దాకా ప్రభుత్వం స్పందించదా..?



**విశ్వంభర, షాద్ నగర్ :** పెండింగ్ బిల్లులు ఇవ్వాలని ఏడాది కాలంగా అడిగినా ఇవ్వకపోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచులు ఆందోళన వ్యక్తం చేసారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ప్రభుత్వ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని నేడు సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో షాద్ నగర్ పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సంధర్భంగా మాజీ సర్పంచులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శాంతియుత నిరసనకు పిలుపునిచ్చిన సర్పంచులను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారని వారు నిలదీశారు. సర్పంచుల కుటుంబాలు రోడ్డున పడే దాకా ప్రభుత్వం స్పందించదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిత్యం అరెస్టుల పర్వమే కొనసాగుతున్నదని, పోలీసులతో సమస్యలను అణగదొక్కాలని ప్రభుత్వం చూస్తున్నదని మండిపడ్డారు. పల్లె ప్రగతి పేరుతో తాము చేపట్టిన కార్యక్రమాననికి తూట్లు పొడిచి నిధులు విడుదల చేయకుండా ఆపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం యాదవ్, పల్లె శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, నర్సింలు, లక్ష్మణ్ నాయక్, రాములు నాయక్, శివజ్యోతి, మాధవి రంగయ్యలు విమర్శించారు.

## విద్యార్థుల పట్ల వైద్య కళాశాల యాజమాన్యం మొండి వైఖరిని విడనాడాలి



**విశ్వంభర, సంగారెడ్డి :** పటాన్ చేరు నియోజకవర్గం ఐనోల్ గ్రామ పరిధిలో గల టిఆర్ఆర్ మెడికల్ వైద్య కళాశాల 2020 సంవత్సరం లో చేరిన విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన చేపట్టారు. తమ పిల్లలను టి ఆర్ ఆర్ వైద్య కళాశాలలో చేర్పించిన సమయంలో చెల్లించిన డబ్బులను వెనక్కి ఇస్తామని చెప్పి కొన్ని సంవత్సరాలు గడుస్తున్న డబ్బులను వెనక్కి ఇవ్వలేదంటూ సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఆందోళన చేపట్టారు. టిఆర్అర్ కళాశాలలో ఎంబీబీఎస్ 2020 సంవత్సరంలో ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఏబిసి విభాగాల్లో కలిపి 150 మంది విద్యార్థులు చేరారు. వారు ఫీజులు చెల్లించిన తర్వాత జాతీయ వైద్య కమిషన్ ఈ కళాశాలకు అనుమతులు రద్దు చేసింది. ఇక్కడ చేరిన విద్యార్థులను 13 ఇతర కళాశాలలో సర్దుబాటు చేశారు. అయితే ప్రవేశాల సమయంలో తీసుకున్న విద్యార్థుల ధృవ పత్రాలను చెల్లించిన డబ్బులను తిరిగి ఇవ్వాలని అధికారులు టిఆర్అర్ కళాశాల యాజమాన్యానికి స్పష్టం చేశారు. యాజమాన్యం చెక్కులు ఇచ్చిన అవి బోన్స్ కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కొన్ని రోజులుగా ఆందోళన చేస్తూనే ఉన్నారు. బీసీ విభాగాల్లో తమ పిల్లలను గతంలో ఇక్కడ చేర్పించిన వారు సోమవారం టిఆర్అర్ వైద్య కళాశాల ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. తక్షణమే స్పందించి భారీ మొత్తంలో తాము చెల్లించిన 27 కోట్ల రూపాయలను వెనక్కి ఇవ్వాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి

### కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**విశ్వంభర, మహబూబాబాద్ :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, అన్ని విభాగాల అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి సంబధిత శాఖల అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తులను సంబంధిత విభాగాలకు, శాఖలకు పంపడం జరిగిందని వాటి పరిష్కారం దిశగా వారికి తగు ఆదేశాలు జారీ చేశామని అన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్డిఓ ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన్ రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, ఏడి ల్యాండ్ సర్వే నరసింహమూర్తి, డిఏఓ విజయనిర్మల, డిపిఓ హరిప్రసాద్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, డిడి గ్రౌండ్ వాటర్ వి.సురేష్, డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, డిహెచ్ఓ జి. మరియన్న, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లా నాయక్, జిల్లా మైనింగ్ అధికారి ఏ. వేంకటరమణ, మెప్మా పిడి విజయ, ఎంప్లాయ్మెంట్ అధికారిని రజిత, మైనారిటీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, అన్ని బాగాల అధికారులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు అడిగితే.. అరెస్టులా ?

### - రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి




**విశ్వంభర,హైదరాబాద్:** తెలంగాణ వ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి అప్పుల పాలైన మాజీ సర్పంచుల బాధలు వర్ణనాతీతమని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. గ్రామాలలో అనేక అభివృద్ధి పనులు చేసి దేశంలోనే ఆదర్శవంతమైన గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే,రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచుల అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం హేయమైన చర్య అని అన్నారు.పెండింగ్ బిల్లులు ఇవ్వాలని ఏడాది కాలంగా అడిగినా ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని రాష్ట్రవ్యాప్తంగా ఆయాగ్రామలలో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన 1500 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్పంచుల కుంటుంబాలు రోడ్డున పడే దాకా ప్రభుత్వం స్పందించదా అని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకు సర్పంచుల పెండింగ్ బిల్లుల సాధనకై చలో హైదరాబాద్ ప్రత్యేక సమావేశానికి పిలుపునిచ్చిన రాష్ట్ర సర్పంచుల సంఘం నేతలను, ఆయా సర్పంచులను ఎక్కడికక్కడ అరెస్టు చేసి నిర్బంధించినట్లు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి తెలిపారు. అరెస్టు చేసిన సర్పంచులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి ఆ తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు విడుదల చేసేంతవరకు సర్పంచుల పోరాటం ఆగదని ఆయన తెలిపారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన నిరుపేద విద్యార్థి

### సన్మానించిన ఆమనగల్లు ఎస్సై వెంకటేష్




**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు మండలంలోని మేడిగడ్డ తండా కు చెందిన వద్యావత్ బిచ్య కుమారుడైన వత్యావత్ నిఖిల్ టిటి డబ్ల్యు పివిటిజి బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి, హయత్ నగర్ లో గవర్నమెంట్ కాలేజీలో ఇంటర్ చదివి ఎంబీబీఎస్ సీటు సాధించాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఆమనగల్లు ఎస్సై బి. వెంకటేష్ నిరుపేద విద్యార్థి అయిన నిఖిల్ ను పోలీస్ స్టేషన్ కు పిలిపించి శాలువ తో సన్మానించి అభినందించారు. నిఖిల్ ను మోడల్ గా తీసుకుని మండలంలోని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్సై వెంకటేష్ సూచించారు

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్యాక్స్ చైర్మన్ , వైస్ చైర్మన్



**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల :** తంగళ్ళపల్లి మండల కేంద్రంలో సిరిసిల్ల ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహించే వరి ధాన్య కొనుగోలు కేంద్రమును ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణా రెడ్డి, వైస్ చేర్మెన్ నేరెల్ల నర్సింగం గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారుల బారిన పడకుండా కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, ఏ ఎం సి వైస్ చేర్మెన్ నేరెల్ల నర్సింగం గౌడ్, ఏ ఎం సి డైరెక్టర్స్ పొన్నలా పర్శరాములు, అరేపెల్లి బాలు, గుగ్గిళ్ల రాములు, మాజీ సర్పంచ్ అసాని సత్యనారాయణ రెడ్డి, రెడ్డి సంఘము అధ్యక్షులు ఏడుమల బాలరెడ్డి, పద్మశాలి సంఘము అధ్యక్షులు రాపెల్లి ఆనందం, మాజీ ఉప సర్పంచ్ పెద్దూరి తిరుపతి, మాజీ వార్డ్ సభ్యులు రెడ్డి పర్శరాములు, దోర్నాల మల్లరెడ్డి, బెంద్రం నారాయణ రెడ్డి, గుగ్గిళ శ్రీకాంత్, చిన్నవేణి ప్రశాంత్, చెందు, పోచంపెల్లి రమేష్, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల అందజేత



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ, చిట్యాల మండలాల్లో సోమవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు విస్తృతంగా పర్యటించారు. రేగొండ, చిట్యాల మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన మొత్తం 92 మంది కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్దిదారులకు రూ.92,10,116/- విలువైన చెక్కులను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. రెండు చోట్ల చెక్కుల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఎంతో అండగా కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ నిలుస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పథకం ప్రజాప్రభుత్వంలో నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందుతున్నట్లుతెలిపారు. కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకంతో రాష్ట్రంలోని ఎంతో మంది పేద, నిరుపేద కుటుంబాలకు ఆడపిల్లల పెళ్లిళ్లకు భారం తగ్గిందని గుర్తుచేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సులల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించినట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరికలు



**విశ్వంభర, నాగారం:** కాంగ్రెస్ ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులకు ఆకర్షితలై బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు. సోమవారం తిరుమలగిరి మండల కేంద్రంలోనీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో నాగారం మండల పరిధిలోని డి- కొత్తపల్లి గ్రామనికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో దాదాపు 35 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు దందోల్ మహేష్, నరహరి, రమేష్, లలిత, రేకేష్, నరేష్, రాజీవ్, పడిశాల బుచ్చి రాములు, చంద్రమౌళి, వెంకన్న, శేఖర్, రవి, అనంతొజు రవి, పెరమండ్ల చంద్రయ్య, పురుషోత్తం, గుండ్ల రత్న, జాటోతు కవిత, పడిశాల వెంకన్న, మొదల మహేష్, మాలోతు మంగయ్య, హరి, కొండ శ్రీరాములు, కాత వీరయ్య, రాజేష్, బలికి కిష్టయ్య, మల్లయ్య, దేవరకొండ కిరణ్, పడిశాల రఘు, అనంతోజు పోతులూరు, మాలోత్ దసురు, ఉన్నారు.


## డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

### జోనల్ కమిషనర్ కు కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి వినతి



**విశ్వంభర, హైద్రాబాద్:** గడ్డిఅన్నారం డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్ కు కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ని జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయంలో గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో సీసీ రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో వీధి దీపాలు, రోడ్లు అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేయాలని అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ సమస్యల పరిష్కారానికి జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

## దేవులపల్లి రమేశ్ కు జాతీయ సాహిత్య పురస్కారం



**విశ్వంభర, సిద్దిపేట, హైదరాబాద్ :** సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అరిగపూడి పూర్ణ చంద్రరావు ఫౌండేషన్, ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందించిన వారికి లయన్ ఏ కృష్ణ కుమారి, స్మారక జాతీయ పురస్కారాలు అందజేశారు. సాహిత్య సేవలు అందించినందుకు గాను నంగునూర్ కు చెందిన దేవులపల్లి రమేశ్, ఎంజేపీ గురుకుల పాఠశాల, తెలుగు అతిధి ఉపాధ్యాయుడికి సాహిత్య సేవ పురస్కారం వరించింది. ఈ మేరకు ముఖ్య అతిధులు,హై కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రజిని, జస్టిస్ చంద్రకుమార్, నిర్మాత కంఠంనేని రవి శంకర్, డా. బిక్కి కృష్ణ, డా విజయ్ కుమార్, చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. అనంతరం రమేశ్, మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో సాహిత్య పురస్కారం రావడం సంతోషంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రచయిత్రి డా.రాధ కుసుమ,డా. జెల్ది విద్యాధర్, నాళేశ్వరం శంకరం, రామ కోటేశ్వరరావు, రవీంద్ర బాబు, ప్రముఖ టీవి యాంకర్ లు, పత్రిక ఎడిటర్ లు, జర్నలిస్ట్ లు, కవులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



"విడుదల 2" చిత్రాన్ని ఫాన్సీ రేటుకు దక్కించుకున్న

# శ్రీ వేదాక్షర మూవీస్

తమిళంలో లాస్ట్ ఇయర్ సంచలన విజయం సాధించి తెలుగు ప్రేక్షకులను సైతం విపరీతంగా ఆకట్టుకున్న చిత్రం విడుదల. విజయ్ సేతుపతి పెర్ఫార్మన్స్ హైలెట్ గా రూపొందిన ఈ చిత్రానికి తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అతి త్వరలో "విడుదల2" చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించేందుకు ఎంతోమంది నిర్మాతలు పోటీ పడగా, ఫాన్సీ రేట్ తో ఈ చిత్రాన్ని దక్కించుకున్నారు ప్రముఖ నిర్మాత చింతపల్లి రామారావు. ఈ సందర్భంగా మాట్లాడుతూ"విడుదల 2 చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించబోతున్నందుకు సంతోషంగా ఉంది. విజయ్ సేతుపతి, సూరి నటన హైలైట్ గా ప్రేక్షకులను కనువిందు చేయబోతోంది. ఏడు సార్లు నేషనల్ అవార్డు పొందిన ఏకైక దర్శకుడు వెట్రీ మారన్, ఎన్నో సూపర్ హిట్ చిత్రాలను తెరకెక్కించిన ఆర్ ఎస్ ఇన్ఫో టైన్మెంట్ అధినేత ఎల్రెడ్ కుమార్ తో కలిసి ఈ చిత్రాన్ని అత్య ద్భుతంగా తెరకెక్కించారు. మంచి కమర్షియల్ వాల్యూస్ ఉన్న ఈ చిత్రాన్ని మేము దక్కించుకున్నందుకు సంతోషపడుతూ, ఈ చిత్రం డెఫినెట్ గా ఒక బ్లాక్ బస్టర్ హిట్ అవుతుందని ఆశిస్తున్నాను .ఈ చిత్రాన్ని డిసెంబర్ 20 న ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నాం అన్నారు. విజయ సేతుపతి, సూరి, మంజుల వారియర్, గౌతమ్ వాసుదేవ్ మీనన్, భవాని శ్రీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా, దర్శకత్వం: వెట్రీ మారన్.

# మహా శివరాత్రికి వస్తున్న నితిన్ 'తమ్ముడు'




హిట్టు, ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉన్నాడు టాలీవుడ్ హీరో నితిన్. ఇప్పటికే భీష్మ లాంటి హిట్టు అందించిన దర్శకుడు వెంకీ కుడుములతో రాబిన్ హూడ్ సినిమా చేస్తున్న నితిన్ వకీల్ సాబ్ దర్శకుడు వేణు శ్రీరామ్‌తో కలిసి 'తమ్ముడు' సినిమా చేస్తున్నాడు. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు-శిరీష్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ సగానికి పైగా కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం తాజాగా విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమాను మహా శివరాత్రి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో ఊరి ప్రజలంతా తరుముతూ ఉంటే నితిన్ ఒక పాపని భుజాన ఎత్తుకుని పరిగెత్తడం చూడవచ్చు.

సతీష్ బాబు రాటకొండ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించిన సినిమా 'జాతర'. దీయా రాజ్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని గల్లా మంజునాథ్ సమర్పణలో మూవీటెక్ ఎల్ఎల్‌సితో కలిసి రాధాకృష్ణ ప్రొడక్షన్ కంపెనీ పతాకంపై రాధాకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇంత వరకు ఎవ్వరూ టచ్ చేయని పాయింట్‌తో రగడ్‌గా, ఇంటెన్స్ డ్రామాతో 'జాతర' తెరకెక్కింది. చిత్తూరు జిల్లా బ్యాక్ డ్రాప్‌లో జరిగే జాతర నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా ఈ నెల 8న థియేటర్లలోకి రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ హైలైట్స్ ను తన ఇంటర్వ్యూలో తెలిపారు హీరో, దర్శకుడు సతీష్ బాబు రాటకొండ. దేవుడు మనుషులను బొమ్మలుగా చేసి జగన్నాటకం ఆడిస్తాడని మన పురాణాల్లో చెబుతుంటారు. ఇందుకు భిన్నంగా ఒక మనిషి దేవుడిని పితలాటకం ఆడిస్తుంటాడు. ఆ పితలాటకం నుంచి అమ్మవారిని హీరో ఎలా రక్షిస్తాడు అనేది ఈ చిత్ర మూల కథాంశం. మనిషి రాక్షసుడై అమ్మవారిని చెరపడితే మరో నరుడు హరుడై ఆ రాక్షసుడిని ఎలా సంహరించాడు అనేది మా 'జాతర' చిత్రంలో చూపిస్తున్నాం. వాస్తవ ఘటనల ఆధారంగా ఫిక్షన్ యాడ్ చేసి ఈ చిత్రాన్ని రూపొందించాను. ఈ చిత్రాన్ని డాక్యుమెంటరీగా తీస్తే వివాదాలు వస్తాయి. సినిమా అయితే క్రియేటివ్ ఫ్రీడమ్ తీసుకుని ప్రేక్షకులకు నచ్చేలా సినిమాను రూపొందించవచ్చు అనిపించింది. హీరో క్యారెక్టర్ మూడు డైమెన్షన్స్ లో ఉంటుంది. అతను ఒక ఫేజ్ నుంచి మరో ఫేజ్ కు వెళ్లేందుకు ప్రేమ అనేది ఒక మీడియంలా ఉంటుంది. అలా ఈ కథలో ఓ మంచి ప్రేమ కథ కూడా ఉంటుంది. మంచి సౌండ్ డిజైనింగ్ ఈ మూవీ కోసం చేశాం. మనం జంధ్యాల గారి సినిమాల్లో విన్నట్లు విలేజ్ లో వినిపించే సహజమైన సౌండ్స్ తరహాలో 'జాతర' చిత్రంలో సౌండ్ డిజైనింగ్ చేయించాం. 2016 లో నేను 'జాతర' స్క్రిప్ట్ రెడీ చేసుకున్నాను. ప్రొడ్యూసర్ నేను అనుకోకుండా ఒక ఫంక్షన్ లో మీట్ అయ్యాం. అక్కడ మా ఐడియాస్ షేర్ చేసుకున్నాం. నేను చెప్పిన పాయింట్ ఆయనకు నచ్చి వాళ్ల ఫ్యామిలీ మెంబర్స్ తోనూ డిస్కస్ చేశారు. వాళ్లు కూడా బాగుందని అనడంతో ఈ ప్రాజెక్ట్ మొదలైంది. నన్నే డైరెక్షన్ చేయమని ప్రొడ్యూసర్ గారు సజెస్ట్ చేశారు. మా ప్రొడ్యూసర్స్ రాధాకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి సినిమా చేయడంలో ఎంతో సపోర్ట్ అందించారు. చిత్తూరు జిల్లా మదనపల్లె పరిసర గ్రామాల్లో ఈ అమ్మవారి గుడి ఉంటుంది. చుట్టుపక్కల 18 ఊళ్ల ప్రజలు ఈ గుడికి వచ్చి అమ్మవారిని కొలుస్తారు. ఏడాదిన్నర పాటు ఆ ప్రాంతంలో ప్రజలతో ఇంటరాక్ట్ అయి, రీసెర్చ్ చేసి స్క్రిప్ట్ చేసుకున్నాం. గంగమ్మతల్లిని తెలుగు ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ఆ అమ్మవారి గురించి తీసిన చిత్రమే 'జాతర'.మా 'జాతర' సినిమాకు యూఎస్, యూకేలో ఫిలింస్ కు వర్క్ చేసే మూవీ టెక్ అనే కంపెనీ ప్రొడక్షన్ లో జాయిన్ అయి ఎంతో సపోర్ట్ చేసింది. మూవీ టెక్ నుంచి అలెక్స్ గ్రాఫిక్స్ తో పాటు షూటింగ్ టైమ్ లో టెక్నికల్ గా చూసుకున్నారు. నాకు నటుడిగా, దర్శకుడిగా ఇండస్ట్రీలో కొనసాగాలని ఉంది. నాకు ఇండస్ట్రీ అంటే ప్యాషన్. అలాగే దర్శకుడిగా నాపై చాలా మంది దర్శకుల ప్రభావం ఉంది. వారి స్ఫూర్తితోనే 'జాతర' సినిమా చేశాను. సినిమా బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని నమ్ముతాను. త్వరలో మరికొన్ని ఎగ్జైటింగ్ ప్రాజెక్ట్స్ చేయాలనుకుంటున్నాను.



తెలుగు ప్రేక్షకులంతా సెలబ్రేట్ చేసుకునేలా

# జాతర

హీరో, దర్శకుడు
సతీష్ బాబు రాటకొండ

# ధూం ధాం ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్


చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "ధూం ధాం". సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు. "ధూం ధాం" సినిమాను లవ్, ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా దర్శకుడు సాయి కిషోర్ మచ్చా రూపొందిస్తున్నారు. గోపీ మోహన్ స్టోరీ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ఈ నెల 8వ తేదీన ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ నేపథ్యంలో "ధూం ధాం" సినిమా హైలైట్స్ గురించి ఇంటర్వ్యూలో తెలిపింది హీరోయిన్ హెబ్బా పటేల్. డైరెక్టర్ సాయి రాజేశ్ ఒకరోజు ఫోన్ చేసి "ధూం ధాం" ప్రాజెక్ట్ గురించి చెప్పారు. రైటర్ గోపీ మోహన్ దగ్గర కథ ఉంది. మీకు నచ్చితే చేయండి అన్నారు. నేను కథ విన్నాను. స్క్రిప్ట్ బాగా నచ్చింది. మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ మూవీ ఇది. ఈ మధ్య కాలంలో నేను అన్నీ సీరియస్ రోల్స్ చేస్తూ వస్తున్నాను. ఇలాంటి సినిమా నేను చేసి చాలా కాలమవుతోంది. నాకు రిఫ్రెషింగ్ గా ఉంటుందని అనిపించింది. అందుకే వెంటనే ఓకే చెప్పాను. "ధూం ధాం" సినిమాలో నా క్యారెక్టర్ పేరు సుహానా. తనొక బబ్లీ గర్ల్. బాగా డబ్బున్న అమ్మాయి. ఇంట్లో ఇచ్చిన ఫ్రీడమ్ వల్ల తను కోరుకున్న వెకేషన్ కు వెళ్తుంటుంది. అలా ఒక వెకేషన్ లో హీరోను కలుస్తుంది. అక్కడి నుంచి వారి స్నేహం, ప్రేమ మొదలవుతాయి. ఈ చిత్రంలో నటించడం నాకు కష్టంగా అనిపించలేదు. కేక్ వాక్ లాంటి ఫీలింగ్ కలిగింది. చేతన్ తో కలిసి నటించడం హ్యాపీగా ఉంది. తను మంచి కోస్టార్. మా ఇద్దరిలో ఎవరు జూనియర్ , ఎవరు సీనియర్ అనేది చూసుకోలేదు. కెమెరా ముందు ఎవరు ఎంత యాక్టివ్ గా, ఎనర్జిటిక్ గా పర్ ఫార్మ్ చేస్తాం అనేది ఆలోచించాం. పోలెండ్ లో లాంగ్ షెడ్యూల్ చేశాం. అక్కడ వింటర్ ఇంకా స్టార్ట్ కాకముందే వెళ్లాం. సాంగ్ షూట్స్ లో శారీస్ లో కనిపిస్తాను. చలి పెద్దగా లేకపోవడం వల్ల ఇబ్బందిగా అనిపించలేదు. డైరెక్టర్ సాయి కిషోర్ చాలా జోవియల్ గా ఉంటారు. నాకు సరదాగా మాట్లాడుతూ ఉండే వ్యక్తులంటే ఇష్టం. సాయి కిషోర్ అలాంటి పర్సన్. ఆయనతో వర్క్ చేయడం హ్యాపీగా అనిపించింది.



"మిస్టర్ ఇడియట్" లోని 'కావాలయ్యా..'

# లిరికల్ సాంగ్ రిలీజ్

మాస్ మహారాజ్ రవితేజ తమ్ముడు రఘు కొడుకు మాధవ్ హీరోగా నటిస్తోన్న సినిమా "మిస్టర్ ఇడియట్". ఈ చిత్రంలో సిమ్రాన్ శర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. జేజేఆర్ ఎంటర్ టైన్ మెంట్స్ ఎల్ఎల్ పీ పతాకంపై యలమంచి రాణి సమర్పణలో నిర్మాత జె జే ఆర్ రవిచంద్ "మిస్టర్ ఇడియట్" సినిమాను నిర్మిస్తున్నారు. పెళ్లి సందడి చిత్రంతో కమర్షియల్ హిట్ అందుకున్న దర్శకురాలు గౌరీ రోణంకి డైరెక్ట్



చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. సోమవారం బ్లాక్ బస్టర్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సోషల్ మీడియా ద్వారా "మిస్టర్ ఇడియట్" సినిమా నుంచి 'కావాలయ్యా..' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. 'కావాలయ్యా..' సాంగ్ కంపోజిషన్, పిక్చరైజేషన్ చాలా బాగుందన్న తమన్.. హీరో మాధవ్ తో పాటు ఎంటైర్ మూవీ టీమ్ కు బెస్ట్ విషెస్ అందించారు. 'కావాలయ్యా..' పాటను అనూప్ రూబెన్స్ మంచి బీట్ తో కంపోజ్ చేయగా భాస్కరభట్ల క్యాచీ లిరిక్స్ అందించారు. గాయని మంగ్లీ ఎనర్జిటిక్ గా పాడారు. 'కళ్లల్లోకి కళ్లు పెట్టి అదోలా చూశావయ్యా, మాటల్తోనే మనసుకు మందే పెట్టావయ్యా, తస్సాదియ్యా, తస్సాదియ్యా, పచ్చి పచ్చిగ చెప్పాలంటే పిచ్చిగ ఫిదా అయ్యా, పూవుల్తోటి పొట్లం గట్టి మేరె దిల్ దియా, చూస్కోవయ్యా, తీస్కోవయ్యా, కావాలయ్యా, నువ్వే కావాలయ్యా...' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

# "క" మూవీకి 4 రోజుల్లో రూ.26.52 కోట్ల గ్రాస్ కలెక్షన్స్

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం లెటెస్ట్ మూవీ "క" ఎక్కడ చూసినా హౌస్ ఫుల్స్, టికెట్స్ డిమాండ్ తో టాక్ ఆఫ్ ది టౌన్ అయ్యింది. ఈ సినిమా దీపావళి పోటీలో రిలీజై రోజు రోజుకూ కలెక్షన్స్ పెంచుకుంటూ వెళ్తోంది. "క" సినిమాకు నాలుగు రోజుల్లో 26.52 కోట్ల రూపాయల వసూళ్లు రావడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. దీవాళి విన్నర్ గా "క" సినిమా స్పష్టమైన ఆధిక్యత చూపిస్తోంది. 5వ రోజు కూడా కలెక్షన్స్ స్ట్రాంగ్ గా ఉండటం ఈ సినిమా చేయబోతున్న సెన్సేషనల్ బాక్సాఫీస్ రన్ ను ప్రెడిక్ట్ చేస్తోంది. తెలుగులో మంచి కలెక్షన్స్ దక్కించుకుంటున్న "క" సినిమా ఇదే ఘన విజయాన్ని ఆశిస్తూ వచ్చే వారం ఇతర భాషల్లో విడుదలకు సిద్ధమవుతోంది. "క" సినిమాలో తన్వీరామ్, నయన్ సారిక హీరోయిన్స్ గా నటించారు. దర్శకులు సుజీత్, సందీప్ ఈ సినిమాను రూపొందించారు.




"క" సినిమాను చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్ టైన్ మెంట్స్ తో బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మించారు. తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి రిలీజ్ చేశారు. నటీనటులు - కిరణ్ అబ్బవరం, నయన్ సారిక, తన్వీ రామ్, అచ్యుత్ కుమార్, రెడిన్ కింగ్స్ లే, బలగం జయరాం తదితరులు.

# లక్కీ భాస్కర్ నా మనసుకు దగ్గరైన చిత్రం



**కథానాయకుడు దుల్కర్ సల్మాన్**

మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ తెలుగు హీరో అయిపోయారు. 'మహానటి', 'సీతారామం' వంటి విజయవంతమైన చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన దుల్కర్, 'లక్కీ భాస్కర్'తో హ్యాట్రిక్ విజయాన్ని సాధించి, తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య 'లక్కీ భాస్కర్' చిత్రాన్ని నిర్మించారు. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మీనాక్షి చౌదరి కథానాయిక. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీత దర్శకుడు. దీపావళి కానుకగా థియేటర్లలో విడుదలైన 'లక్కీ భాస్కర్', అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తూ సంచలన వసూళ్లతో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో ముచ్చటించిన కథానాయకుడు దుల్కర్ సల్మాన్ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

**లక్కీ భాస్కర్ చేయడానికి కారణం?**

వెంకీ కథ చెబుతున్నప్పుడు, ఫస్ట్ హాఫ్ వినగానే ఈ సినిమా ఖచ్చితంగా చేయాలి అనుకున్నాను. బ్యాంకింగ్ నేపథ్యాన్ని తీసుకొని మధ్యతరగతి కుటుంబ కథ చెప్పడం కొత్తగా అనిపించింది. నేను ఎప్పటినుంచో వాస్తవానికి దగ్గరగా ఉండే ఒక మధ్యతరగతి తండ్రి పాత్ర చేయాలి అనుకుంటున్నాను. అది ఈ సినిమాతో నెరవేరింది. నా దృష్టిలో ఇది వాస్తవ కథ. బ్యాక్ గ్రౌండ్ లో హర్షద్ మెహతా లాంటివాడు భారీ స్కాం చేస్తుంటే, ఒక చిన్న బ్యాంక్ ఉద్యోగి తన పరిధిలో స్కాం చేయడం అనేది కొత్త పాయింట్. ఇది బ్యాంకింగ్ నేపథ్యమున్న సినిమా కావడంతో వెంకీ ఎంతో రీసెర్చ్ చేశాడు. బ్యాంకింగ్ సెక్టార్ కి చెందినవారు కూడా ఇందులో ఎటువంటి తప్పులు లేవని చెప్పడం విశేషం.

**లక్కీ భాస్కర్ పాత్రలో నెగటివ్ షేడ్స్ ఉన్నాయి కదా.. ఎలాంటి వర్క్ చేశారు?**

ప్రత్యేకంగా ఏమీ చేయలేదు. నటుడిగా అన్నిరకాల పాత్రలు చేయాలి. షారుఖ్ ఖాన్ లాంటివారు కూడా నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలు చేశారు. మనలోని నటుడిని బయటకు తీసుకురావాలంటే ఇలాంటి విభిన్న పాత్రలు చేయాలి. భాస్కర్ పాత్రలో ఎన్నో ఎమోషన్స్ ఉన్నాయి. నటుడిగా ఇలాంటి పాత్రలు సంతృప్తిని ఇస్తాయి.

**షూటింగ్ లో ఏమైనా ఛాలెంజ్ లు ఎదురయ్యాయా?**

ఛాలెంజింగ్ గా అనిపించలేదు. ప్రతి రోజూ, ప్రతి సన్నివేశం చేయడాన్ని ఆస్వాదించాను. ప్రతి దశలో ఎంజాయ్ చేశాను. ఈ సినిమా ఎంతో సంతృప్తిని ఇచ్చింది.

**తెలుగులో హ్యాట్రిక్ విజయాలు సాధించడం ఎలా ఉంది?**

ప్లాన్ చేస్తే విజయాలు రావు. అందరం మంచి కథలు చెప్పాలి, మంచి సినిమాలు చేయాలనే అనుకుంటాం. అలాగే ముందుకు వెళ్తున్నాను. కష్టానికి తగ్గ ఫలితం దక్కడం సంతోషంగా ఉంది.

**బ్యాంకింగ్ సబ్జెక్టు అంటే సామాన్యులకు అర్థమవుతుందా లేదా అనే సందేహం కలగలేదా?**

ఈరోజుల్లో బ్యాంక్ అకౌంట్ అనేది దాదాపు అందరికీ ఉంటుంది. పైగా ఇందులో భాస్కర్ సైడ్ బిజినెస్ లా.. చదువురాని వారికి ఫామ్స్ నింపడంలాంటివి చేస్తుంటాడు. అలాంటి సన్నివేశాలు చాలామందికి కనెక్ట్ అవుతాయి. ఈ సినిమాని అందరికీ అర్థమయ్యేలా వెంకీ చాలా బాగా తీశారు.

**లక్కీ భాస్కర్ సినిమా చూసి మీ తండ్రి మమ్ముట్టి స్పందన ఏంటి?**

నాతో ఏం చెప్పలేదు. కానీ, దర్శకుడు వెంకీతో మాట్లాడి ప్రత్యేకంగా అభినందించారు.

**తెలుగు ప్రేక్షకుల గురించి?**

తెలుగు ప్రేక్షకుల ప్రేమ చూసి మొదట నేను ఆశ్చర్యపోయాను. మహానటికి ముందు మలయాళ ప్రేక్షకులకు, కొంతవరకు తమిళ ప్రేక్షకులకు తెలుసు. మహానటి నుంచి తెలుగు ప్రేక్షకులు ఎంతో ప్రేమ చూపిస్తున్నారు. సీతారామం చేయడానికి ఎక్కువ గ్యాప్ తీసుకున్నప్పటికీ, ఆ ప్రేమ పెరిగింది తప్ప తగ్గలేదు.

**బాలకృష్ణ అన్ స్టాపబుల్ షోలో పాల్గొనడం ఎలా ఉంది?**

బాలకృష్ణ నిజంగానే అన్ స్టాపబుల్. ఆయన ఎనర్జీ మ్యాచ్ చేయడం కష్టం. బాలకృష్ణ ఆరోజు 12 గంటలకు పైగా షూటింగ్ లో పాల్గొన్నారు. అయినప్పటికీ చివరివరకు అదే ఎనర్జీతో ఉన్నారు.

**మీ డ్రీమ్ రోల్ ఏంటి?**

అలా అని ఏమీ లేదు. అన్ని రకాల పాత్రలు చేయాలని ఉంది.

**మీ రాబోయే సినిమాలు?**

తెలుగులో 'ఆకాశంలో ఒక తార' సినిమా చేస్తున్నాను. అది కూడా ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని ఇస్తుంది.

## కెప్టెన్ రోహిత్ శర్మ ఖాతాలో అవాంఛిత రికార్డు

**స్వదేశంలో అత్యధిక టెస్ట్ ఓటములు ఎదుర్కొన్న రెండవ కెప్టెన్‌గా రోహిత్**

**మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ సారథ్యంలో అత్యధిక ఓటములు ఎదుర్కొన్న భారత్**



**విశ్వంభర, క్రీడావిభాగం** : టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ చెత్త రికార్డ్ నమోదు చేశాడు. 55 ఏళ్ల తర్వాత టెస్ట్ క్రికెట్ లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక పరాజయాలు చవిచూసిన భారత కెప్టెన్‌గా నిలిచాడు. ఈ క్రమంలో భారత దిగ్గజ కెప్టెన్ మన్సూర్ అలీఖాన్ పటౌడీ పేరిట ఉన్న చెత్త రికార్డ్‌ను సమం చేశాడు. న్యూజిలాండ్‌తో ముంబై వేదికగా జరిగన మూడో టెస్ట్‌లో టీమిండియా 26 పరుగుల తేడాతో ఓటమిపాలైన విషయం తెలిసిందే. ఈ పరాజయంతో సొంతగడ్డపై టీమిండియా క్లీన్ స్వీప్ అయ్యింది. టెస్ట్ క్రికెట్ చరిత్రలో భారత జట్టుకు ఇది ఘోర పరాజయం. ఈ ఏడాది 11 మ్యాచ్‌లు ఆడిన టీమిండియాకు ఇది నాలుగో టెస్ట్ పరాజయం.

1969లో మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ సారథ్యంలోని భారత జట్టు ఒకే ఏడాది నాలుగు టెస్ట్‌ల్లో ఓటమిపాలైంది. న్యూజిలాండ్ చేతిలో ఒక మ్యాచ్ ఓడిన భారత్.. ఆస్ట్రేలియాతో మూడు టెస్ట్‌ల్లో ఓటమిపాలైంది. రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియా.. ఈ ఏడాది ఆరంభంలో ఇంగ్లండ్‌తో హైదరాబాద్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో ఓటమిపాలైంది. తాజాగా న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో క్లీన్ స్వీప్‌కు గురైంది.

బెంగళూరు టెస్ట్‌లో 8 వికెట్ల తేడాతో చిత్తయిన టీమిండియా.. పుణె టెస్ట్‌లో 113 పరుగులతో.. ముంబై టెస్ట్‌లో 26 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. కెప్టెన్‌గా రోహిత్ శర్మ సొంతగడ్డపై ఇప్పటి వరకు 5 పరాజయాలు చవిచూశాడు. సొంతగడ్డపై అత్యధిక పరాజయాలు ఎదుర్కొన్న సారథుల్లో రోహిత్ శర్మ రెండో స్థానంలో నిలిచాడు.

అగ్రస్థానంలో మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ ఉన్నాడు. ఆయన సొంతగడ్డపై మొత్తం 9 టెస్ట్ మ్యాచ్‌ల్లో ఓటమిపాలయ్యాడు. విరాట్ కోహ్లీ మాత్రం సొంతగడ్డపై మూడు టెస్ట్ పరాజయాలనే ఎదుర్కొన్నాడు. టీమిండియా తదుపరి టెస్ట్ సిరీస్ ఆస్ట్రేలియాతో ఆడనుంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024లో భాగంగా ఆసీస్ గడ్డపై ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో బరిలోకి దిగనుంది.

మరోవైపు భారత గడ్డపై టెస్ట్ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన తొలి జట్టుగా న్యూజిలాండ్ చరిత్ర సృష్టించింది. మరే జట్టు కూడా ఇప్పటి వరకు భారత గడ్డపై టీమిండియాను క్లీన్ స్వీప్ చేయలేదు.

## దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్

**విశ్వంభర, క్రీడావిభాగం** : స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో టెస్టు సిరీస్‌ను కోల్పోయింది టీమ్ఇండియా. ఇక ఇప్పుడు మరో సవాల్‌కు సిద్ధమైంది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లింది. అక్కడ ఆతిథ్య దక్షిణాఫ్రికాతో నాలుగు మ్యాచుల టీ20 సిరీస్ ఆడనుంది. నవంబర్ 8న దర్బన్ వేదికగా తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోసం సీనియర్ ఆటగాళ్లతో పాటు గంభీర్ ఈ పర్యటనకు దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తాత్కాలిక కోచ్ వీవీఎస్ లక్ష్మణ్ మార్గనిర్దేశంతో సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో కుర్రాళ్లతో కూడిన టీమ్ సోమవారం దక్షిణాఫ్రికాలో అడుగుపెట్టింది. దర్బన్‌కు చేరుకున్న భారత జట్టుకు ఫ్యాన్స్, దక్షిణాఫ్రికా క్రికెట్ అధికారులు ఘన స్వాగతం పలికారు.

### నవంబర్ 22 నుండి 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ....

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ... నవంబర్ 22 నుంచి భారత్ ఆస్ట్రేలియా జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుంది. దీంతో ఈ సిరీస్ కు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ అందుబాటులో ఉండడం లేదు. గంభీర్ స్థానంలో దక్షిణాఫ్రికా టూర్‌కు స్టాండ్ఇన్ హెడ్ కోచ్‌గా లక్ష్మణ్‌ను బీసీసీఐ నియమించింది. లక్ష్మణ్‌తో పాటు సాయిరాజ్ బహుతులే, హఅషికేష్ కనిట్కర్, శుభదీప్ ఘోష్ కోచింగ్ స్టాఫ్ గా లక్ష్మణ్ తో ఉంటారు.

### టీ20 సిరీస్ భారత జట్టు..

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), రింకూ సింగ్, తిలక్ వర్మ, జితేష్ శర్మ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రమణదీప్ సింగ్. వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, విజయ్ కుమార్ వైశాక్, అవేష్ ఖాన్, యశ్ దయాల్

### దక్షిణాఫ్రికా జట్టు ..

ఐడెన్ మార్క్‌రామ్ (కెప్టెన్), ఒట్నీల్ బార్ట్‌మన్, గెరాల్డ్ కోయెట్జీ, డోనోవన్ ఫెర్రీరా, రీజా హెండ్రిక్స్, మార్కో జాన్సెన్, హెన్రిచ్ క్లాసెన్, పాట్రిక్ క్రూగర్, కేశవ్ మహరాజ్, డేవిడ్ మిల్లర్, మిహ్లలీ మ్పోంగ్వానా, న్కాబా పీటర్, ర్యాన్ సిమిప్లాన్, ర్యాన్ సిమిప్లామ్‌టన్, ట్రిస్టన్ స్టబ్స్

### టీ20 సిరీస్ షెడ్యూల్ ఇదే..

మొదటి టీ20 - నవంబర్ 8 - దర్బన్ వేదిక
రెండో టీ20 - నవంబర్ 10 - గ్కెబెర్హా
మూడో టీ20 - నవంబర్ 13 - సెంచూరియన్
నాలుగో టీ20 - నవంబర్ 15 జొహనెస్‌బర్గ్



# టీమిండియా సీనియర్లపై బీసీసీఐ సీరియస్

**విశ్వంభర, క్రీడావిభాగం :** టీమ్ఇండియా స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ స్వదేశంలో తమ ఆఖరి టెస్టు సిరీస్ ఆడేశారా? దిగ్గజ స్పిన్ ద్వయం రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ మన పిచ్‌లపై చివరిసారిగా బౌలింగ్ చేసేశారా? ప్రస్తుతం భారత క్రికెట్ అభిమానుల్లో మెదులుతున్న ప్రశ్నలు ఇవి. స్వదేశంలో న్యూజిలాండ్‌తో ఊహించని రీతిలో పరాజయం ఎదురైన తర్వాత టీమ్ఇండియా సీనియర్ల టెస్టు భవితవ్యంపై సందిగ్ధత నెలకొంది.

తాజాగా కివీస్‌పై ఓటమి పట్ల బీసీసీఐ అసంతృప్తిగా ఉంది. గత కొంతకాలంగా టెస్టు ఫార్మాట్ ఫ్యూచర్ కోసం పలు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఇలాంటి ఫలితం రావడం వల్ల బీసీసీఐ సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో టెస్టు జట్టు లో సమూల మార్పులు చేయాలని బీసీసీఐ భావిస్తోందట. ముఖ్యంగా సీనియర్లు రోహిత్, విరాట్, జడేజా, అశ్విన్ టెస్టు భవితవ్యంపై కూడా త్వరలోనే ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.



ఇక టీమ్ఇండియాకు 2025 డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు సంక్లిష్టం అయ్యాయి. కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న బోర్డర్ గావస్కర్ టోఫ్రీని 40తో నెగ్గితేనే భారత్ మూడోసారి ఫైనల్ చేరుకుంటుంది. అయితే ఈ సిరీస్‌కు ఇప్పటికే జట్టును ప్రకటించిన నేపథ్యంలో స్క్వాడ్‌లో ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చు. ఒకవేళ ఈ సిరీస్‌లో టీమ్ఇండియా విఫలమై WTC, ఫైనల్ చేరకపోతే వచ్చే ఏడాది ఇంగ్లాండ్ పర్యటనలో జట్టులో ఈ నలుగురు సీనియర్లకు చోటు ఉండదని బోర్డు మెంబర్ ఒకరు పేర్కొన్నట్లు తెలిసింది. కాగా, బోర్డర్ గావస్కర్ ట్రో ఫీని టీమ్ఇండియా 40తో దక్కించుకుంటేనే మూడోసారి ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. అయితే అంతత ఈజీగా అయ్యే పని కాదు. బలమైన ఆస్ట్రేలియా జట్టును వాళ్ల సొంత గడ్డపై ఓడించడం మామూలు విషయం కాదు. పూర్తిగా పేస్‌కు సహకరించే పిచ్‌లపై బుల్లెట్ లాంటి బంతులు ఎదుర్కోవడం కష్టమనే చెప్పాలి.

### బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ షెడ్యూల్

తొలి టెస్టు : నవంబర్ 22 నవంబర్ 26 పెర్త్
రెండో టెస్టు : డిసెంబర్ 06 డిసెంబర్ 10 కాన్‌బెర్రా
మూడో టెస్టు : డిసెంబర్ 14 డిసెంబర్ 18 బ్రిస్బేన్
నాలుగో టెస్టు : డిసెంబర్ 26 డిసెంబర్ 30 మెల్‌బోర్న్
ఐదో టెస్టు : జనవరి 03 జనవరి 07 సిడ్నీ

## డబ్ల్యూటీసీ ఫైనల్‌లో భారత్‌కు చోటు కష్టమే!

**ఆస్ట్రేలియాపై వరుసగా నాలుగు మ్యాచ్‌లు గెలిస్తేనే డబ్ల్యూటీసీ ఫైనల్‌లో చోటు**

**62.50 శాతం పాయింట్లతో అగ్రస్థానంలో ఆస్ట్రేలియా**

**కివీస్ చేతిలో ఓటమితో రెండో స్థానానికి పరిమితమైన భారత్**

**ఆస్ట్రేలియాను ఆ దేశ గడ్డపై ఓడించడం సులభం కాదంటున్న క్రికెట్ పండితులు**



**విశ్వంభర, క్రీడావిభాగం** : న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో దారుణంగా ఓడిన భారత్‌కు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌లో చోటు క్లిష్టంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో అద్భుతాలు జరిగినా టీమిండియాకు ఫైనల్‌లో చోటు దక్కేలా కనిపించడం లేదు. సొంతగడ్డపై కివీస్ చేతిలో వైట్ వాష్ అయిన భారత్ తాజా ఓటమితో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో కిందికి దిగజారింది.

న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ముందు జాబితాలో టాప్ ప్లేస్‌లో ఉన్న భారత జట్టు.. ఓటమి తర్వాత 58.33 శాతం పాయింట్లతో రెండో స్థానానికి దిగజారింది. ఆస్ట్రేలియా 62.50 శాతం పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. న్యూజిలాండ్ 54.55 శాతం పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది.

బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ కోసం భారత జట్టు త్వరలో ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. భారత జట్టు డబ్ల్యూటీసీ భవితవ్యాన్ని నిర్ణయించేది ఈ ట్రోఫీనే. ఈ ట్రోఫీలో భాగంగా మొత్తం ఐదు టెస్టులు జరగనుండగా డబ్ల్యూటీసీ ఫైనల్‌లో భారత్ చోటు సంపాదించుకోవాలంటే కనీసం నాలుగు మ్యాచుల్లో విజయం సాధించాలి. ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియాలో ఓడించడం అంత సులభమైన పనేమీ కాదు. కాబట్టి ఏరకంగా చూసినా భారత జట్టుకు డబ్ల్యూటీసీ ఫైనల్‌లో చోటు కష్టంగానే కనిపిస్తోంది. అంతేకాదు, అదే సమయంలో మూడు, నాలుగు స్థానాల్లో ఉన్న జట్ల ఫలితాలపైనా భారత్ అదృష్టం ఆధారపడి ఉంటుంది.

నిజానికి బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీలో భారత్ ఆధిపత్యం ప్రదర్శిస్తున్నప్పటికీ ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఏకబిగిన నాలుగు టెస్టులు గెలవడం దాదాపు అసాధ్యమని క్రికెట్ పండితులు చెబుతున్నారు. 201819, 202021 సీజన్లలో ఆస్ట్రేలియాపై రెండేసి విజయాలతో భారత్ సిరీస్ సొంతం చేసుకుంది. బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీని భారత్ 10 సార్లు సొంతం చేసుకుంటే, ఆస్ట్రేలియా ఐదుసార్లు గెలిచింది. 201415 సీజన్‌లో ఆస్ట్రేలియా చివరిసారి ఈ సిరీస్‌ను గెలుచుకోగా, 200405లో చివరిసారి భారత గడ్డపై సిరీస్ అందుకుంది.

## టెస్టు కెప్టెన్‌గా పంత్ !



**విశ్వంభర, క్రీడావిభాగం :** సొంతగడ్డపై తిరుగులేని భారత జట్టుకు మొట్టమొదటిసారి ఊహించని ఝలక్ ఇచ్చింది న్యూజిలాండ్. ఆల్‌రౌండ్ షోతో రోహిత్ శర్మ బృందాన్ని వైట్ వాష్ చేసి క్లీన్ స్వీప్‌తో టామ్ లాథమ్ జట్టు చరిత్ర సృష్టించింది. దాంతో, స్వదేశంలో బోణీ కొట్టకుండానే టెస్టు సిరీస్ సమర్పించుకున్న తొలి కెప్టెన్‌గా రోహిత్ చెత్త రికార్డు మూటగట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో మాజీ ఆటగాడు మహ్మద్ కైఫ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. హిట్‌మ్యాన్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించి .. వికెట్ కీపర్ రిషభ్ పంత్ ను నాయకుడిగా ఎన్నుకోవాలని అన్నాడు.

సుదీర్ఘ ఫార్మాట్‌లో పెద్దగా క్లిక్ కాని రోహిత్ శర్మ న్యూజిలాండ్‌పై కెప్టెన్‌గా, ఆటగాడిగా విఫలమయ్యాడు. ఇదే విషయాన్ని అతడు స్వయంగా అంగీకరించాడు కూడా. అందుకని సీనియర్లను తప్పించి రంజీల్లో చెలరేగుతున్న కుర్రాళ్లతో జట్టును నింపేయాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు. వాళ్ల మాటలతో ఏకీభవిస్తున్న కైఫ్ పంత్‌ను భావి కెప్టెన్‌గా అభివర్ణించాడు.

'ప్రస్తుతం జట్టులో ఉన్నవాళ్లలో కెప్టెన్సీకి పంత్ ఒక్కడే పోటీదారుడు కూడా. అందుకు అతడికి అన్ని అర్హతులు ఉన్నాయి. అతడు మైదానంలోకి దిగిన ప్రతిసారి జట్టు ప్రయోజనాలే లక్ష్యంగా ఆడుతాడు. అందుకని హిట్‌మ్యాన్ వారసుడిగా పంత్‌ను ప్రకటించాలి' అని కైఫ్ వెల్లడించాడు. పంత్ బ్యాటింగ్ నైపుణ్యాన్ని కైఫ్ పొగుడుతూ ఏం అన్నాడంటే.. 'పంత్ అన్నిరకాల పరిస్థితుల్లో పరుగులు సాధించాడు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా.. ఇలా కష్టమైన పిచ్‌ల మీద అతడు దంచేశాడు. పేస్, స్పిన్.. పిచ్ ఏదైనా సరే అందుకు తగ్గట్టు ఆడగల సమర్థుడు పంత్.

ఇంకా చెప్పాలంటే.. తన ఆఖరి టెస్టు అనంతరం ఓ దిగ్గజంగా వీడ్కోలు పలుకుతాడు. ఇప్పటికే పంత్ తాను ఎంత ప్రమాదకరమో చాటాడు. వాంఖడేలో అతడు క్రీజులో ఉన్నంత వరకూ న్యూజిలాండ్ జట్టుకు ఊపిరి ఆడలేదు' అని కైఫ్ వెల్లడించాడు. వాంఖడేలో జరిగిన మూడో టెస్టులో పంత్ అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. టాపార్డర్ విఫలమైన చోట ఇలా ఆడాలని చూపిస్తూ 64 పరుగులతో కివీస్ బౌలర్లను భయపెట్టాడు. అయితే.. లంచ్ అనంతరం అంపైర్ వివాదాస్పద నిర్ణయంతో డగౌట్ చేరగా.. ఆ తర్వాత 21 పరుగులకే టీమిండియా ఆలౌటయ్యింది.

నవంబర్ 22న తొలి టెస్టు

నవంబర్‌లో భారత జట్టు కీలకమైన సిరీస్ ఆడనుంది. ఆస్ట్రేలియా గడ్డపై బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీలో రోహిత్ సేన కమిన్స్ బృందాన్ని ఢీకొట్టనుంది. గతంలో వరుసగా రెండు విజయాలు సాధించినప్పటికీ.. కివీస్‌పై సిరీస్ ఓటమి టీమిండియా స్థయిర్యాన్ని దెబ్బతీసిందనే చెప్పాలి.

వైట్ వాష్ అవమానం నుంచి తొందరగా కోలుకుని కంగారూలను కంగారెత్తించాలి. లేదంటే మూడోసారి డబ్ల్యూటీసీ ఫైనల్ ఆడడం భారత్‌కు దాదాపు అసాధ్యమే. నవంబర్ 22న పెర్త్ వేదికగా ఇండియా, ఆసీస్‌లు తొలి టెస్టు ఆడనున్నాయి. మరో విషయం ఏంటంటే 1999 తర్వాత తొలిసారి బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీని ఐదు టెస్టుల మ్యాచ్‌గా నిర్వహిస్తున్నారు.

## ఐపీఎల్ 2025 మెగా వేలం ముహూర్తం ఫిక్స్

**రియాద్ అడ్డాగా వేలం**



**విశ్వంభర, క్రీడావిభాగం** : ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 మెగా వేలం నవంబరు 22, 23 తేదీల్లో జరిగే అవకాశం ఉందని ఐపీఎల్ వర్గాలు తెలిపాయి. అలాగే సౌదీ అరేబియా రాజధాని రియాద్ వేదికగా ఐపీఎల్ మెగా వేలం నిర్వహించే ఛాన్స్ ఉందని పేర్కొన్నాయి. ఇటీవలే ఐపీఎల్ ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్ ఆటగాళ్ల జాబితాను ప్రకటించాయి. ఈ నేపథ్యంలో ఐపీఎల్ వేలానికి ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది.

వేలంలోకి దిగ్గజ ఆటగాళ్లు

కాగా, ఐపీఎల్ 2025 సీజన్‌కు సంబంధించి పది ఫ్రాంఛైజీలు ఇటీవల రిటెన్షన్ లిస్టును వెల్లడించాయి. రూ. 558.5 కోట్ల పెట్టుబడి పెట్టి మొత్తం 46 మంది ఆటగాళ్లను ఐపీఎల్ ఫ్రాంచైజీలు అట్టిపెట్టుకున్నాయి. ఇందులో 36 మంది భారతీయులే ఉండటం గమనార్హం. అలాగే జోస్ బట్లర్, ఐడెన్ మార్ క్రమ్, గ్లెన్ మాక్స్‌వెల్, డు ప్లెసిస్, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్ వంటి ఆటగాళ్లను ఫ్రాంచైజీలు విడుదల చేశారు. దీంతో వీరందరూ ఐపీఎల్ 2025 మెగావేలంలోకి రానున్నారు.

తొలి టెస్టు మధ్యలోనే వేలం!

బోర్డర్‌గావస్కర్ ట్రోఫీలో భాగంగా నవంబర్ 22 నుంచి భారత్ ఆస్ట్రేలియా జట్ల మధ్య తొలి టెస్టు జరగనుంది. ఈ టెస్టు మధ్యలోనే ఐపీఎల్ వేలం నిర్వహిస్తారని సమాచారం. ప్రముఖ ఓటీటీ సంస్థ డిస్నీ ప్లస్ హాట్ స్టార్ వేదికగా ఈ ఆక్షన్ ప్రత్యక్ష ప్రసారం కానుంది. ఆసీస్ టైమింగ్‌కు ఎలాంటి ఇబ్బంది రాకుండా, రియాద్‌లో మధ్యాహ్నం సమయంలో ఈ ఆక్షన్ నిర్వహిస్తారని తెలుస్తోంది. అయితే ఈ సారి ఐపీఎల్ మెగా వేలంపై ఆసక్తి పెరిగిపోవడానికి కారణం భారత స్టార్లు ఉండటమే.

పంత్ భారీ ధర పలికే ఛాన్స్!

టీమ్ఇండియా హిట్టర్ రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, అర్ష్‌దీప్ సింగ్, ఇషాన్ కిషన్, మహ్మద్ సిరాజ్ తదితరులు తమ లక్‌ను ఈ మెగా వేలంలో పరీక్షించుకోనున్నారు. దూకుడు మీదున్న రిషభ్‌ను ఎవరు సొంతం చేసుకుంటారనే దానిపైనే అభిమానులకు ఆసక్తి నెలకొంది. వేలంలో భారీ మొత్తం అతడే సొంతం చేసుకుంటాడని అంచనా వేస్తున్నారు. రిషభ్ కనీసం రూ. 25 కోట్లు దక్కించుకుంటాడని భావిస్తున్నారు. కేఎల్ రాహుల్ కూడా రూ. 20 నుంచి రూ. 25 కోట్లు సొంతం చేసుకుంటాడని భారత మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు.

## బాక్సర్లకు 17 పతకాలు




**కొలరాడో (యూఎస్ఏ)** : అండర్ 19 ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ షిప్స్‌లో యువ భారత్ అదరగొట్టింది. టీమ్ ఇండియా నుంచి పోటీల్లో 19 మంది బాక్సర్లు బరిలోకి దిగగా.. ఏకంగా 17 బాక్సర్లు పతకాలు కొల్లకొట్టారు. కృష్ణ వర్మ పసిడితో మెరువగా.. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో మరో ముగ్గురు బాక్సర్లు స్వర్ణాలు సాధించారు. మహిళల 65 కేజీల విభాగంలో పార్థవి గ్రెవల్, మహిళల 80 కేజీల విభాగంలో వెన్సిక గోస్వామి, మెన్స్ 90 కేజీల విభాగంలో హేమంత్ సంగ్వాన్‌లు పసిడి పంచ్ విసిరారు. మహిళల విభాగంలో నిష (51 కేజీలు), సుప్రియ దేవి (54 కేజీలు), క్రితిక వాసన్ (80 కేజీలు), చంచల్ చౌదరి (48 కేజీలు), అజంలి సింగ్ (57 కేజీలు), విని (60 కేజీలు), ఆకాంశ (70 కేజీలు) సిల్వర్ మెడల్స్ సాధించారు. మెన్స్ విభాగంలో రాహుల్ (75 కేజీలు) రతజంతో మెరువగా.. రిషి సింగ్ (50 కేజీలు), క్రిశ్ పాల్ (55 కేజీలు), సుమిత్ (70 కేజీలు), ఆర్యన్ (85 కేజీలు), లక్ష్యరు (90 కేజీలు) కాంస్య పతకాలు దక్కించుకున్నారు. వరల్డ్ బాక్సింగ్ నిర్వహించిన తొలి టోర్నమెంట్‌లో పతకాల పంట పండించిన భారత్ మహిళల విభాగంలో ఓవరాల్ రన్నరప్‌గా నిలిచింది.

# తగ్గిన బంగారం, వెండి ధరలు

**వెల్లడించిన ఆలిండియా సరాఫా అసోసియేషన్**



**దిల్లీ:** పండగలు, వివాహాది శుభకార్యాల నేపథ్యంలో ఇటీవల వరుసగా దూసుకెళ్లిన బంగారం, వెండి ధరలు కాస్త నెమ్మదించాయి. సోమవారం కాస్త తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి ధర రూ.1300 మేర తగ్గి రూ.81,100కు చేరినట్లు ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర గురువారం గరిష్ఠంగా రూ.82,400 మేర పలికిన సంగతి తెలిసిందే. ఇటీవల కాలం లక్ష రూపాయల మార్కు దాటిన కిలో వెండి ధర సైతం దిగొచ్చింది. గురువారం రూ.99,500 పలకగా.. దిల్లీలో సోమవారం దీని ధర రూ.4600 తగ్గి రూ.94,900కు చేరింది. బంగారం వర్తకులు, రిటైలర్ల నుంచి ఆశించిన మేర డిమాండ్ లేకపోవడంతో బంగారం, వెండి ధరల తగ్గుముఖం పట్టడానికి కారణమని అనలిస్టులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా బంగారం ఔన్సు 2740 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి ఔన్సు 32.80 డాలర్లుగా ఉంది. నవంబర్ 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు, 7న ఫెడరల్ రిజర్వ్ 7న వడ్డీ రేట్ల ప్రకటన వంటి ప్రధాన ఈవెంట్లు ఈ వారంలో ఉన్నాయి. ప్రస్తుతం ఒపీనియన్ పోల్స్ ప్రకారం రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్, డెమోక్రాట్ అభ్యర్థి కమలా హ్యారిస్ మధ్య పోటాపోటీ నెలకొంది. మరో వైపు ఫెడ్ ఈ వారంలో 25 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ తగ్గించొచ్చని భావిస్తున్నారు. ఈ రెండు అంశాలు ఈ వారం బంగారం ధరలను దిశా నిర్దేశం చేయొచ్చని అనలిస్టులు చెబుతున్నారు. చైనా కూడా ఈ వారంలో ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించే అవకాశం ఉండడంతో ఇది కూడా అంతర్జాతీయంగా బంగారం ధరలను ప్రభావితం చేయొచ్చని భావిస్తున్నారు.

## తగ్గిన అశోక్ లేలాండ్ వాహన విక్రయాలు

**ముంబయి:** హిందూజా గ్రూప్‌కు చెందిన వాణిజ్య వాహన తయారీ సంస్థ అశోక్ లేలాండ్ వాహన అమ్మకాలు..అక్టోబర్‌లో 9 శాతం క్షీణించి 15,310 యూనిట్లకు పడిపోయాయని తెలిపింది. ఈ సంస్థ గతేడాది అక్టోబర్‌లో మొత్తం 16,864 వాహనాలను విక్రయించింది. ఈ అక్టోబర్‌లో ఎగుమతులతో సహా మొత్తం మధ్యస్థ, భారీ వాణిజ్య వాహన విక్రయాలు 9,408గా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే నెలలో విక్రయించిన 10,185 వాహనాలతో పోలిస్తే ఈ అక్టోబర్‌లో విక్రయాలు 8 శాతం పడిపోయాయని కంపెనీ తెలిపింది. తేలికపాటి వాణిజ్య వాహనాల విక్రయాలు కూడా ఏడాది ప్రాతిపదికన 12 శాతం తగ్గి 5,902 యూనిట్లుగా నమోదయ్యాయి. 2024 అక్టోబర్‌లో మొత్తం దేశీయ వాణిజ్య వాహనాలు, తేలికపాటి వాణిజ్య వాహన విక్రయాలు 11 శాతం తగ్గి 14,067కు చేరుకున్నాయి. ఇదే శ్రేణి వాహన విక్రయాలు గతేడాది అక్టోబర్‌లో 15,759 యూనిట్లుగా నమోదయ్యాయి.



# ఎఫ్ఎంసీజీ ధరల పెంపు తప్పదేమో!



### అధికమైన ఆహార ద్రవ్యోల్బణం

**దిల్లీ:** రోజువారీ వాడుకునే ఉత్పత్తుల ధరలు పెరిగే పరిస్థితులు కనపడుతున్నాయి. ఆహార ద్రవ్యోల్బణం అధికం కావడం, ముడి పదార్థాల వ్యయాలు పెరగడం, పట్టణ వినియోగం నెమ్మదించడం వల్ల దిగ్గజ ఎఫ్ఎంసీజీ కంపెనీల మార్జిన్లు సెప్టెంబరు త్రైమాసికంలో తగ్గాయి. పామాయిల్, కాఫీ, కోకోవా వంటి కమొడిటీల ధరలు పెరగడంతో, తమ ఉత్పత్తుల ధరలు పెంచుతామని కొన్ని ఎఫ్ఎంసీజీ కంపెనీలు సూచనప్రాయంగా తెలిపాయి. హెచ్‌యూఎల్, గోద్రేజ్ కన్జూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ (జీసీపీఎల్), మారికో, ఐటీసీ, టాటా కన్జూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ (టీసీపీఎల్) వంటి దిగ్గజ కంపెనీల మొత్తం విక్రయాల్లో పట్టణాల వాటాయే 6568 శాతం ఉంటోంది. నగరాలు, పట్టణాల్లో ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల వినియోగం తగ్గడం ఆందోళన కలిగిస్తోందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. 'ప్రస్తుత పరిస్థితి స్వల్పకాలమే ఉంటుంది. ఉత్పత్తుల ధరలు పెంచి, స్థిరమైన వ్యయ నియంత్రణ చర్యలతో మార్జిన్లు పెంచుకుంటామ'ని జీసీపీఎల్ ఎండీ, సీఈఓ సుధీర్ సీతాపతి పేర్కొన్నారు. గిరాకీ వాతావరణం సవాలు భరితంగా మారిందని డాబర్ ఇండియా పేర్కొంది. అధిక ఆహార ద్రవ్యోల్బణంతో పట్టణ గిరాకీ సన్నగిల్లిందని తెలిపింది. సెప్టెంబరు త్రైమాసికంలో ఈ సంస్థ నికర లాభం తగ్గింది. నెస్లే ఇండియా ఛైర్మన్, ఎండీ సురేశ్ నారాయణన్, టీసీపీఎల్ ఎండీ, సీఈఓ సునీల్ డిసౌజా, హెచ్‌యూఎల్ సీఈఓ, ఎండీ రోహిత్ జావా తదితరులు కూడా గిరాకీ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు.

విశ్వంభర V3 NEWS

## బీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షుడిగా నక్క శరత్ కుమార్



**విశ్వంభర, ఎల్బీనగర్ :** బీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షుడు గా నక్క శరత్ కుమార్ నియామకం అయ్యాడు. ఈ మేరకు సోమవారం బీమ్ ఆర్మీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శరత్ కుమార్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి, నిజం, రాజు ,శ్రీధర్ పాల్గొన్నారు.

## వైకుంఠధామం పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ బన్నాల



**విశ్వంభర, సికింద్రబాద్ :** చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ సోమవారం డివిజన్లోని మూడు కోట్ల వ్యయంతో చేపడుతున్న వైకుంఠధామం పనులను జీహెచ్ఎంసీ అధికారులు డీఈ వెనల్ కుమార్ గౌడ్, ఏఈ వినీత రావుతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ.. వచ్చే వారంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టే వైకుంఠధామం శంకుస్థాపన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో లాంచనంగా చేపడతామన్నారు. మూడు కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వైకుంఠధామం పనులలో ఎటువంటి నాణ్యత లోపాలు లేకుండా, అన్ని వసతులు ఉండే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, బాలకృష్ణ గౌడ్, మల్లికార్జున్ నగర్ అధ్యక్షులు అశోక్ చారి, బొల్లం లక్ష్మణ్, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్ కాంట్రాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# మూసీ బాధితులను రోడ్డున పడేస్తే తీవ్ర ప్రతిఘటన



**విశ్వంభర, హైదరాబాద్:** మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో బాధితులను రోడ్డున పడేస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని అఖిల పక్ష పార్టీల నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మూసీ నది బాధితుల సమస్యల శాశ్వత పరిష్కారానికి ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ , సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో సోమవారం అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షత వహించగా దాసోజు శ్రవణ్, రాగిడి లక్ష్మ రెడ్డి (బిఆర్ఎస్), కె. గోవర్ధన్ (సిపిఐ, ఎంఎల్, న్యూ డెమోక్రసీ), కావ్య (జనసేన), కృష్ణ యాదవ్ (ఫార్వర్డ్ బ్లాక్), సయ్యిద్ మతీన్ అహ్మద్ (టిడిపి), సంజయ (మూసీ జన్ అందోళన్), ఆఫస సలాం (మూసీల విక్టిమ్ రైట్స్), సిల్వేరి శ్రీశైలం, వర్గీస్ (సంఘసేవకులు) లతోపాటు పర్యావరణ శాస్త్రవేత్తలు, మేధావులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో అందరికి దడ పుట్టించి, మూసీ సుందరీకరణ పేరుతొ చడీ చప్పుడు లేకుండా పరీవాహక ప్రాంతం లో దశాబ్దాలుగా నివసిస్తున్న 300 మంది పేదల ఇళ్లను కూల్చి, వేలాది ఇళ్లకు ఎరుపు గుర్తులు వేసి కుటుంబాలకు తీవ్ర ఆందోళనకు గురి చేస్తోందని మండిపడ్డారు. మూసి నదీ ప్రక్షాళన, సుదరీకరణకు ఎవరూ వ్యతిరేకం కాదని, ఈ ప్రాజెక్టు చేపట్టేముందు అన్ని రాజకీయ పార్టీలతో, అఖిలపక్ష కమిటీ ఏర్పాటు, పర్యావరణ శాస్త్రవేత్తలు, మేధావుల సలహాలు, సూచనలతోపాటు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ప్రకటన, అనుమతులు, పునరావాస విధానాలను రాష్ట్ర ప్రభుత్వం తెలియజేయాలన్నారు. మూసీ బాధిత కుటుంబాల్లో ఎక్కువగా కూలి పనులు చేసేవాళ్లు, మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వర్గాలకు చెందిన వాళ్ళు ఉన్నారని, వారిని రోడ్డున పడేస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదన్నారు. మూసీ నివాసతులని తొలగించే అన్ని ప్రయత్నాలను వెంటనే ఆపాలని, డీపీఆర్ నీ తక్షణమే ప్రకటించాలని, బాధితులకు పునరావాసం కల్పించాకే మూసీ నది పునరుద్ధరణ చేపట్టాలని డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ మూసీ ప్రాజెక్టు పేరుతో పేదల ఇండ్లు కూల్చుతామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పేదల ఇళ్లపై బుల్ డోజర్ల ఉపయోగాన్ని రాహుల్ గాంధీ వ్యతరేకిస్తే, తెలంగాణ లోముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల ఇళ్లను లక్యంగా చేసుకొని బుల్ డోజర్ల లతో కూల్చడం దారుణమన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో ఉంటున్న పేదల ఇండ్లను కూల్చివేస్తామంటే, వారు ఎక్కడికి పోవాలని, రాష్ట్ర ప్రభుత్వమే వారికీ శాశ్వత పునరావాసం కల్పించి పనులు చేపట్టాలన్నారు, మూసీ బాధితులకు తమ పార్టీ అండగా ఉంటుందని, వారి తరపున పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, డా. అన్సారీ, ఎంఏ. మజీద్, మహిళా విభాగం అధ్యక్షులు హేమ జిల్లోజు, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ యమునా గౌడ్, అధికార ప్రతినిధులు జావీద్ షరీఫ్, ఖలీమ్ బాబా, విజయ్ మల్లంగి, సమీర్, మొహమ్మద్ సోహైల్, లాక్షా నాయుడు, దర్శనం రమేష్, అహసాన్, మౌనికా, శివాజీ, సందీప్, తివారి, తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ బడంగ్ పేట్ మున్సిపల్ కార్యాలయం

### చెరుకుపల్లి వెంకటరెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం:** బాలాపూర్ మండల కేంద్రం బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందని బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట రెడ్డి అన్నారు. సోమవారం నాడు బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటరెడ్డి మాట్లాడుతూ బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బడంగ్ పేట నుండి ఆదిభట్ల టిసిఎస్ రోడ్ నెంబర్ 26 లో రోడ్డుకు ఇరువైపులా భారీగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఈ సందర్భంగా పాలకవర్గాన్ని అడుగుతున్న ఈ రోడ్డు ప్రతిపాదన ఉందా అదే అది మీ దృష్టికి వచ్చిందా. ఈ రోడ్డు పై మీకు అవగాహన ఉందా అని వెంకటారెడ్డి ప్రశ్నించారు. మీకు తెలిసి ఉంటే రోడ్ నెంబర్ 26 లో 100 ఫీట్లకు కుదించారు. గతంలో నాలుగు గోడల మధ్య మధ్య తీర్మానం చేశారు. అన్ని పనులకు తీర్మానం చేసినట్టుగా ఈ రోడ్డు కూడా అలాగే చేశారా. తీర్మానం చేసినప్పుడు అన్ని పనులకు ఆమోద ముద్ర పడినట్టు ఈ రోడ్డు కూడా ఆమోదం ముద్ర వచ్చిందా దీనిని ప్రభుత్వ పరిశీలన చేసిందా. గెజిట్ వచ్చిందా అని ఆయన ప్రశ్నించారు. రోడ్డు కిరువైపులా 100 ఫీట్లకు సెట్ బ్యాక్ చేసుకొని భారీగా సెల్లార్ తీసి నాలుగు ఐదు అంతస్తులు నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయమై కమిషనర్ మేయర్ కి స్వయంగా ఫిర్యాదు చేయడం జరిగింది. అయినప్పటికీ మేయర్ కమిషనర్ స్పందించలేదు రోడ్డు కిరువైపులా భారీగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన మేయర్ కమిషనర్ ఎందుకు పట్టించుకోలేదని ఆయన ప్రశ్నించారు.
ఎన్నోసార్లు ఎన్నో పత్రికలలో వచ్చిన మేయర్ కమిషనర్ స్పందించకపోవడం ఇంతకన్నా దారుణం ఉంటుందా అని ఆయన అన్నారు. బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ లో జరుగుతున్న అవినీతి అక్రమాలకు కబ్జాలకు నీటికే మేయర్ కమిషనర్ ఉచితంగా సమాధానం చెప్పే వరకు బిజెపి పోరాటం చేస్తుందని వెంకటరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట బీజేవైఎం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ను విజయవంతం చేయండి




**విశ్వంభర, మిర్యాలగూడ :** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ను విజయవంతం చేయాలని విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ అన్నారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఆఫీస్ లో సబ్ కలెక్టర్ రెండు అంశాలపై ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ మీట్ లో సామాజిక, ఆర్థిక ,విద్య, ఉపాధి, రాజకీయ కుల, సమగ్ర ఇంటింటి సర్వే కుటుంబ సర్వే రేషన్ డీలర్ల భర్తీ అంశాలను వివరించారు. ఈనెల ఆరో తారీకు నుంచి జరిగే సామాజిక ,ఆర్థిక, విద్య, ఉపాధి ,రాజకీయ ,కుల (సమగ్ర ఇంటింటికి కుటుంబ సర్వే) కు ప్రజలు అందుబాటులో అందుబాటులో ఉండి ఎమున్యేరేటర్లకు సహకరించి విజయవంతం చేయాలని తెలుపుతూ , ప్రథమంగా 6 తారీకు నుంచి ప్రారంభయే సర్వేలో ప్రథమ దశలో ఎమున్యేరేటర్లు వారికి కేటాయించిన ఇంటింటికి వెళ్లి మార్కింగ్ చేస్తారు. ఈ సర్వేలో చాలావరకు ఉపాధ్యాయులు శిక్షణ పొంది తద్వారా ఈ సర్వేలో పాల్గొననున్నారు.

## చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు

- చట్టం ముందు అందరూ సమానులే
- మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేయాలి
- జిల్లా అడిషనల్ ఎస్పీ రామేశ్వర్
- గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



**విశ్వంభర, తెలకపల్లి :** భారత రాజ్యాంగం ప్రకారం 14వ నిబంధన చట్టం ముందు అందరూ సమానులే అని ప్రతి ఒక్కరూ గ్రామాలలో నేటికి కొనసాగుతున్న మూఢ నమ్మకాల నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా అడిషనల్ ఎస్పి రామేశ్వర్ అన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో న్యాయ సలహాలు సైబర్ క్రైమ్ అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చట్టాన్ని అతిక్రమించరాదని సూచించారు. కొంతమంది యువకులు ఈ మధ్యకాలంలో కొన్ని మాదకద్రవ్యాలకు అలవాటు పడి ఇబ్బందులకు గురి అవుతున్నారని వాటి వల్ల సమాజంలో అశాంతి ఏర్పడి కుటుంబాలలో సమాజంలో గౌరవం తగ్గి శిక్షలకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా కుటుంబ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో విపరీతమైన మూఢనమ్మకాల వల్ల కుటుంబాలలో క్షణిక కావేశాలలో తప్పుడు నిర్ణయాల వల్ల కుటుంబాలలో ఇబ్బందులు జరుగుతున్నాయని ఇటీవల జరుగుతున్న కొన్ని నేరాలపై అవగాహన కల్పించారు. గ్రామాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజలు అడిగిన సమస్యలను వారు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ కనకయ్య , స్థానిక ఎస్సై బి నరేష్, గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు




Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com